

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 3-6-2025 | పేజీలు: 16+6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 65 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా.9.57 తదుపరి నవమి; నక్షత్రం: పుబ్బ రా.12.59 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.7.37-9.21; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.18-11.01; అమృతఘడియలు: సా.6.02-7.46; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



All India Open Category Top 1000 Ranks



AIR 116, AIR 118, AIR 127, AIR 131, AIR 132, AIR 133, AIR 134, AIR 136, AIR 156, AIR 160, AIR 163, AIR 165, AIR 183, AIR 189, AIR 191, AIR 193

AIR 201, AIR 203, AIR 205, AIR 211, AIR 215, AIR 218, AIR 219, AIR 230, AIR 232

AIR 238, AIR 247, AIR 249, AIR 255, AIR 266, AIR 270, AIR 278, AIR 279, AIR 280

AIR 306, AIR 308, AIR 309, AIR 313, AIR 315, AIR 318, AIR 320, AIR 322, AIR 324

AIR 329, AIR 330, AIR 332, AIR 341, AIR 345, AIR 357, AIR 367, AIR 369, AIR 376

AIR 384, AIR 387, AIR 389, AIR 399, AIR 400, AIR 410, AIR 415, AIR 419, AIR 420

AIR 422, AIR 442, AIR 450, AIR 464, AIR 467, AIR 470, AIR 477, AIR 479, AIR 482

AIR 501, AIR 504, AIR 509, AIR 513, AIR 514, AIR 521, AIR 535, AIR 544, AIR 546

AIR 551, AIR 557, AIR 573, AIR 575, AIR 582, AIR 589, AIR 598, AIR 617, AIR 618

AIR 629, AIR 635, AIR 638, AIR 644, AIR 648, AIR 660, AIR 672, AIR 673, AIR 674

AIR 683, AIR 689, AIR 694, AIR 698, AIR 700, AIR 710, AIR 729, AIR 733, AIR 736

AIR 737, AIR 741, AIR 745, AIR 748, AIR 756, AIR 763, AIR 771, AIR 772, AIR 777

AIR 779, AIR 781, AIR 785, AIR 786, AIR 788, AIR 789, AIR 791, AIR 794, AIR 805

AIR 807, AIR 809, AIR 810, AIR 816, AIR 841, AIR 846, AIR 850, AIR 856, AIR 860

AIR 861, AIR 866, AIR 888, AIR 889, AIR 906, AIR 910, AIR 928, AIR 948, AIR 949

AIR 981, AIR 984, AIR 989

...and many more

JEE ADV. 2025 NARAYANA RANK ANALYSIS IN OPEN CATEGORY

< = 10	< = 50	< = 100	< = 1000
5 RANKS	23 RANKS	43 RANKS	200 RANKS

ADMISSIONS ARE IN PROGRESS FOR ALL COURSES 2025-26

IIT-JEE/NEET LONG TERM — First Batch : 05-06-2025 | Second Batch : 16-06-2025

TOTAL RANKS IN ALL CAT. 4311

SRAMAYEVA JAYATHE

NARAYANA® EDUCATIONAL INSTITUTIONS

Toll Free: 1800 102 3344 #YourDreamsAreOurDreams www.narayanagroup.com

Disclaimer: Any inadvertent error published in this advertisement could be brought to our notice

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 3-6-2025 | పేజీలు: 16+6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 65 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా.9.57 తదుపరి నవమి; నక్షత్రం: పుబ్బ రా.12.59 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.7.37-9.21; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.18-11.01; అమృతఘడియలు: సా.6.02-7.46; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

SRI CHAITANYA JEE ADVANCED 2025 RESULTS

IIT-JEE వంటి అత్యున్నత పోటీ పరీక్షల్లో కఠినమైన మ్యాథ్స్, ఫిజిక్స్‌ని శ్రీచైతన్య శాస్త్రీయ ప్రణాళికలతో ఛాలెంజ్‌గా ఎదుర్కొని టాప్ ర్యాంకులు సాధించిన శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థులు

Infinity Learn

ఆలిండియా ఆల్ కేటగిరిలో 10 లోపు 8 ర్యాంకులు

RANK	Name	HT. NO.
1	VANGALA AJAY REDDY	256131000 ॥
3	MAJID HUSAIN	251134112 *
4	P H S SURYA KARTHIK	255023006 *
5	ARYAN BALABADRULA	256132077 ^
5	UJJWAL KESARI	252016104 *
6	C AKSHAT KUMAR	254065055 *
7	RUSHMITH BANDARI	256168048 ^
8	K RASAGNYA	256057046 ^

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1000 లోపు 205 ర్యాంకులు



IIT-JEE ADVANCED-2025లో టాప్ ర్యాంకర్లతో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ. దేశం నలుమూలల నుంచి వేలాది మందిని IIT గమ్యానికి చేర్చిన ఘనత - ఒక్క శ్రీచైతన్యదేనని ఈ సందర్భంగా అన్నారు.

RANK 101, 103, 105, 109, 110, 115, 117, 122, 126, 140, 153, 158, 166, 170, 173, 182, 184, 185, 195, 196, 197, 199, 213, 216, 233, 234, 236, 239, 245, 261, 267, 269, 271, 276, 284, 290, 295, 299, 302, 303, 304, 322, 323, 325, 327, 328, 334, 335, 340, 341, 343, 349, 352, 353, 361, 364, 373, 374, 381, 386, 392, 396, 398, 406, 409, 412, 421, 428, 429, 431, 432, 439, 440, 441, 447, 449, 454, 455, 461, 465, 471, 475, 489, 490, 496, 512, 515, 523, 524, 526, 537, 547, 548, 550, 563, 571, 574, 579, 583, 590, 595, 600, 604, 606, 619, 627, 633, 637, 647, 652, 654, 656, 657, 659, 661, 663, 671, 674, 685, 687, 690, 693, 706, 707, 709, 712, 720, 721, 724, 731, 732, 744, 746, 750, 752, 757, 759, 762, 784, 792, 793, 799, 806, 820, 822, 826, 831, 838, 840, 847, 863, 874, 876, 886, 890, 891, 913, 918, 919, 921, 922, 923, 924, 928, 930, 935, 944, 950, 951, 954, 963, 976, 983, 991, 993

IIT-JEE & NEET LONG-TERM 2026

FOR NEET ADMISSIONS CONTACT : 040 66 06 06 06

IIT-JEE LONG-TERM మొదటి బ్యాచ్ క్లాసులు ప్రారంభం: 6 జూన్ 2025

FEES CONCESSIONS

ALL INDIA / STATE RANKS	JEE MAIN-2025	JEE ADV-2025	AP EAPCET-2025	TS EAPCET-2025
<=2500	100%	100%	80%	80%
<=5000	100%	100%	60%	60%
<=10000	75%	75%	30%	30%
<=20000	50%	50%	20%	20%
SC/ST/PW BEST RANKERS	60%	60%		

*Best of one is taken into Consideration

HYDERABAD
NARSINGI - 91774 22235, 91777 36808 (BOYS)
MADHAPUR - AKSHARA LT - 89777 14781
KONDAPUR - GIRLS - 91770 46533, 91000 91871

VIJAYAWADA
GUDAVALLI - RAMAN BHAVAN-01: 97040 65666, 9701911666
GAYATHRI CAMPUS DAYS: 96763 98777, 91775 50944

VISAKHAPATNAM
ASILMETTA - RAMAN BHAVAN-2: 91772 06961, 91776 39378
PEDDIPALEM - RAMAN BHAVAN BOYS RESIDENTIAL: 97058 30168, 91775 32995
BOYAPALEM - RAMAN BHAVAN GIRLS RESIDENTIAL: 94940 12024, 91772 01369

Know Your Place Among Crores of Students
Want to Know Your level for National Success? Discover the Only Way to Find Out...
India's largest scholarship amount
Get UPTO 100% SCHOLARSHIP*
• NASA Trips
• Gadgets
• Cash Prizes

SCORE 2025 — FOR GRADES 7-12 — INDIA'S LARGEST SCHOLARSHIP EXAM

For students of classes 3 to 11 (CBSE & STATE)
శ్రీచైతన్య స్కూల్
Sri Chaitanya Educational Institutions | Infinity Learn
Exam Dates
28 సెప్టెంబర్ & 12 అక్టోబర్ 2025

Scan the QR code for Registration

శ్రీచైతన్య విద్యాసంస్థలు

SCHOOL: 040 7104 5045 | COLLEGE: 040-6606 0606 | SCORE: 1800 121 600 600 | INFINITY LEARN: www.infinitylearn.com/score

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 3-6-2025 | పేజీలు: 16+6 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 65 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా.9.57 తదుపరి నవమి; నక్షత్రం: పుబ్బ రా.12.59 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.7.37-9.21; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.18-11.01; అమృతఘడియలు: సా.6.02-7.46; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎల్ అండ్ టీ నుంచి ఖర్చు రాబట్టండి!

ఏడో బ్లాక్ నష్టాన్ని వసూలు చేయాలి.. క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టండి

33 మందిపై శాఖాపర చర్యలు.. 17 మందిపై అభియోగాలు మోపండి

ఏడుగురిపై జరిమానాలు.. ముఖ్య కార్యదర్శుల పైనా చర్యలు

మేడిగడ్డ వైఫల్యంపై రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ కమిషన్ సిఫారసులు

11న కాళేశ్వరం విచారణకు కేసీఆర్

ఆయన విజ్ఞప్తి మేరకు హాజరు తేదీ మార్పు


బ్లాక్-7 బాధ్యత
తప్పించుకోలేరు

మేడిగడ్డ కుంగుబాటు నిర్మాణ వైఫల్యమే

తొలగించినా, సురక్షితం చేయాలన్నా మీ పనే

ఎల్ అండ్ టీతో ప్రభుత్వం

10



ఐపీఎల్ ఫైనల్ నేడే బెంగళూరుతో పంజాబ్ ఢీ
5

నీట్ పీజీ వాయిదా త్వరలో కొత్త తేదీ
8


హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో గౌరవవందనం స్వీకరిస్తున్న సీఎం రేవంత్

ప్రగతే మా పథం

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం

2047కి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

న్యూయార్క్, టోక్యోతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

9 మంది ప్రముఖులకు నగదు పురస్కారాలు

రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే, రాహుల్

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పారదర్శక పరిపాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. 2047 నాటికి తెలంగాణను నంబర్‌వన్ స్థానంలో నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో

మిగతా 9వ పేజీలో...

తెలంగాణలో ఎకోటౌన్ నిర్మాణం!

8 జపాన్‌లోని కిటాక్యుషుతో సర్కార్ ఒప్పందం

హైదరాబాద్ జోన్ టాప్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయి టాప్-10లో మనోళ్లు ఇద్దరు

అత్యధికంగా 12,946 మంది అర్హత

ఢిల్లీ విద్యార్థి రజిత్ గుప్తాకు మొదటి ర్యాంకు

332 మార్కులు సాధించిన విద్యార్థి

బాలికల్లో దేవదత్త మాఝీ ఫస్ట్

మొత్తం 1.80 లక్షల మంది పరీక్ష రాయగా.. అర్హత సాధించిన 54,378 మంది

11

ముందే ముగిసిన వేసవి

అంచనాల కంటే ముందే రుతుపవనాలు

అకాల వర్షాలతో చల్లబడిన వాతావరణం

8

'బనకచర్ల'కు సాయం చేయండి

- కేంద్రానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వినతి
- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖతో అధికారుల భేటీ
- సమగ్ర రిపోర్టు అందిస్తే నిధుల విడుదలపై కార్యాచరణ.. కేంద్ర అధికారుల హామీ

10



ఆహ్లాదం... ఆధ్యాత్మికం.. మినీ శిల్పారామం

» యాదగిరిగుట్ట సమీపంలో ప్రారంభం



బోటింగ్ చేస్తున్న ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు

యాదాద్రి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భక్తులు ఆహ్లాదకరంగా గడిపేందుకు మినీ శిల్పారామాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. యాదగిరిగుట్ట సమీపంలోని రాయగిరి చెరువు అలుగుపోసే ప్రాంతంలో నిర్మించిన శిల్పారామాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం రాయగిరి చెరువులో బోటింగ్ చేశారు. రూ.2కోట్ల వ్యయంతో రెండు ఎకరాల్లో మినీ శిల్పారామాన్ని ప్రభుత్వం ఆకట్టుకునేలా నిర్మించింది. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేదతీరేందుకు మైదానాన్ని సిద్ధం చేశారు. విభిన్న రుచులు అందించేందుకు ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేశారు. పచ్చదనం, పార్కులు, చిన్నపిల్లల ఆటల ప్రాంగణం, చెరువులో ఫౌంటెయిన్, పర్యాటకులు సేదతీరేలా చిన్న కుటీరాలు, చెరువులో జలవిహారానికి బోటింగ్ సదుపాయం కల్పించారు.

21వేల కోట్ల రుణాలిచ్చినట్లు నిరూపిస్తే..

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా!

బనకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు వెళ్లి అడ్డుకుంటాం

» బీఆర్ఎస్ ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోదు

» హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు రూ.21 వేల కోట్ల మేర వడ్డీలేని రుణాలిచ్చినట్లు నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు సవాల్ విసిరారు. పదేపదే అబద్ధాలు చెబుతూ.. మహిళలను మోసగించడం తగదని హితవు పలికారు. రూ.21 వేల కోట్ల రుణాలిచ్చినట్లు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం చెప్పేవన్నీ అబద్ధాలని, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, చేపట్టిన పరీక్షలకు సంబంధించినవే తప్ప.. కాంగ్రెస్ హయాంలో పదివేలు కూడా దాటలేదన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కూడా రేవంత్ నిజాలు మాట్లడటం లేదని ఎద్దేవా చేశారు. "ఏడాది పాలనలో రేవంత్ చేసిందేముంది? ఢిల్లీకి కప్పం కట్టడం తప్ప. ఒక్క ఎకరాకు నీళ్లిచ్చావా? ఏదైనా ప్రాజెక్టు కట్టావా? కనీసం చెక్ డ్యాం నిర్మించావా? ఒక చెరువైనా తవ్వినట్లుంటే చెప్పాలి" అని నిలదీశారు. పోలవరానికి జాతీయ హోదా ఇవ్వడమేకాకుండా.. తెలంగాణకు శాపంగా మారనున్న గోదావరి బనకచర్ల లింకు అక్రమ ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వడంపై కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఈటల రాజేందర్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృష్ణాలో మనవాటా వాడుకునే తెలివిలేదని, తెలంగాణపై ప్రేమ ఉంటే బనకచర్ల ప్రాజెక్టు ఆపాలని డిమాండ్ చేశారు. బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే.. బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టుకు వెళ్లి.. ఆ ప్రాజెక్టును అడ్డుకుంటామన్నారు. సచివాలయానికి బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టినందుకే.. సమీక్షలను పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో చేస్తున్నావా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. ప్రపంచ సుందరి పోటీలు చేపట్టి తెలంగాణకు చెడ్డపేరు తెచ్చారని హరీశ్ విమర్శించారు. "మిల్లీమ్యాగీతో నీకు సన్నిహితంగా ఉండే ఒక ఎంపీ, ఒక కార్పొరేషన్ చైర్మన్ అసభ్యంగా ప్రవర్తించారని వస్తున్న వార్తలపై సమాధానం చెప్పాలి. అందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని వెంటనే బహిర్గతం చేయాలి. అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సీఎంను డిమాండ్ చేశారు. పథకాలకు పైసలు లేవంటూ.. ప్రపంచ సుందరి పోటీలకు రూ.200 కోట్లను ఎక్కడి నుంచి తెచ్చి, ఖర్చుచేశారని నిలదీశారు. కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్లకు రూ.12 వేల కోట్ల బిల్లులను ఎలా ఇచ్చారో చెప్పాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే.. విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల పట్ల భట్టి విక్రమార్కకు ప్రేమలేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. బీజేపీతో పొత్తు ఉంటుందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ప్రజలు స్పష్టతతో ఉన్నారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా.. 100 సీట్లతో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తే.. రెడ్‌బుక్‌లో వివరాలు నోట్ చేసుకుంటామని హెచ్చరించారు.

వరి నాట్లు వేసే నాటికి రైతు భరోసా

» బీఆర్ఎస్ హయాంలో 'రైతు సంక్షోభం'

» అప్పులన్నీ తీర్చుతూ వ్యవస్థలను చక్కదిద్దుతున్నాం: మంత్రి తుమ్మల



ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/హైదరాబాద్, జూన్ 2 : వరి నాట్లు వేసే నాటికి రైతులందరికీ రైతు భరోసా అందించి తీరతామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై కొందరు బీఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. వారి ఇంటిలో కుంపటి ఆర్పుకోలేక తమపై విమర్శలు చేస్తే.. తాము అంతకు రెండింతలు విమర్శించి తీరతామని అన్నారు. గత పాలకులు రైతు రుణమాఫీ ఎలా చేశారో రైతులకు తెలుసని, వారి పాపాలతో గత ఐదేళ్ల రైతు సంక్షేమ పథకాలు మట్టిపాలయ్యాయని మండిపడ్డారు. అన్ని వ్యవస్థలు, సంస్థలను అప్పుల్లోకి నెట్టి వెళ్లిపోతే, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులన్నీ తీర్చుతూ, వ్యవస్థలను చక్కదిద్దుతూ రైతు సంక్షేమాన్ని గాడిలో పెట్టిందన్నారు ఒకేసారి రూ.35వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదని గుర్తుచేశారు. కేంద్రం నుంచి పథకాలు తెచ్చుకోకుండా, నిధులు రాకుండా చేశారని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేంద్ర పథకాలను గాడిలో పెట్టామని, రైతులకు బిందుసేద్యం వంటి పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నిర్వాకంతో రైతు సంక్షేమం దెబ్బతిన్నదని, విత్తన సంస్థలకు రూ.350కోట్లు అప్పులుపెడితే తామే వాటిని తీర్చామని తుమ్మల తెలిపారు.

బీఆర్ఎస్‌ది మాటల సర్కారు

బీఆర్ఎస్‌ది మాటల ప్రభుత్వమైతే తమది చేతల ప్రభుత్వమని మంత్రి తుమ్మల విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఎగ్గొట్టిన రైతు బంధును తాము వచ్చాక రూ.7,600 కోట్లు చెల్లించామని తెలిపారు. పంట నష్టం సంభవించినపుడు రైతులను కనీసం పరామర్శించలేదని గత సర్కారును విమర్శించారు. రుణమాఫీ సగం మందికే చెల్లించారని ఆరోపించారు. తాము రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని చెప్పారు. గత సర్కారు వరి వేస్తే ఉరి అని భయపెడితే.. తాము సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ, రైతులందరికీ డ్రిప్ పరికరాల అందజేత, విత్తన సబ్సిడీ, అన్ని పంటలకు మద్దతు ధర, శిక్షణ కార్యక్రమాలు, మట్టి నమూనా పరీక్షలు, ఇలా అన్ని కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తుమ్మల ఒక ప్రకటనలో తెలిపారు.

క్షణాల్లో వాతావరణ సమాచారం

» షార్‌తో ఆర్‌టీజీఎస్ కీలక ఒప్పందం

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉపగ్రహం ద్వారా క్షణాల్లో వాతావరణ సమాచారం అందించేలా షార్ (ఇస్రో)తో రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కీలక ఒప్పందం చేసుకుంది. వెలగపూడి సచివాలయం ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ సమక్షంలో ఐదేళ్లపాటు వాతావరణ సమాచారాన్ని అందించేలా షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఆర్‌టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం వల్ల వాతావరణానికి సంబంధించిన సమాచారం ఉపగ్రహ ఛాయాచిత్రాలతో సహా ఆర్‌టీజీఎస్‌కు చేరతాయి. ఇలా చేరిన సమాచారం ఆధారంగా ఆర్‌టీజీఎస్ అధికారులు ఎస్ఎంఎస్‌లు, సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తారు. సాంకేతిక సహకారాన్ని అందించేందుకు షార్ ముందుకొచ్చి, రాష్ట్రంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీలోని గుంటూరు నగరంలో సోమవారం రెండు కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదైనట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ వెల్లడించారు. బాధితులను ఆస్పత్రిలో చేర్చుకొని వైద్యచికిత్స అందిస్తున్నారు.

రాజన్న గోశాలలో మరో మూడు కోడెల మృతి

సిరిసిల్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాలలో సోమవారం మరో 3 కోడెలు మృతిచెందాయి. దీంతో మృతిచెందిన కోడెల సంఖ్య 20కి చేరింది. కోడెల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ప్రస్తుతం 16 కోడెలు అనారోగ్యంతో ఉన్నాయని, వీటిలో 6 కోడెల పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఐదుగురు వైద్యులు, 12 మంది సిబ్బందితో శిబిరం ఏర్పాటు చేసి కోడెలకు చికిత్స అందిస్తున్నారు.

చచ్చేవారికి సిరప్ ఎందుకు?

» రెండేళ్ల పాపను ఆస్పత్రికి తీసుకెళితే డాక్టర్ వ్యాఖ్యలు

» ఉన్నతాధికారులకు ఆ చిన్నారి తండ్రి ఫిర్యాదు

చేర్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతకు గురైన రెండేళ్ల బాలికను ఆస్పత్రికి తీసుకెళితే.. "చచ్చేవాళ్లకు సిరప్ ఎందుకు?" అని అనుచిత వ్యాఖ్యలు చేశాడు ఆ వైద్యుడు. సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రభుత్వాస్పత్రిలో ఈ ఘటన జరిగింది. ఆ పట్టణానికి చెందిన డి.అనిల్‌కుమార్ కూతురు సుదీక్ష (2) ఆదివారం రాత్రి 11గంటలకు తీవ్ర అస్వస్థతకు గురైంది.. అప్పటికే ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులు బంద్ కావడంతో కూతురును అనిల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. డ్యూటీలో ఉన్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తికి.. తన కూతురు కడుపునొప్పితో ఏడుస్తోందని, చికిత్స చేయాలని, ఏదైనా సిరప్ ఇవ్వాలని ప్రాధేయపడ్డాడు. అయితే ఆ వైద్యుడు, అనిల్‌పై రుసరుసలాడుతూ.. సచ్చేటోళ్లకు సిరప్‌లు పోయరు. గ్లూకోజ్‌లు, ఇంజెక్షన్‌లే ఇస్తాం. ఆర్నెల్లుగా ఆస్పత్రిలో మందులే లేవు" అని మండిపడ్డాడు. ఇలా మాట్లాడుతున్నారేమిటి? అంటూ అనిల్ ప్రశ్నించగా.. "ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తారా? ఇక్కడ కాకపోతే ఏ చెట్టుకింద కుర్చీ వేసుకొని కూర్చున్నా నేను బతకగలను" అని కల్యాణ్ నిర్లక్ష్యంగా మాట్లాడారు. దిక్కుతోచని స్థితిలో కూతురును తీసుకొని అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయిన అనిల్.. తనకు పరిచయం ఉన్న మెడికల్ షాపు నిర్వాహకుడి ఇంటికి వెళ్లి.. షాపు ఓపెన్ చేయించి, సిరప్ బాటిల్ తీసుకెళ్లాడు. కాగా, డాక్టర్ కల్యాణ్‌పై ఇన్‌చార్జి డాక్టర్ దామోదర్‌కు లిఖితపూర్వకంగా, జిల్లా కోఆర్డినేటర్‌కు ఫోన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సత్యాసత్యాలు

పాకిస్థాన్‌పై ఇటీవల జరిపిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం వాటిల్లిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ అంగీకరించారు. భారత్‌కు చెందిన ఆరు విమానాలను కూల్చేశానని పాకిస్థాన్ చెప్పడం శుద్ధ అబద్ధమని అంటూనే, ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో ఇదమిత్థంగా చెప్పకుండా త్రిదళాధిపతి ఈ యుద్ధానికి సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విమానాలు కోల్పోవడం కంటే, ఎందుకు, ఎలా జరిగిందన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం కనుక, వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మెరుగుపరుచుకొని అమలు చేశామని అన్నారాయన. ఆదిలో వేసిన ఈ తప్పుటడుగుల వల్ల ఒనగూరిన నష్టమెంతో చెప్పలేదు కానీ, సరిదిద్దుకున్న అనంతరం పాకిస్థాన్‌ను అద్భుతంగా దెబ్బతీయగలిగామన్నారు. ఎంతో కచ్చితత్వంతో పాక్ స్థావరాలపై దాడులు చేయడంతో వాటిని ఆపాల్సిందిగా ఆ దేశం ప్రాధేయపడిందని ఆయన వివరించారు. చైనా చేయూతతో భారత్‌ను పాకిస్థాన్ గట్టిదెబ్బ కొట్టిందన్న ప్రచారం ఉధృతంగా జరిగిన నేపథ్యంలో, అసలు చైనా సమకూర్చిన రక్షణ వ్యవస్థలు సరిగా పనిచేయనేలేదని కూడా ఆయన గాలి తీసేశారు.


విపక్షాలకు చౌహాన్‌వ్యాఖ్యలు మంచి మందుగుండు సమకూర్చాయి. మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదనీ, గుట్టు విప్పడం లేదు, నిజం చెప్పడం లేదు అంటూ ఆదినుంచీ ఆగ్రహిస్తున్న విపక్షాలు ఇప్పుడు మళ్ళీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ని విమానాలు?, ఏమిటవి అన్న ప్రశ్నలతో పాటు చాలా అనుమానాలు నివృత్తిచేసుకోవాలని, అమెరికా అధ్యక్షుడు ఒకటికి పదిసార్లు వాణిజ్యం బూచి చూపి తానే యుద్ధం ఆపానంటూ బల్లగుద్దుతున్న సంగతీ మాట్లాడుకోవాలని అవి అంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో ఉన్నదేమిటో జనానికి తెలియనక్కరలేదా? అన్నది మంచిప్రశ్న. ఇప్పటి వరకూ పొరుగుదేశం చెబుతున్న గొప్పలను, లెక్కలను సహజంగానే నమ్మకపోవడంతో పాటు, అంతర్జాతీయ మీడియానూ, రక్షణ రంగ విశ్లేషణలను సైతం భారతీయులు అనుమానించారు. పాక్ మీద ప్రేమతో పాశ్చాత్యదేశాలన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని భావించారు. కానీ, యుద్ధం ముగిసిన మూడువారాల తరువాత చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యంతో పాటు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. యుద్ధం అన్నాక నష్టాలు సహజం అని అప్పట్లో ఎయిర్‌మార్షల్ భారతి, ఇప్పుడు చౌహాన్ ప్రత్యేకంగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఏమీ లేదు. పోరాటంలో నెగ్గడంతో పాటు, పోగొట్టుకోవడం కూడా ఉంటుందని సామాన్యుడికి సైతం తెలుసు. అయితే, ఐదువిమానాలను కూల్చినట్టుగా పాక్ తొలిరోజునే చేసిన ప్రకటనను వమ్ముచేయడానికి కాబోలు, వాయుసేన పైలట్లందరూ సురక్షితంగా తిరిగివచ్చారని చెప్పి వైమానిక నష్టాలేమీ జరగలేదన్నట్టుగా ఎయిర్‌మార్షల్ దేశప్రజలకో అభిప్రాయాన్ని కలిగించారు. సరికొత్త ఒప్పందంతో, ఫ్రాన్స్‌నుంచి మరింత ఖరీదుకు కొనుక్కున్న రాఫెల్‌కు అప్రదిష్ట రాకూడదన్న జాగ్రత్త అందులో ఉండివుండవచ్చు. ఇప్పుడు సీడీఎస్ చౌహాన్ పాకిస్థాన్ అంటున్న స్థాయిలో కాకున్నా నష్టం అధికంగానే సంభవించిందని తేల్చేశారు.

యుద్ధకాలంలో పాక్ పని అయిపోయిందంటూ ఎన్నిరకాల ప్రచారాలు జరిగాయో, అందులో బీజేపీ నాయకులు ఎంత ముందున్నారో అందరికీ తెలుసు. ఆ ఉద్వేగాల మధ్య, మరోపక్క పాకిస్థాన్ దీనికి ప్రతిగా, ప్రతీకారంగా మరింత విషప్రచారం సాగించిన నేపథ్యంలో, వాస్తవిక స్థితిని చెప్పడానికి సైన్యం కత్తి మీద సాముచేయాల్సివచ్చింది. అయితే, సత్యాన్ని దాచడంవల్లనో, అర్ధసత్యాలు చెప్పడం వల్లనో అసత్యప్రచారాలను వమ్ముచేయడం సాధ్యంకాదు. దేశం కోసం ప్రాణాలకు తెగించిపోరాడే సైన్యానికి రాజకీయాలతో నిమిత్తం లేదు కనుక, ఉన్నదివున్నట్టు చెప్పడానికి ఏ దశలోనూ సందేహించనక్కరలేదు. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు తీరని నష్టం చేశామని, ఉగ్రస్థావరాలను కుప్పకూల్చి ఒక కొత్త లక్ష్మణరేఖ గీశామన్నది వాస్తవం. జాగ్రత్తగానైనా కొన్ని నిజాలు విప్పినందుకు చౌహాన్‌ను అభినందించాల్సిందే. అయితే, మూడు వారాల తరువాత కూడా అది 145కోట్లమంది దేశప్రజల సమక్షంలో గాక, కఠినమైన ప్రశ్నలు, విశ్లేషణలు ఎదుర్కొనే సందర్భంలో, ఒక విదేశీ వేదికమీద జరగడం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తున్న మాట నిజం.

ఇంతకూ ధర్మాసనం ఎందుకు?

న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హోంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫరెన్స్‌లు ఎందుకు? అందుకోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, "మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం," అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా?

2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: "మేము కేవలం హోం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి" అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు?



భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రి వర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యేకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగినప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ – ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించి పోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ 'పాకెట్ వీటో' వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. 'పాకెట్ వీటో' అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచటం.

> ప్రజాస్వామ్యంలో పాలన అనేది చర్చల ద్వారా జరగాలి, జడత్వం ద్వారా కాదు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం కోరుకున్న ప్రకారమే రాజ్యాంగ బద్ధమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి రెఫరెన్స్ ప్రకారం రాజ్యాంగ ధర్మాసనం తప్పనిసరి అవుతున్నది. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ప్రభుత్వం అడిగిన ప్రకారం రాష్ట్రపతి రెఫరెన్స్ అధికారాన్ని వాడడం వల్ల ఏం ప్రయోజనం?

రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా?

రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం – రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?

న్యాయమూర్తి పార్థివాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్‌కు ఒక బిల్లు వచ్చాక... మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్‌కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు.

బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

○ మాడభూషి శ్రీధర్

పాక్‌కు సింధు జలాలు... ఇంకానా?

భారతదేశ సమగ్రతను, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'.. మన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఉన్మాదానికి ప్రతీకారంగా.. మే 7వ తేదీ తెల్లవారుజామున (6వ తేదీ అర్ధరాత్రి తర్వాత), 9వ తేదీన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలు లక్ష్యంగా సంధించిన మిసైళ్లు, పాక్ సైనిక స్థావరాలపై జరిపిన మెరుపుదాడులకు యావత్ ప్రపంచం సాక్షీభూతంగా నిలిచింది. 'ఆపరేషన్ సిందూర్' విషయంలో భారతదేశం చూపించిన పరిపక్వతకు, స్పష్టతకు యావత్ ప్రపంచం జేజేలు పలికింది. బ్రహ్మోస్, స్కాల్ప్ మిసైళ్లను వాడుతూ.. ఎస్–400, ఆకాశ్ ద్వారా వైమానిక రక్షణ వ్యవస్థతో స్వీయరక్షణ చేసుకుంది.

పహల్గాం ఘటన జరిగిన మూడురోజుల లోపే సింధుజలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నట్లు భారతదేశం చాలా స్పష్టంగా తెలియజేసింది, కఠినంగా వ్యవహరించింది. 'ఆపరేషన్ సిందూర్'కు తాత్కాలిక విరామం ఇస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించిన సందర్భంలోనూ 'సింధు జలాల ఒప్పందం' నిలుపుదలపై యథాతథస్థితిని కొనసాగించింది. 1965, 1971 (బంగ్లాదేశ్ ఏర్పాటు సందర్భంగా), 1999 (కార్గిల్), 2001 (పార్లమెంటుపై దాడి), 2008 (ముంబైపై ఉగ్రదాడి), 2016 (యురీ), 2019 (పుల్వామా) ఘటనల సందర్భంలోనూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ సింధునదీ జలాల ఒప్పందంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత, దేశవ్యాప్తంగా ఉద్విగ్న వాతావరణం నెలకొనడం, ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన సందర్భంలో మోదీ సర్కారు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ గొప్ప నిర్ణయం తీసుకుంది.

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తొలినాళ్లలో జరిగిన ఓ చారిత్రక తప్పిదమే ఈ సింధు జలాల ఒప్పందం. నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి పాక్ అధ్యక్షుడు జనరల్ అయూబ్ ఖాన్ 19 సెప్టెంబర్ 1960లో సద్భావనాపూర్వక ఒప్పందంగా దీనిపై సంతకాలు చేశారు. సింధు జలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ)లో భాగంగా.. సింధు నది, దాని అయిదు ఉప నదుల జలాల్లో.. 80 శాతం పాకిస్థాన్, 20 శాతం భారత్ వినియోగించుకోవాలి. పాకిస్థాన్‌కు సింహభాగం నీటిని అప్పగిస్తున్నందుకు బదులుగా రావి, బియాస్, సట్లెజ్ నదుల నీటిని భారత్, సింధు, జీలం, చీనాబ్ నదుల నీటిని పాకిస్థాన్ వినియోగించుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు.

రావి, బియాస్, సట్లెజ్ నదుల నీటిని భారత్ వాడుకుంటున్నందున.. పాకిస్థాన్ భూభాగంలో ఈ నదీ పరివాహక ప్రాంతంలో జీలం, సింధు, చీనాబ్ నదులకు లింక్ కెనాళ్ల నిర్మాణ ఖర్చులుగా రూ.83.3 కోట్లను భారతదేశం భరించాలని పేర్కొన్నారు.



> సింధు జలాల ఒప్పందంపై అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంతకం చేయడంపై అప్పుడే కాంగ్రెస్ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తమైంది. దీనికి తోడు భారత్, పాకిస్థాన్, ప్రపంచబ్యాంకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందానికి భారతదేశమే చాలా రాయితీలు ఇచ్చింది. అందుకు ప్రతిఫలంగా మనకేమీ దక్కలేదు.

ప్రస్తుతం ఇది రూ.8వేల కోట్లతో సమానం. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు జోక్యంతో పాకిస్థాన్‌కు మరో రూ.400 కోట్ల నిధులు అందాయి. అదే సమయంలో భారతదేశం.. కెనాళ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల సొంత నిధులను ఖర్చు చేసుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇందుకోసం భారత్‌కు ప్రపంచబ్యాంకు కేవలం రూ.30కోట్ల నిధులను ఇచ్చింది. అది కూడా రుణంగానే. ఈ ఒప్పందం పాకిస్థాన్‌కు అనుకూలంగా ఎంత ఏకపక్షంగా సాగిందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే.



ఈ ఒప్పందంపై నెహ్రూ సంతకం చేయడంపై అప్పుడే కాంగ్రెస్ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తమైంది. 30 నవంబర్, 1960 నాడు.. సింధుజలాల ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ ఎంపీ హరీశ్‌చంద్ర మాథుర్ మాట్లాడుతూ.. టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ.. 'ఈ ఒప్పందంలోని ప్రతి అంశం వివాదాస్పదమే. పాకిస్థాన్ ఆకాంక్షలను పూర్తి చేసేందుకు భారతదేశం తన ప్రయోజనాలను పణంగా పెట్టి మరీ డబ్బులు వెచ్చిస్తోంది' అని గుర్తు చేశారు. నాటి వాస్తవ పరిస్థితిని హరీశ్‌చంద్ర మాథుర్ మాటలు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. దీనికితోడు భారత్, పాకిస్థాన్, ప్రపంచ బ్యాంకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందానికి భారతదేశమే చాలా రాయితీలు ఇచ్చింది. అందుకు ప్రతిఫలంగా మనకేమీ దక్కలేదు. ఇది సింధునదీ జలాల ఒప్పందంలో భారతదేశానికి జరిగిన తీవ్రమైన అన్యాయం.

ఇదే భావన.. నాడు పార్టీలకు అతీతంగా ప్రతి పార్లమెంటు సభ్యుడు ఎలుగెత్తి చాటారు. ఈ ఒప్పందం కారణంగా రాజస్థాన్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. చాలామంది సభ్యులు 1948లో దేశ విభజన సమయంలో జరిగిన ఒప్పందాలను ప్రస్తావిస్తూ అప్పటికే వినియోగంలో ఉన్న కెనాళ్ల ద్వారా భారత్ నుంచి పాకిస్థాన్‌కు నీటి సరఫరాకు అంతరాయం ఉండకూడదని, కొన్నాళ్లపాటు ఇలాగే నీటి సరఫరా జరగాలని పేర్కొన్న అంశాన్ని గుర్తు చేశారు. అయినా, నెహ్రూ దీన్ని పెద్దగా పట్టించుకోలేదు సరికదా, బకెట్ నీళ్లకోసం రాద్ధాంతం చేస్తున్నారంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. అయినా ఎంపీలెవరూ వెనక్కు తగ్గకపోవడంతో, ఈ విమర్శల దాడిని తట్టుకునేందుకు, జపాన్ యువరాజు–యువరాణి భారత పర్యటనకు వస్తున్నారని, వారికి స్వాగతం పలికేందుకు వెళ్తున్నానని చెప్పి నెహ్రూ తప్పించుకున్నారు.

తీవ్రమైన గందరగోళం మధ్య నెహ్రూ పార్లమెంటు నుంచి నిష్క్రమించిన తర్వాత అటల్ బిహారీ వాజపేయి నాటి కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ ప్రసంగించారు. ఈ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత పాకిస్థాన్ అధ్యక్షుడు మాట్లాడుతూ 'సింధుతో పాటుగా రావి, సట్లెజ్, బియాస్, జీలం, చీనాబ్ నదీ తీరాల ఉమ్మడి తనిఖీ విధానానికి భారత్ అంగీకరించడం ద్వారా పాకిస్థాన్ ఒత్తిడికి తలొగ్గింది. చీనాబ్, జీలం నదుల ఎగువ ప్రాంతంపై (భారత భూభాగంలో) ఉమ్మడి నియంత్రణకు అంగీకరించడం అంటే, ఈ ప్రాంతంపై ఇరు దేశాలకు హక్కు ఉంటుందని అంగీకరించడమేనని అర్థం' అని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. దీనికి నెహ్రూ ఇచ్చిన సమాధానంపై వాజపేయి సంతృప్తి చెందలేదు. దీనికి సమాధానంగా.. 'రెండు దాయాది దేశాల మధ్య సత్సంబంధాలను, స్నేహాన్ని ఏర్పర్చాలని భావిస్తే.. ఇలా సింధునదీ జలాల ఒప్పందం విషయంలో మన ప్రయోజనాలను తాకట్టుపెట్టేలా వ్యవహరించడం సరికాదు. పాకిస్థాన్ తప్పుగా మాట్లాడినా, అక్రమ డిమాండ్లను ముందు పెట్టినా నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాల్సిందే' అని వాజపేయి స్పష్టం చేశారు.

ఇది జరిగిన ఆరున్నర దశాబ్దాల తర్వాత.. ఇవాళ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం ఓ చారిత్రక ఘట్టంగా నిలిచిపోనుంది. ఈ సందర్భంగా భారతదేశం ఇచ్చిన ప్రతిస్పందన.. ఒప్పందాన్ని సంపూర్తిగా గౌరవించినట్లుగా ఉంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ద్వారా భారతదేశం నమ్మకాన్ని పాకిస్థాన్ వమ్ముచేసింది. దేశ భద్రతను, దేశ సమగ్రతను సవాల్ చేసేలా వ్యవహరిస్తే.. ఇచ్చే సమాధానం కూడా అదే స్థాయిలో ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక్క పాకిస్థాన్‌కే కాదు.. యావత్ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్నిచ్చారు. 'రక్తం, నీరు కలిసి ప్రవహించవు' అని భారతదేశం ఆలోచనలను కుండబద్దలు కొట్టారు. భారతదేశ ప్రజల అవసరాలకు, వ్యవసాయ, నీటి పారుదల అవసరాలకు అనుగుణంగా.. ఇకపై మన దేశం సింధు జలాలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు తగ్గట్టుగా.. మన అవసరాలకు, దేశాభివృద్ధికి ప్రాధాన్యతగా నిర్దేశించుకునే సింధు జలాల ఒప్పందం నిలిపివేత నిర్ణయం తీసుకున్నారు. దీనిపై గతంలో చాలాసార్లు ప్రభుత్వాలు ఆలోచన చేశాయి. ముంబై దాడుల సందర్భంలోనూ.. సింధుజలాల ఒప్పందాన్ని రద్దు చేయాలనే డిమాండ్ వినిపించింది. కానీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. ఈసారి భారత ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూ.. రెండో ఆలోచనకు తావులేకుండా ఈ ఒప్పందాన్ని నిలిపివేసింది. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని యావద్భారతం ముక్తకంఠంతో ఆమోదం తెలిపింది. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకునే ఎంతటి కఠినమైన నిర్ణయానికైనా భారత ప్రజల మద్దతు ఉంటుందని మరోసారి నిరూపితమైంది.

■ జి. కిషన్‌రెడ్డి
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

సూర్యాపేట ఘటనలు ప్రభుత్వానికో హెచ్చరిక!

ఇటీవల సూర్యాపేటలో వెలుగుచూసిన వరుస ఘటనలతో రాష్ట్రం నివ్వెరపోయింది. ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఓ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. మూడోసారీ ఆడపిల్లే పుట్టబోతోందని తెలిసి, నెలల గర్భవతిగా ఉన్న ఓ మహిళ అబార్షన్‌కు సిద్ధపడింది. కాసులకు కక్కుర్తిపడిన ఓ ఆర్ఎంపీ ఆమెను పట్టణంలో అనుమతుల్లేని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. సదరు ఆస్పత్రి నిర్వాకం వల్ల ఆ గర్భవతి మృతి చెందింది. ఇక్కడి వరకూ ఓ కథ. అంతకు కొద్దిరోజుల ముందు అదే సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ స్కానింగ్ సెంటర్ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత ఆ కేసు నుంచి తప్పించేందుకు నిందితుడిని స్థానిక డీఎస్పీ, సీఐ రూ.25 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు!

నిబంధనలను పాతరేసిన స్కానింగ్ సెంటర్, అనుమతులు లేని ఆసుపత్రి, సమాజాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారులు అవినీతికి పాల్పడడం, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు ప్రజల ప్రాణాలను హరించడం లాంటి అమానుష ఘటనలు సభ్య సమాజంలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న స్కానింగ్ సెంటర్లకు, ఆసుపత్రులకు అనుమతులు ఉన్నాయా? ఉంటే అవి నిబంధనలకు లోబడే పని చేస్తున్నాయా? ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు సరైన అర్హతలు ఉన్నాయా? అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోడానికి వైద్య ఆరోగ్యశాఖ ఎందుకు వెనుకాడుతోంది?

అనుమతి లేని స్కానింగ్ సెంటర్ వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడిన డీఎస్పీ, సీఐ వ్యవహారం బయటకు వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ స్పందించి ఉండాల్సింది. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ అమానవీయ ఘటన జరిగేది కాదు. కేవలం వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే రెండు ప్రాణాలు బలయ్యాయి. తల్లిని కోల్పోయిన ఇద్దరు అమ్మాయిల భవిష్యత్తుకు భరోసా ఎవరు?

రాష్ట్రంలోని పలు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు గర్భస్థ లింగ నిర్ధారణ, పిండ విచ్ఛిన్న కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇవి గ్రామస్థాయి వరకు దళారులను నియమించుకొని లింగ నిర్ధారణ పరీక్షలతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ తల్లీ బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మామూళ్లకు అలవాటుపడిన వైద్యాధికారులు సదరు ఆసుపత్రుల జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట ఘటనలను ఓ హెచ్చరికగా తీసుకుని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టాలి. భ్రూణ హత్యల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన వైద్యులను కఠినంగా శిక్షించాలి.

– బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి, వరంగల్

బీజేపీ విషకౌగిలిలో బీఆర్ఎస్...!

రాజకీయాల్లో హత్యలుండవు... ఆత్మహత్యలే అనే నానుడి ఉంది. నాయకుల పరంగానే కాదు, పార్టీలకూ అది వర్తిస్తుంది. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు చేశారంటూ ఆ పార్టీ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత ప్రకటనతో అది మరోసారి రుజువయింది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మనుగడను కాపాడే స్థితిలో కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు ఇక ఎంతమాత్రం లేరనేది కళ్ల ముందు కనపడుతున్న సత్యం. చేయి కలిపిన పార్టీలనే కాదు, సంక్షోభంలో ఉన్న పార్టీలను కబ్జా చేయడంలో బీజేపీకి ఉన్న ఘన చరిత్రను చూస్తే బీఆర్ఎస్ కథ త్వరలోనే కంచికి చేరేట్లే కనిపిస్తోంది. వివిధ రాష్ట్రాల్లో ఒక వెలుగు వెలిగి, బీజేపీతో స్నేహం చేసి చివరకు కనుమరుగైన పార్టీలు వివిధ రాష్ట్రాల్లో ఉనికి కాపాడుకోవడానికి నానా అగచాట్లు పడుతున్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసు.

భూమి పుత్రుల సిద్ధాంతంతో మహారాష్ట్రలో ఆవిర్భవించిన పార్టీ శివసేన. మరాఠా ఆత్మగౌరవానికి ఒకప్పుడు ప్రతీకగా నిలిచిన పార్టీ. శివసేనాధిపతి బాల్ ఠాక్రే ఇచ్చిన సీట్లకు సంతృప్తిపడడమే తప్ప, నోరు తెరిచి ఒక్క సీటు అదనంగా అడగలేని స్థితి బీజేపీది ఒకప్పుడు. కానీ ఠాక్రే మరణం తర్వాత ఆయన కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే ముఖ్యమంత్రి కావడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోయింది. ఒకనాడు తమ ఉనికికి, తమ విస్తరణకు కారణమైన శివసేనను ముక్కలు చేసింది. చీలిక వర్గం నేతను కొద్ది రోజులు ముఖ్యమంత్రిని చేసి, తర్వాత ఎన్నికల్లో పక్కన పడేసింది. ఇప్పుడు రెండు శివసేనలతో ఆ పార్టీల ప్రతిష్ఠ మసకబారిపోయింది. పంజాబ్ రాజకీయాల్లో చోటే లేని బీజేపీని అక్కున చేర్చుకున్న పార్టీ శిరోమణి అకాలీదళ్. ఒకనాడు అకాలీదళ్ విదిల్చే రెండు, మూడు ఎంపీ సీట్లతో సంతృప్తి చెందిన బీజేపీ, నెమ్మదిగా ఆ పార్టీలో అంతర్గత తగాదాలు రాజేసి కావల్సినంత లబ్ధి పొందింది. వందేళ్ల పైబడిన చరిత్ర కలిగి, దశాబ్దాల పాటు పంజాబ్ రాజకీయాలను శాసించిన అకాలీదళ్, ఇప్పుడు పంజాబ్‌లో ఉనికి కోసం కొట్టుమిట్టాడుతోంది. బంగ్లాదేశ్ వలసదారులకు వ్యతిరేకంగా అస్సాంలో ప్రారంభమైన ఆల్ అస్సాం స్టూడెంట్ యూనియన్ (ఆసు) తర్వాత కాలంలో 'అస్సాం గణ పరిషత్'గా ఆవిర్భవించింది. ఈశాన్య రాష్ట్రాల్లోనే తొలిసారిగా అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీ. అస్సాంలో వేళ్లూనుకోవడానికి ఏజీపీ చెంతన చేరిన బీజేపీ, క్రమంగా ఆ పార్టీ శ్రేణులను, నాయకులను చెంతన చేర్చుకొని, చివరకు ఆ పార్టీ ఉనికికే ఎసరు పెట్టింది. బీజేపీ కుటిల రాజకీయాలకు ప్రత్యక్ష ఉదాహరణ ఏజీపీ పతనం. బీజేపీ విషకౌగిలిలో చిక్కిన ప్రాంతీయ పార్టీల పరిస్థితికి ఈ మూడు చక్కని ఉదాహరణలు. ప్రస్తుతం వాటి బాటలోనే బీఆర్ఎస్ పయనం సాగుతోంది.

బీజేపీ, బీఆర్ఎస్‌ల స్నేహం ఈనాటిది కాదు. 2009లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ, టీఆర్ఎస్ (బీఆర్ఎస్ పూర్వరూపం), సీపీఐ, సీపీఎంలు మహాకూటమిగా ఏర్పడ్డాయి. బీజేపీ ఒంటరిగా బరిలో నిలిచింది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీని వ్యతిరేకించిన మహాకూటమిలో నేతగా ఉన్న కేసీఆర్, రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగిసీ ముగియగానే పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో జరిగిన అద్వానీ సభలో బీజేపీ వేదికపై ప్రత్యక్షం అయ్యారు. ఉక్కు మనిషి అద్వానీ ప్రధానమంత్రి కావాలని, తమ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కానీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి గెలవడంతో కేసీఆర్ తోక ముడిచారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కాంక్షతో మిలియన్ మార్చ్ నిర్వహించినప్పుడు కేసీఆర్, ఆ పార్టీ శ్రేణులు దూరంగానే ఉన్నాయి. సోనియాగాంధీ ఆశీస్సులతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. నాటి నుంచి పదేళ్ల పాటు బీజేపీ, బీఆర్ఎస్ రహస్య దోస్తీ కొనసాగింది. నరేంద్ర మోదీకి, తనకు మధ్య ఎంత బలమైన బంధం ఉందో ఎవరికీ తెలియదంటూ ఢిల్లీ వేదికగా కేసీఆర్ మాట్లాడిన వీడియోలు ఇప్పటికీ యూట్యూబ్‌లో ఉన్నాయి.



> బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి రాష్ట్ర బీజేపీలోని ముఖ్య నాయకులుగా చలామణీ అవుతున్న కేసీఆర్ రహస్య మిత్రులు సైతం అండదండలు అందించడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగింది. కానీ కవిత ఆ విషయం బయటపెట్టడం, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వాటిని నిర్ధారించడంతో ఇప్పుడు రెండు పార్టీల నేతలు గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు.

2018 శాసనసభ ముందస్తు ఎన్నికలకు రంగం సిద్ధమైన వేళ రాష్ట్రంలోని అయిదుగురు బీజేపీ శాసనసభ్యుల్లో నలుగురు (గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మినహా) జి.కిషన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి, ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్... కేసీఆర్‌తో హఠాత్తుగా భేటీ అయ్యారు. తమపై బలహీన అభ్యర్థులను నిలపాలనే ఒప్పందాన్ని వారు కేసీఆర్‌తో చేసుకున్నారని నాడు మీడియా కోడై కూసింది. వాజపేయి విగ్రహం, స్మృతిచిహ్నం ఏర్పాటు కోసమే కేసీఆర్‌ను కలిశామని నాడు బీజేఎల్పీ నేతగా ఉన్న డాక్టర్ లక్ష్మణ్ ప్రకటించారు. అలాగే మూడు రైతు వ్యతిరేక బిల్లుల విషయంలోనూ లోక్‌సభలో బీజేపీకి మద్దతుగా బీఆర్ఎస్ ఎంపీలు నిలిచారు. ఆ బిల్లులకు దేశవ్యాప్తంగా ఉప్పెనలా వ్యతిరేకత రావడంతో రాజ్యసభలో ప్లేటు ఫిరాయించారు.

పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ అప్పులకుప్పలా మారింది. అన్ని రాజకీయ పార్టీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు మొదలు గ్రామ స్థాయి సర్పంచుల వరకు నయానోభయానో లొంగదీసుకొని బీఆర్ఎస్‌లో కలిపేసుకొని రాష్ట్రంలో రాజకీయాలను కేసీఆర్ పూర్తిగా కలుషితం చేశారు. అంతులేని అక్రమాలు, అవినీతిలో రూ.లక్షల కోట్లను కేసీఆర్ కుటుంబం గడించింది. ఈ క్రమంలోనే కేసీఆర్ కుమార్తె ఢిల్లీ మద్యం కుంభకోణంలో చిక్కుకొని జైలుపాలయింది.

మరోవైపు రాష్ట్రంలో అధికారం పోవడం, వివిధ పార్టీల నుంచి వచ్చినవారు తమ సొంత గూళ్లకు చేరడంతో క్షేత్ర స్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడింది. ముందస్తు ఒప్పందంలో భాగంగా తమ ఓట్లను బీజేపీకి మళ్లించడంతో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సున్నా సీట్లకే పరిమితమైంది. రాజకీయంగా ప్రాబల్యం కోల్పోవడం, కుమార్తె మద్యం కేసులో జైలుపాలు కావడం, కాళేశ్వరం అవినీతిలో తనతో పాటు అల్లుడు హరీశ్‌రావు నిండా మునిగి ఉండడం, ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ చిక్కుకోవడంతో, కేసీఆర్ తన పార్టీని బీజేపీలో విలీనం చేసేందుకు ప్రయత్నించారు. ఆ విషయాన్నే కవిత బయటపెట్టారు. బీఆర్ఎస్ విలీనానికి రాష్ట్ర బీజేపీలోని ముఖ్య నాయకులుగా చలామణీ అవుతున్న కేసీఆర్ రహస్య మిత్రులు సైతం అండదండలు అందించడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగింది. కానీ కవిత ఒక్క సారిగా ఆ విషయం బయటపెట్టడం, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వాటిని నిర్ధారించడంతో ఇప్పుడు రెండు పార్టీల నేతలు గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు ప్రకటనలు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌ను విలీనం చేసుకుంటారా, లేక కొనసాగిస్తారా అనేది పూర్తిగా ఆ పార్టీ అంతర్గత విషయం. అయితే తమకూ బీజేపీకి ఉన్న ఒప్పందం ఏమిటి? విలీనం చర్చల ప్రక్రియ ఎంత వరకు వచ్చింది? ఇరు పార్టీల నుంచి చర్చల్లో ఎవరు పాల్గొన్నారు, విలీనం ఉందా లేక మిత్రపక్షాలుగా కొనసాగుతారా? తమది జాతీయ పార్టీ అని కేసీఆర్ ప్రకటించారు కనుక పొత్తు తెలంగాణ వరకేనా లేక దేశమంతా ఉంటుందా?... వీటిపై రాష్ట్ర ప్రజలకు ఇటు కేసీఆర్, అటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టతనివ్వాలి.



● ఆది శ్రీనివాస్
విప్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● మంగళవారం 3 జూన్ 2025



ఆసియా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో స్వర్ణం నెగ్గిన తొలి తెలుగు అథ్లెట్‌గా చరిత్ర సృష్టించిన అగసర నందిని రాజ్‌భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది.

ఎవరో కొత్త కింగ్?



రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఒకటా.. రెండా గత 17 ఏళ్లుగా ఒక్కసారైనా ఐపీఎల్ టైటిల్‌ను అందుకోవాలని ఆ రెండు జట్లు ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న విరాట్ కోహ్లీ కెరీర్‌లోనైతే అదో పెద్ద వెలితి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును తన నాయకత్వంలో చాన్నాళ్లు నడిపించినా చాంపియన్‌ను చేయలేక పోయాడు. కానీ 18వ సీజన్‌లో ఆ అద్భుతాన్ని సాధించేందుకు ఆర్‌సీబీ మరో విజయం దూరంలోనే ఉంది. ఇక గతంలో పంజాబ్ కింగ్స్‌పై ఎవరికీ ఎలాంటి అంచనాలు లేకపోయినా.. ప్రస్తుతం సీన్ మారింది. శ్రేయాస్ అయ్యర్ ఆ జట్టును కదం తొక్కిస్తున్నాడు. టేబుల్ టాపర్‌గా నిలపడమే కాకుండా తుది పోరుకు కూడా చేర్చాడు. ఇక ఈ రెండు టాప్-2 జట్ల మధ్య ఆసక్తికరపోరులో ఎవరు గెలిచినా తొలి టైటిల్‌తో పండుగ చేసుకుంటారు.

తొలి టైటిల్ వేటలో పంజాబ్ X బెంగళూరు

నేడు ఐపీఎల్ -18 ఫైనల్

అహ్మదాబాద్: ప్రపంచ క్రికెట్‌లో అతి భారీ టీ20 లీగ్ అయిన ఐపీఎల్ ఆఖరి అంకానికి చేరింది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన నరేంద్ర మోదీ స్టేడియంలో నేడు (మంగళవారం) జరిగే ఫైనల్లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే లీగ్ ముగియాల్సి ఉన్నా.. భారత్-పాక్ యుద్ధం కారణంగా వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇక ఆర్‌సీబీ తుది పోరులో తలపడడం ఇది నాలుగోసారి. 2009, 2011, 2016ల్లో టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా రన్నరప్‌గానే నిలిచింది. 'ఈ సాల కప్ నమ్దే' అంటూ బెంగళూరు జట్టు అభిమానులు ప్రతీసారి హోరెత్తిస్తుంటారు. వీరి నమ్మకాన్ని నిలబెడుతూ ఈసారి అదిరే ప్రదర్శనతో జట్టు తుదిపోరుకు చేరి అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా విరాట్ అభిమానులు నెంబర్ 18 జెర్సీలతో స్టేడియంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. అటు బెంగళూరులో హడావిడి మామూలుగా లేదు. రెస్టో బార్స్, పబ్స్‌లతో పాటు భారీ జెయింట్స్ స్క్రీన్లపై ఫైనల్‌ను తిలకించేందుకు ఫ్యాన్స్ సిద్ధమవుతున్నారు. మరోవైపు క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ చేతిలోనే చిత్తుగా ఓడిన పంజాబ్ కింగ్స్ తిరిగి తుది పోరులోనూ అదే జట్టును ఢీకొనాల్సి వచ్చింది. ఆదివారం ఇదే మైదానంలో ముంబైని చిత్తు చేసిన అనుభవంతో ఈసారి బెంగళూరుకు గట్టి పంచ్ ఇవ్వాలనుకుంటోంది. 2014లో ఒక్కసారి మాత్రమే పంజాబ్ ఫైనల్లో అడుగుపెట్టింది.

ప్రతీకారంతో పంజాబ్

టేబుల్ టాపర్‌గా నిలిచిన పంజాబ్ కింగ్స్ క్వాలిఫయర్-1లో ఎదురైన పరాభవంతో ఒక్కసారిగా డీలా పడింది. ఆర్‌సీబీ ధాటికి కేవలం 101 పరుగులకే పరిమితం కావడంతో షాక్‌కు గురైంది. కానీ అలాంటి స్థితి నుంచి వెంటనే తేరుకుని, ఐదు సార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్‌ను క్వాలిఫయర్-2లో మట్టి కరిపించిన విధానం అదుర్స్. కెప్టెన్ శ్రేయాస్ ఆడిన ఇన్నింగ్స్ క్రికెట్ ప్రేమికులను ఉర్రూతలూగించగా, 11 ఏళ్ల తర్వాత జట్టు ఫైనల్‌కు చేరింది. గతేడాది కేకేఆర్ కెప్టెన్‌గా ఆ జట్టుకు టైటిల్ అందించిన శ్రేయాస్‌పై.. ఇప్పుడు పంజాబ్‌ను గెలిపించే బాధ్యత ఉంది. తన రూ.26.75 కోట్ల ధరకు 603 పరుగులతో న్యాయం చేస్తున్నాడు. అతడితో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శశాంక్ సింగ్, స్టొయినిస్ ఎదురుదాడికి సిద్ధంగా ఉన్నారు. అయితే పేసర్ జాన్సెన్ లేకపోవడంతో వీరి బౌలింగ్ కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయినప్పటికీ బ్యాటింగ్ పిచ్‌పై ముంబైని మరీ భారీ స్కోరు చేయనీయకుండా కట్టడి చేయగలిగారు. అయితే పేసర్ అర్ష్‌దీప్ మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేదు. అలాగే గాయం తర్వాత ఆడిన స్పిన్నర్ చాహల్ సైతం ధారాళంగా పరుగులిచ్చుకున్నాడు. ఏదేమైనా ఈ ఆఖరి పోరులో తమ లోపాలను సరిచేసుకుంటూ ఆర్‌సీబీపై ప్రతీకారం తీర్చుకోవాలన్న కసితో పంజాబ్ ఉంది.



కోహ్లీ

జోరు సాగాలని..

ఆర్‌సీబీ ప్రధాన ఆకర్షణ విరాట్ కోహ్లీ అనడంలో సందేహం లేదు. ఎప్పటి మాదిరే ఈ సీజన్‌లోనూ తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో రాణిస్తున్నాడు. 614 పరుగులతో టాప్-5లో కొనసాగుతున్నాడు. ఫిల్ సాల్ట్‌తో కలిసి ఓపెనర్‌గా మెరుపు ఆరంభాలతో మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా చూసుకుంటున్నాడు. ఇక ఈ స్టేడియంలోనూ, పంజాబ్‌పై అతడికి మెరుగైన రికార్డు ఉండడం జట్టుకు లాభించేదే. అలాగే మయాంక్ అగర్వాల్, జితేశ్ శర్మ రాణిస్తుండడం సానుకూలాంశం. అయితే కెప్టెన్ రజత్ పటీదార్ మాత్రం ఇటీవలి మ్యాచ్‌ల్లో నిరాశపర్చాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరమైన ఫినిషర్ టిమ్ డేవిడ్ ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బౌలింగ్‌లో పేసర్ హాజెల్‌వుడ్ ఇప్పటికే 21 వికెట్లతో జట్టు విజయాల్లో పాలుపంచుకుంటున్నాడు. ఇతర పేసర్లు యష్ దయాల్, తుషార, భువనేశ్వర్ సైతం ప్రభావం చూపుతున్నారు. అందుకే అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా కనిపిస్తున్న ఆర్‌సీబీ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే చాంపియన్ కావడం సాధ్యమే.

తుది జట్లు (అంచనా)

బెంగళూరు: సాల్ట్, విరాట్, మయాంక్, రజత్ పటీదార్ (కెప్టెన్), లివింగ్‌స్టోన్, జితేశ్ శర్మ, షెపర్డ్, క్రునాల్, భువనేశ్వర్, యష్ దయాల్, హాజెల్‌వుడ్.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్, ఇన్‌గ్లిస్, శ్రేయాస్ (కెప్టెన్), నేహల్, శశాంక్, స్టొయినిస్, ఒమర్జాయ్, జేమిసన్, అర్ష్‌దీప్, చాహల్.

పిచ్

అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. క్వాలిఫయర్-2లో ఇరు జట్లూ 200+ స్కోర్లు సాధించాయి. ఇక్కడ మొదట బ్యాటింగ్‌కు దిగిన జట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నా.. చివరి మ్యాచ్‌లో పంజాబ్ అద్భుతంగా ఛేదించింది. దీంతో ఫైనల్లో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు.

వర్షం పడి రద్దయితే..?

ఫైనల్‌కు కూడా వర్షంతో ముప్పు పొంచి ఉంది. మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండనుందట. అహ్మదాబాద్, సమీప ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు ఆస్కారముందని వాతావరణ శాఖ తెలిపింది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ రద్దయినా ఎలాంటి ఇబ్బందీ లేదు. ఫైనల్‌కు రిజర్వ్ డే ఉన్నందున బుధవారం జరుగుతుంది. అప్పుడు కూడా వర్షంతో వీలు కాకపోతే లీగ్ దశలో టేబుల్ టాపర్ (పంజాబ్) జట్టును విజేతగా ప్రకటిస్తారు.

జంతు కళేబరాల మధ్యే సాధన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన, పరిరక్షణ గురించి చాలా రోజులుగా పాలకుల నుంచి ప్రకటనలు వింటూనే ఉన్నాం కానీ ఇప్పటికీ సాగర్ రూపురేఖలు మారలేదు. సాగర్‌లో ప్రతి ఏటా సెయిలింగ్ జాతీయ, అంతర్జాతీయ పోటీలు జరుగుతుంటాయి. అయితే, సోమవారం ఉదయం హుస్సేన్‌సాగర్‌లో విస్తుపోయే సంఘటన జరిగింది. మరో ఐదు రోజుల్లో ఇక్కడ జాతీయ సెయిలింగ్ పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం రాష్ట్రాలకు చెందిన పలువురు సెయిలర్లు ముమ్మరంగా సాధన చేస్తూ కనిపించారు. కానీ, ఇటీవల కురుస్తున్న వర్షాలకు జంతు కళేబరాలు సాగర్‌లోకి కొట్టుకురావడంతో సెయిలర్లు వాటి మధ్యే సాధన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సెయిలర్లు సాధన చేస్తున్న ప్రాంతానికి కొద్ది దూరంలోనే కళేబరాలు ఉండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితని, ఇప్పటికైనా సంబంధిత విభాగాల ప్రభుత్వ అధికారులు సాగర్ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని క్రీడాకారులు కోరుతున్నారు.

పాక్ మ్యాచ్‌లు కొలంబోలో..

మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికగా వైజాగ్ కూడా

దుబాయ్: హైబ్రిడ్ ఫార్మాట్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్‌కప్ వేదికలను ఐసీసీ సోమవారం ప్రకటించింది. టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. తటస్థ వేదికగా శ్రీలంకలోని కొలంబోను ఎంపిక చేశారు. పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లన్నీ ఇక్కడ జరుగుతాయి.. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే వరల్డ్‌కప్ కోసం బెంగళూరు, గువాహటి, ఇండోర్, విశాఖపట్నంతోపాటు కొలంబోను వేదికలుగా ఖరారు చేశారు. సెప్టెంబరు 30న తొలి మ్యాచ్‌లో భారత్ ఆడనుంది. అక్టోబరు 29న తొలి సెమీస్ గువాహటి లేదా కొలంబోలో, 30న రెండో సెమీస్ బెంగళూరులో జరుగుతాయి. నవంబరు 2న బెంగళూరు లేదా కొలంబోలో ఫైనల్ నిర్వహిస్తారు. భారత్‌తోపాటు డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, పాకిస్థాన్ టోర్నీలో ఆడనున్నాయి.

ప్రతీకారం తీర్చుకున్నాడు..

కార్ల్‌సన్‌కు గుకేష్ షాక్



స్టావంజర్ (నార్వే): ప్రపంచ చాంపియన్ గుకేష్..వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాడు. నార్వే చెస్ టోర్నీ ఆరో రౌండ్‌లో కార్ల్‌సన్‌కు షాకిచ్చాడు. తద్వారా క్లాసికల్ గేమ్‌లో..సమకాలీన చెస్ దిగ్గజం కార్ల్‌సన్‌పై గుకేష్ తొలిసారి గెలిచాడు. ఆదివారం రాత్రి జరిగిన ఆరో గేమ్‌లో తెల్లపావులతో తలపడిన 19 ఏళ్ల గుకేష్ 62 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాడు. నల్లపావులతో ఆడినా మ్యాచ్‌లో సింహభాగం కార్ల్‌సనే ఆధిక్యం ప్రదర్శించాడు. అయితే సరైన ఎత్తులతో ప్రత్యర్థిని ఎదుర్కొన్న గుకేష్ గేమ్ సుదీర్ఘంగా కొనసాగేలా చేశాడు. ఈక్రమంలో కార్ల్‌సన్ చేసిన తప్పిదాన్ని సద్వినియోగం చేసుకున్న భారత జీఎం ప్రత్యర్థిపై సంచలన విజయం అందుకున్నాడు. టోర్నీ తొలి రౌండ్‌లో మాగ్నస్ చేతిలో చవిచూసిన ఓటమికి గుకేష్ బదులు తీర్చుకున్నాడు. ఆరో రౌండ్ గెలుపుతో మొత్తం 8.5 పాయింట్లతో గుకేష్ మూడో స్థానానికి దూసుకొచ్చాడు. అర్జున్ ఇరిగేసి ఆర్మగడాన్ టైబ్రేకర్‌లో వీ ఈ (చైనా)పై నెగ్గాడు. దాంతో మొత్తం 7.5 పాయింట్లతో నకమురాతో కలిసి అర్జున్ నాలుగో స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో వైశాలీ చేతిలో టైబ్రేకర్‌లో కోనేరు హంపి ఓటమిపాలైంది. అయితే మొత్తం 9.5 పాయింట్లతో ముజిచుక్‌తో కలిసి హంపి అగ్ర స్థానంలో ఉంది.

తప్పు చేసి..సారీ చెప్పి..

గుకేష్ చేతిలో ఓటమితో కార్ల్‌సన్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఈక్రమంలో అతడు టేబుల్‌పై బలంగా బాదాడు. దాంతో బోర్డుపై ఉన్న పావులు చెల్లాచెదురయ్యాయి. ఆపై గుకేష్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి సారీ చెప్పిన కార్ల్‌సన్ సీటులోంచి లేచాడు. తప్పు తెలుసుకొని తిరిగి వచ్చి టేబుల్‌పై చెల్లాచెదురైన పావులను సర్దాడు. మరోవైపు కార్ల్‌సన్‌పై విజయాన్ని జీర్ణించుకొనేందుకు గుకేష్‌కు కొంత సమయం పట్టింది. ఈక్రమంలో కార్ల్‌సన్ రూమ్ నుంచి వెళుతూ గుకేష్‌కు మరోసారి సారీ చెప్పి వెన్ను తట్టడం అందర్నీ ఆకర్షించింది.

వన్డేలకు మాక్సీ వీడ్కోలు

టీ20లలో కొనసాగుతానని ప్రకటన



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వచ్చే ఏడాది శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్ కప్‌పై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. వన్డేలు ఆడేందుకు శరీరం సహకరించడంలేదని, అయినా ఈ ఫార్మాట్‌లో తాను కొనసాగితే స్వార్థపరుడినే అవుతానని చెప్పుకొచ్చాడు. మెరుపు బ్యాటింగ్‌కు మారుపేరైన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్ 149 వన్డేల్లో 3990 పరుగులు చేశాడు. దీనిలో 4 సెంచరీలు, 23 హాఫ్ సెంచరీలున్నాయి. ఇక..భారత్ ఆతిథ్యమిచ్చిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో అఫ్ఘానిస్థాన్‌పై వాంఖడే స్టేడియంలో మ్యాక్సీ ఆడిన ఇన్నింగ్స్ (201) వన్డే ఫార్మాట్‌లో గొప్ప వాటిలో ఒకటిగా నిలుస్తుంది.

ఇంగ్లండ్ 'ఎ'తో మ్యాచ్ డ్రా

భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్ 241/2

కాంటర్‌బరీ: భారత్ 'ఎ', ఇంగ్లండ్ 'ఎ' జట్ల మధ్య జరిగిన నాలుగు రోజుల తొలి అనధికార టెస్టు మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు సోమవారం ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 241/2 స్కోరు చేసింది. అభిమన్యు (68), జైస్వాల్ (64), జురెల్ (53 నాటౌట్), నితీశ్ (52 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు. అంతకుముందు ఇంగ్లండ్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 587 రన్స్‌కు ఆలౌటైంది. జమన్ (41) రాణించాడు. ముకేశ్‌కు 3, శార్దూల్‌కు 2 వికెట్లు దక్కాయి. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 557 రన్స్ చేసింది.

అంతర్జాతీయ క్రికెట్‌కు క్లాసెన్ గుడ్‌బై



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్-బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (33) అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గతేడాది జనవరిలోనే టెస్టులకు గుడ్‌బై చెప్పిన క్లాసెన్.. వైట్‌బాల్ ఫార్మాట్ నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు తెలిపాడు. ఫ్రాంచైజీ క్రికెట్ వ్యవహారాలను సమన్వయం చేసుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు చెప్పాడు. ఏడేళ్ల కెరీర్‌లో దక్షిణాఫ్రికా తరపున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన క్లాసెన్.. వచ్చే నెలలో అమెరికాలో జరిగే మేజర్ లీగ్ క్రికెట్ ఆడనున్నాడు. 'నా కెరీర్, కుటుంబ భవిష్యత్ కోసం ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకొన్నా. కఠిన నిర్ణయమే అయినా.. ప్రశాంతంగా ఉంద'ని క్లాసెన్ తెలిపాడు. ఏప్రిల్‌లో ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాలో క్లాసెన్ పేరు లేకపోవడంతోనే అతడు రిటైర్మెంట్‌పై ఊహాగానాలు చెలరేగాయి. 2018 ఫిబ్రవరిలో స్వదేశంలో భారత్‌తో సిరీస్‌లో వన్డే, టీ20లు అరంగేట్రం చేసిన క్లాసెన్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో పవర్ హిట్టర్‌గా ఎదిగాడు.

పెగులాకు ఝలక్



బోయిస్సన్

● క్వార్టర్స్‌కు గాఫ్, జొకో, జ్వెరెవ్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ లోయిస్ బోయిస్సన్ సంచలనం సృష్టించింది. మూడో సీడ్ జెస్సికా పెగులాను ఓడించిన బోయిస్సన్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. కోకో గాఫ్, నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మిర్రా ఆంద్రీవ కూడా రౌండ్-8లోకి అడుగుపెట్టారు. సోమవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 21 ఏళ్ల లోయిస్ బోయిస్సన్ (ఫ్రాన్స్) 3-6, 6-4, 6-4తో పెగులాకు షాకిచ్చింది. రెండో సీడ్ గాఫ్ 6-0, 7-5తో అలెగ్జాండ్రోవాపై, ఆంద్రీవ 6-3, 7-5తో కసట్‌కినా (ఆస్ట్రేలియా)పై, ఏడో సీడ్ మాడిసన్ కీస్ 6-3, 7-5తో హేలీ బాప్టిస్ట్‌పై గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ 6-2, 6-3, 6-2తో కామెరూన్ నోరిపై నెగ్గగా.. జర్మన్ ప్లేయర్ జ్వెరెవ్‌కు వాకోవర్ లభించింది. టాలన్ గ్రీక్‌స్పూర్‌తో పోరులో 6-4, 3-0తో జ్వెరెవ్ ఆధిక్యంలో ఉన్నప్పుడు.. ప్రత్యర్థి గాయంతో తప్పుకొన్నాడు. ఐదో సీడ్ జాక్ డ్రేపర్ (బ్రిటన్) 7-5, 3-6, 2-6, 4-6తో అలెగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్) చేతిలో ఓడాడు.

కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్
- వర్చువల్ విధానంలో నిడమనూరు కోర్టు భవనం ప్రారంభం

నిడమనూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారంతోనే న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఏర్పడుతుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఇందుకు న్యాయాధికారులు, న్యాయవాదులు దోహదం చేయాలని కోరారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో రూ.5.50కోట్ల నిధులతో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ సుధ, జస్టిస్ సుజన, జస్టిస్ వినోద్‌కుమార్‌ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేసినప్పుడే న్యాయ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. జనాభా పెరుగుతుండటంతో కేసులు కూడా పెరుగుతున్నాయని, దానికి అనుగుణంగా కోర్టుల ఏర్పాటు కూడా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎక్కువ వాయిదాలు తీసుకోకుండా కేసులను త్వరితగతిన ముగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులకు అందుబాటులో ఉంటూ సత్వర న్యాయం అందించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. హైకోర్టు పోర్టు పోలియో న్యాయమూర్తి వినోద్‌కుమార్ మాట్లాడుతూ నిడమనూరు కోర్టు పరిధిలో కేసులు ఎక్కువగా ఉన్నందున అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జీలు సంపూర్ణ ఆనంద్, వేణు, నిడమనూరు కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి పవన్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉన్నం చినవీరయ్య పాల్గొన్నారు..

తెలంగాణ ఉజ్వల ప్రయాణంలో

ఎన్నారైలది కీలకపాత్ర

ఎన్నారై అంటే.. 'నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా'

- పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా మాకు తెలంగాణే ఫస్ట్
- ఓట్లలో వెనకబడ్డామేమో కానీ, తెలంగాణను ప్రేమించడంలో కాదు
- డల్లాస్‌లో తెలంగాణ ఆవిర్భావ, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసీయుల పాత్ర ఎనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పదేళ్ల ఉజ్వల ప్రయాణంలో ఎన్నారైల పాత్ర అద్వితీయమని కొనియాడారు. 'ఎన్నారై అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్ కాదు.. నెసెసరీ రెసిడెంట్ ఆఫ్ ఇండియా' అని చెప్పారు. తెలంగాణ చరిత్రలో ఎన్నారైల పాత్ర ఎప్పటికీ సువర్ణాక్షరాలతో లిఖించి ఉంటుందన్నారు. అమెరికాలో నివసిస్తున్న ఆడబిడ్డలు ఏనాడూ బతుకమ్మను మర్చిపోలేదని, బతుకునిచ్చిన తెలంగాణ తల్లిని కూడా మర్చిపోలేదని అభినందించారు. అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకలు, బీఆర్ఎస్ రజతోత్సవ సంబరాల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'జననీ జన్మభూమిశ్చ.. స్వర్గాదపీ గరీయసీ' అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన కేటీఆర్.. కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లాలని, అదే సమయంలో జన్మభూమి రుణం కూడా తీర్చుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో సాధించిన తెలంగాణ రాష్ట్రం, కేసీఆర్ పాలనలో కేవలం పదేళ్లలోనే దేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదిగిందని గుర్తుచేశారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. తెలంగాణను అద్భుత అవకాశాల అక్షయపాత్రగా, దేశానికే ఆర్థిక చోదక శక్తిగా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని చెప్పారు. ట్రంప్ విధానాలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. అమెరికాలో లీగల్ సెల్ ఏర్పాటు విద్యార్థులను ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బరువులా కాకుండా బాధ్యతగా, ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వాన్ని నడిపామని చెప్పారు. 2023లో జరిగిన ఎన్నికల్లో ఓట్ల పరంగా వెనకపడి ఉండొచ్చు కానీ, తెలంగాణను ప్రేమించడంలో ఎన్నటికీ వెనకబడమని తెలిపారు. 'పొజిషన్‌లో ఉన్నా, అపోజిషన్‌లో ఉన్నా కచ్చితంగా మాకు తెలంగాణ ఫస్ట్, ఇండియానే ఫస్ట్' అని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ బిడ్డలు బతుకుతెరువు కోసం వలస వెళ్లేవారని.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చి తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రపంచమే ఆశ్చర్యపోయేలా టీఎస్ఐపాస్ విధానాన్ని రూపొందించామని, దాంతో 27 వేలకు పైగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని వివరించారు. దేశంలోనే జిల్లాకో మెడికల్, నర్సింగ్ కళాశాల ఉన్న ఒకే ఒక్క రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దినట్లు కేటీఆర్ వెల్లడించారు.

మెడికల్ వీసాపై వచ్చి డ్రగ్స్ దందా

- నైజీరియా నుంచి నేరుగా గోవాకు
- 12 ఏళ్లుగా పేర్లు మార్చి రాకపోకలు
- నైజీరియన్‌ను అరెస్టు చేసిన టీజీ న్యాబ్
- రూ.1.25 కోట్ల మత్తుపదార్థాల స్వాధీనం

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్లుగా వేర్వేరు పేర్లతో మెడికల్ వీసాపై నైజీరియా నుంచి నేరుగా గోవాలో దిగి.. డ్రగ్స్ దందా చేస్తున్న ఘరానా పెడ్లర్‌ను తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) అరెస్టు చేసింది. నైజీరియాకు చెందిన ఇమాన్యుయేల్ బెడియాకో అలియాస్ మాక్స్‌వెల్ అలియాస్ మాక్స్ అనే వ్యక్తి.. రూ.కోట్లలో డ్రగ్స్ దందా చేసి, రూ.60 లక్షల వరకు కమీషన్ పొందినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసు వివరాలను టీజీ న్యాబ్ డీజీ సందీప్ శాండిల్య వెల్లడించారు. మ్యాక్స్ తొలుత 2013లో బెంగళూరులో చికిత్స పేరుతో భారత్‌కు వచ్చాడు. అక్కడి నుంచి గోవాకు వెళ్లి, మరో నైజీరియన్ రేమీతో కలిసి డ్రగ్స్ దందా మొదలుపెట్టాడు. ఇలా.. 2022 వరకు గోవా, హైదరాబాద్‌తోపాటు.. దేశంలోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ దందా చేశాడు. ఆ తర్వాత మళ్లీ నైజీరియాకు వెళ్లి.. 2023 తర్వాత రెండుసార్లు మారు పేర్లతో మెడికల్ వీసాపై వచ్చాడు. గోవాలోని రేమీతో కలిసి డ్రగ్స్ దందాను కొనసాగించాడు. హైదరాబాద్‌లో ఇతని కదలికలపై ఉప్పందుకున్న టీజీ న్యాబ్ పోలీసులు.. పక్కా వ్యూహంతో అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.1.25 కోట్లు విలువ చేసే 550 గ్రాముల కొకైన్, 11 వందల ఎక్స్‌టసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రెడ్‌కార్నర్ నోటీసును జారీ చేసి, నైజీరియాకు డీపోర్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సందీప్ శాండిల్య వివరించారు.

భూపాలపల్లి జిల్లాలో కారు బీభత్సం

- చెట్ల కింద కూర్చున్న వారిపైకి దూసుకెళ్లిన వాహనం
- ఇద్దరు వృద్ధుల దుర్మరణం.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు

కాటారం, జూన్ 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపి రోడ్డు పక్కన చెట్ల కింద సేదతీరుతున్నవారిపైకి దూకించి ఇద్దరి మృతికి కారణమయ్యారు ఆ యువకులు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామంలో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. సీఐ నాగార్జున రావు, బాధితుల బంధువుల వివరాల ప్రకారం గంగారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీలాల బాలయ్య (65), నీలాల మల్లయ్య, మారపాక మధునమ్మ (80)తో పాటు పలువురు చిన్నారులు సోమవారం మధ్యాహ్నం తమ ఇళ్లముందు రోడ్డు పక్కన చెట్ల కింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన నలుగురు యువకులు కారులో కాళేశ్వరం వెళ్లి దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో యువకులు మద్యం తాగారు. ఆ మత్తులో వేగంగా కారు నడపడంతో గంగారం ఎస్సీ కాలనీ వద్ద కొచ్చేసరికి అదుపుతప్పి ఇళ్ల ముందు చెట్ల కూర్చున్న ఎనిమిది మందిపైకి ఆ వాహనం దూసుకెళ్లింది. ఈ ఘటనలో మధునమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రగాయాలపాలైన మల్లయ్య, బాలయ్య, చిన్నారి డానియెల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా బాలయ్య మృతిచెందాడు. మల్లయ్య, డానియెల్ చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి కారణమైన కారు

రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

- భద్రాది కొత్తగూడెం జిల్లాలో విత్తనాలు పంపిణీ చేసిన మంత్రి తుమ్మల
- 11వేల గ్రామాలలో 40వేల మంది అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ

రాజేంద్రనగర్, జూన్2(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలలో భాగంగా ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. భద్రాది కొత్తగూడెం జిల్లాలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు రైతులకు నాణ్యమైన విత్తనాల కిట్‌లను అందజేశారు. వివిధ జిల్లాల్లో మంత్రులు విత్తనాలను రైతులకు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల గ్రామాలలో 40వేల మంది అభ్యుదయ రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు.


భద్రాది కొత్తగూడెంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

దేశ రాజకీయాల్లో ఆర్యవైశ్యులు రాణించాలి

ఏపీ మంత్రి టీజీ భరత్

అరుణాచలంలో ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం భవనం ప్రారంభం

కర్నూలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో ఆర్యవైశ్యులు రాణించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం అరుణాచలం క్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆర్య వైశ్య వాసవీ నిత్య అన్నదాన సత్రం ట్రస్ట్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ వ్యాపార రంగంలోనే కాదు ప్రజలకు సేవలు చేయడంలోనూ, ఆధ్యాత్మిక సేవల్లో ఆర్యవైశ్యులు ముందు వరుసలో ఉంటారని తెలిపారు. ఎలాంటి విపత్తులు, ఆపదలు సంభవించినా సాయం చేసేందుకు ఆర్యవైశ్య సంఘాలు సంఘటితంగా ముందుకొస్తారని, రాజకీయాల్లో సైతం రాణించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌లు గుర్తుకొస్తారన్నారు. ఆర్యవైశ్యుల ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను టీజీ వెంకటేశ్‌పై రోశయ్య పెట్టారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశంలో ఎక్కడ ఆర్యవైశ్యులకు ఏ కష్టమొచ్చినా తనతో పాటు తన తండ్రి టీజీ వెంకటేశ్ అండగా ఉంటామని స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి టీజీ భరత్ దంపతులు అరుణాచల స్వామి, అపీత కుచాంబదేవిలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేశ్, వాసవీ పత్రాల సముదాయాల ప్రధాన కార్యదర్శి ఇల్లూరి లక్ష్మయ్య, ఏపీ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు శబరీశ్, బీజేపీ యువ మోర్చ అధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.

(మిగతా 7వ పేజీలో)

నిజాంసాగర్‌లో ముగ్గురు పిల్లల గల్లంతు

- క్రికెట్ ఆడేందుకు వెళ్లిన 12 మంది ఇంటర్ విద్యార్థులు
- స్నానానికి బ్యాక్‌వాటర్‌లోకి కొందరు.. వారిలో ముగ్గురి గల్లంతు
- కొనసాగుతున్న గాలింపు చర్యలు

నిజాంసాగర్, ఎల్లారెడ్డి రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లోకి దిగిన పిల్లల్లో ముగ్గురు గల్లంతయ్యారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాలకు చెందిన 12 మంది ఇంటర్ చదువుతున్న పిల్లలు సోమవారం క్రికెట్ ఆడేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ శిఖం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ కొందరు క్రికెట్ ఆడుతుండగా ఇంకొందరు స్నానం చేసేందుకు బ్యాక్ వాటర్‌లోకి దిగారు. వారిలో ముగ్గురు... ఎల్లారెడ్డికి చెందిన మధుకర్ గౌడ్, సోమార్‌పేట్ గ్రామానికి చెందిన హర్ష, తిమ్మారెడ్డికి చెందిన నవీన్ ఈత రాకపోవడంతో నీట మునిగి గల్లంతయ్యారు. గుర్తించిన స్నేహితులు తీవ్ర ఆందోళనకు గురై.. ఆయా గ్రామస్థులకు తెలిపారు. వారు ఘటనాస్థలికి చేరుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్ పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది, గజ ఈతగాళ్లను రప్పించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. లైట్లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగించారు. ఘటనాస్థలి వద్ద బాధిత కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.



మధుకర్, నవీన్, హర్ష

ఆన్‌లైన్‌లో డాక్టర్ అపాయింట్‌మెంట్

- మొబైల్ ద్వారా రిపోర్టులు కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి
- జూలై 1న కొత్త భవనం ప్రారంభం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/బేగంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రిలో ఆన్‌లైన్‌లో వైద్యుల అపాయింట్‌మెంట్ తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. రక్త నమూనాలను కూడా రోగుల ఇంటికి వెళ్లి తీసుకుంటున్నామని, ఆన్‌లైన్‌లో రోగుల మొబైల్‌కు ఫలితాలను పంపించే ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతేగాక అవయవ మార్పిడి శస్త్రచికిత్సలపైనా దృష్టి సారించినట్లు తెలిపారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆస్పత్రిని ఆయన సోమవారం సందర్శించారు. ఆస్పత్రిలో అనుసరిస్తున్న నూతన విధానాలను, కార్మికుల కుటుంబాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి కేంద్రమంత్రికి ఆస్పత్రి సిబ్బంది వివరించారు. ఈ ఆస్పత్రిని విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే ఓపీ బ్లాక్ విస్తరణ పనులు శర వేగంగా సాగుతున్నాయని, జూలై 1న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇక్కడి వైద్య కళాశాలకు రూ.800 కోట్లతో 300 పడకల భవనం నిర్మిస్తున్నామని, త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు.

(6వ పేజీ తరువాయి)

32	270 0-02	పట్టా	ఖుష్కి	పూజిట్ల నర్సయ్య (కొమురయ్య)	పూజిట్ల నర్సయ్య (కొమురయ్య)	271	269	283	272
				[illegible]	[illegible]				

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయుటకు గాను ఈ ప్రకటన జారీచేయడమైనది.
భూమి యొక్క ప్లాన్‌ను ఏదైనా పనిదినమున మరియు పనివేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా, వారి కార్యాలయంలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి వారు, ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే), విభాగము-1, యాదాద్రి భువనగిరి జిల్లా వారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి వారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషన్‌లో ప్రకటించబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.
సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్నట్లయితే, సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహార నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వలన ప్రభావితులయ్యేవారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేయబడిన తేదీ నుండి 60 (అరవై) దినములలోగా జిల్లా కలెక్టర్/ అధీకృత అధికారికి వారి అభ్యంతరములు వ్రాతపూర్వకముగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప-కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము-1, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా

సం/- అదనపు కలెక్టర్ యాదాద్రి భువనగిరి

సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO:179/LA-PP/ADVT/PUBLICATION/2025-26

హనీమూన్‌కు వెళ్లి.. శవమైన భర్త

ఇండోర్, జూన్ 2: హనీమూన్‌కు వెళ్లిన నవ వధూవరుల జంట అదృశ్యమవ్వగా.. దాదాపు పది రోజుల తర్వాత భర్త శవం దొరికింది. భార్య ఆచూకీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. మేఘాలయాలో చోటుచేసుకున్న ఈ ఘటన మిస్టరీగా మారింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీతో సోనమ్‌కు మే 11న వివాహం జరిగింది. ఈ నేపథ్యంలోనే మే 20న హనీమూన్ కోసం వారు మేఘాలయాకు వెళ్లారు. షిల్లాంగ్‌లో ఉంటూ పలు ప్రదేశాలను సందర్శించిన వారు.. మే 23న ఓ ద్విచక్ర వాహనం కిరాయికి తీసుకొని సోహ్రా (చిరపుంజి)కు బయలుదేరారు. ఈ క్రమంలోనే కనిపించకుండాపోయారు. సోమవారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. అది రాజా రఘువంశీదేనని అతడి సోదరుడు గుర్తించాడు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరణానికి గల కారణాలు తెలుస్తాయి. సోనమ్ గురించి ఇప్పటివరకు ఏ ఆధారాలు లభించలేదు. ఆమె ఆచూకీ కోసం మేఘాలయా పోలీసులు వెతుకుతున్నారు' అని ఇండోర్ డీసీపీ రాజేశ్‌కుమార్ తెలిపారు.

వెంటాడి వేటాడి.. కత్తులతో నరికి..!

కర్ణాటకలోని కొప్పళలో దారుణహత్య

బెంగళూరు, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదం కారణంగా కర్ణాటకలోని కొప్పళ జిల్లాలో దారుణ హత్య జరిగింది. ఒక వ్యక్తిని సమీప బంధువులే వేట కొడవళ్లతో నరికి చంపారు. ఈ ఘటన తావరగెరె పట్టణంలోని సింధనూరు సర్కిల్‌లో ఉన్న ఓ బేకరీ దుకాణంలో చోటు చేసుకుంది. గత నెల 31న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు షాపులోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితుడిని చన్నప్ప నారినాళ(35)గా గుర్తించారు. గత శనివారం రోడ్డుపై నడిచి వెళ్తున్న చన్నప్పను నలుగురు వ్యక్తులు వెంటాడారు. దీన్ని గమనించిన చన్నప్ప ప్రాణభయంతో సమీపంలోని ఓ బేకరీలోకి పరిగెత్తాడు. కత్తులతో వెళ్లిన నిందితులు అక్కడే బాధితుడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెంటపడి వరుస కత్తి పోట్లతో హత్య చేశారు.

తెలంగాణలో ఎకో టౌన్ నమూనా

జపాన్‌లోని నమూనాను ఇక్కడ అభివృద్ధి చేస్తాం.. తెలంగాణ-కిటాక్యుషు మధ్య సహకార ఒప్పందం

- హైదరాబాద్-కిటాక్యుషు మధ్య విమాన.. అనుసంధానం కోసం ప్రయత్నిస్తున్నాం
- కిటాక్యుషు మేయర్‌తో భేటీలో సీఎం రేవంత్
- రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకోటౌన్: శ్రీధర్ బాబు



జపాన్‌లోని కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టకేచితో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని కిటాక్యుషు నగరం తరహాలో హైదరాబాద్‌లో ఎకో టౌన్ నమూనాను అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసమే అనేక జపాన్ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. సోమవారం కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టకేచీ ప్రతినిధి బృందంతో ఐటీసీ కాకతీయ హోటల్‌లో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, కిటాక్యుషూ మధ్య పరస్పర సహకార ఒప్పందాలు జరిగాయి. అనంతరం కిటాక్యుషు నగర మేయర్‌తో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు కొత్త ప్రపంచ భాగస్వామ్యాలను ఏర్పరచుకోవడం ద్వారా రాష్ట్ర పురోగతిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఏప్రిల్‌లో జపాన్‌ను సందర్శించినప్పుడు అక్కడి అభివృద్ధిని, పనితీరును చూడడంతోపాటు ఎకో టౌన్ మోడల్‌లో ఉన్న కిటాక్యుషూ నగరం నుంచి ఎంతో ప్రేరణ పొందినట్లు, ఆ ప్రేరణతోనే హైదరాబాద్‌లో ఎకోటౌన్ తరహా నమూనాను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. తెలంగాణ, కిటాక్యుషు మధ్య కుదిరిన ఒప్పందం.. సమ్మిళిత ఆర్థిక వ్యవస్థ, సున్నా ఉద్గారాలు, పట్టణ ఆవిష్కరణల్లో సహకారానికి పునాది కానుందని పేర్కొన్నారు. మూసీనది అభివృద్ధి, పునరుజ్జీవ ప్రాజెక్టుపై తమ దృష్టి ఉందన్నారు. తెలంగాణ యువతకు నైపుణ్యం కల్పించడం తమ ప్రథమ ప్రాధాన్యమని చెప్పారు. రాష్ట్ర యువత జపనీస్ భాష నేర్చుకోవాలనుకుంటున్నారని, అదే సమయంలో జపాన్‌లో అవకాశాలను కోరుకుంటున్నారని సీఎం అన్నారు. జపాన్ ప్రభుత్వ సహకారంతో వారికి జపనీస్ నేర్పించాలని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. హైదరాబాద్- కిటాక్యుషు మధ్య విమాన ప్రయాణాలకు అనువుగా అనుసంధానం కోసం కూడా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కిటాక్యుషు నగర అభివృద్ధి తెలంగాణ రైజింగ్‌కు సరిపోయేలా ఉందన్నారు.

రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్..

భావితరాల అవసరాలకు అనుగుణంగా జపాన్‌లోని కిటాక్యుషు నగరం స్ఫూర్తితో రాష్ట్రంలో 80 ఎకరాల్లో ఎకో టౌన్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణ,కిటాక్యుషు నగరం మధ్య కుదిరిన పరస్పర సహకార ఒప్పందం ఇందుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. సోమవారం టీహబ్‌లో రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'తెలంగాణ రైజింగ్ 2047' అనే లక్ష్యంతో అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రానికి సుమారు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టేలా ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తెలంగాణకు చెందిన 50 మంది యువతకు జపాన్‌లో ఉపాధి అవకాశాలు లభించాయని, మరింత మందికి దక్కేలా టాంకాం లాంటి ప్రభుత్వ సంస్థల ద్వారా జపనీస్ భాషను నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో సీఎస్ రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం కార్యదర్శి అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఈవో మధుసూదన్, సీఐఐ తెలంగాణ చైర్మన్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే రెవెన్యూ అధికారులు

- నేటి నుంచి అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలి
- రెవెన్యూ అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్/పాలకుర్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన తప్పులను సరిచేసేందుకు రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి, భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ 14న భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 4 మండలాల్లో, రెండో దశలో మే 5 నుంచి 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామని గుర్తుచేశారు. మూడో విడతలో మంగళవారం నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించబోతున్నామన్నారు. అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్ నేతృత్వంలోని బృందం వెళుతుందని, 'ప్రజల వద్దకే రెవెన్యూ' నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పారు. తొలి విడతలో 13వేలు, రెండో విడతలో 42వేల దరఖాస్తులు అందగా.. 60 శాతం సమస్యలను పరిష్కరించామన్నారు. వీటిలో సాదాబైనామా దరఖాస్తులూ ఉన్నాయని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున... త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూ శాఖ ఉంటుందని, అధికారులు సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను.. గ్రామ స్థాయిలో అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోందన్నారు. జిల్లా కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లే రెవెన్యూ బృందం కూడా మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు.

భూభారతి దేశానికి రోల్ మోడల్

భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్‌గా నిలవనుందని మంత్రి పొంగులేటి అన్నారు. జనగామ జిల్లాలోని పాలకుర్తిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతికి నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని అన్నారు. మంగళవారం నుంచి రెవెన్యూ యంత్రాంగమే ప్రజల ఇంటి ముందుకొచ్చి భూ సమస్యలు తెలుసుకుంటుందని వెల్లడించారు. ఆగస్టు 15 నాటికి సాధ్యమైనన్ని భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలో 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను విధుల్లోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా 2.10లక్షల మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పథకం కింద నాలుగేళ్లలో 20లక్షల మందికి సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు.



ఇండిగో విమానాన్ని ఢీకొట్టిన పక్షి

రాంచీ, జూన్ 2: ఇండిగో విమానానికి సోమవారం ప్రమాదం తప్పింది. దాదాపు 175 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఇండిగో ఎయిర్‌బస్ 320 విమానాన్ని రాబందు ఢీ కొట్టింది. దీంతో ఆ విమానాన్ని రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయంలో అత్యవసరంగా దింపాల్సి వచ్చిందని ఓ అధికారి తెలిపారు. విమానం రాంచీకి దాదాపు 10 నుంచి 12 నాటికల్ మైళ్ల దూరంలో 3-4వేల అడుగుల ఎత్తులో ఉండగా పక్షి ఢీకొన్నదని, దీంతో పైలెట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చిందని విమానాశ్రయ డైరెక్టర్ ఆర్‌ఆర్ మౌర్య పేర్కొన్నారు. పట్నా నుంచి రాంచీకి విమానం వస్తుండగా మధ్యాహ్నం 1.14 గంటలకు ఈ ఘటన జరిగింది.

16 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట సోమవారం 16 మంది మావోయిస్టులు లొంగి పోయారు. వీరందరిపై సుమారు రూ.26 లక్షల రివార్డు ఉంది. లొంగిపోయినవారిలో సెంట్రల్ రీజనల్ కమిటీకి చెందిన రిటా అలియాస్ సుక్కీ, రాహుల్ పునెం, లెకం లఖ్మా ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ చెందిన ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఉన్నారని, గతంలో ఛత్తీసగఢ్‌లో జరిగిన పలు విధ్వంసకర ఘటనలు, దాడుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. తాజాగా లొంగిపోయినవారిలో 9 మంది మావోయిస్టులు చింతలనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లపెండ గ్రామానికి చెందినవారు. వీరి లొంగుబాటుతో కెర్లపెండ గ్రామం మావోయిస్టుల నుంచి విముక్తి పొందింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోటి రూపాయల అభివృద్ధి పనులను గ్రామంలో చేపట్టనున్నారు.

ఆర్టీఐ దరఖాస్తులకు ఓటీపీతో మెయిల్ ధ్రువీకరణ

న్యూఢిల్లీ, జూన్ 2: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద చేసే అన్ని దరఖాస్తుల ఈ-మెయిల్ ధ్రువీకరణను జూన్ 16 నుంచి వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం అధికారిక వెబ్‌సైట్‌లో వ్యక్తిగత, శిక్షణా విభాగం కింద సోమవారం ప్రచురితమైన ఓ సందేశంలో పేర్కొంది. దరఖాస్తుదారుల వివరాలను గోప్యంగా ఉంచడం, సమాచార భద్రతను మెరుగుపరచడంతో పాటు పోర్టల్ సైబర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను బలోపేతం చేయడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.

6న వక్ఫ్ పోర్టల్ 'ఉమీద్' ప్రారంభం

- ఆరు నెలల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి: కేంద్రం

న్యూఢిల్లీ, జూన్ 2: వక్ఫ్ సవరణ చట్టం అమలుపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం ఉద్దేశించిన ప్రత్యేక పోర్టల్ 'ఉమీద్' (యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియన్సీ అండ్ డెవలప్‌మెంట్)ను ఈ నెల 6న ఆవిష్కరించనుంది. వక్ఫ్ ఆస్తులు అన్నింటినీ ఆరు నెలల్లోగా ఈ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఆస్తుల కొలతలు, వివరాలు, జియో ట్యాగింగ్ లోకేషన్‌ను కూడా జత చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఆస్తులను రిజిస్టర్ చేయకపోతే వాటిని వివాదాస్పద ఆస్తులుగా పరిగణించి ట్రైబ్యునల్ పరిశీలనకు పంపిస్తారు. మహిళల పేరున వక్ఫ్‌ను ఏర్పాటు చేయకూడదని తెలిపింది. మరోవైపు, వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.

కెనరా బ్యాంకులో 59 కిలోల బంగారం చోరీ

విజయపుర, జూన్ 2: కర్ణాటకలో కెనరా బ్యాంకులో భారీ దొంగతనం జరిగింది. ఆ రాష్ట్రంలోని మంగోలీ శాఖలో డిపాజిటర్లు తనఖాపెట్టిన 59 కిలోల బంగారాన్ని దొంగలు దోచుకుపోయారు. వారం తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. విజయపుర ఎస్పీ లక్ష్మణ్ బి.నింబర్గి సోమవారం ఈ విషయాన్ని విలేకరులకు వెల్లడించారు. 'బ్యాంకు సిబ్బంది గత నెల 23న సాయంత్రం బ్యాంకుకు తాళాలు వేశారు. 24(నాలుగో శనివారం), 25 తేదీల్లో సెలవు. 26వ తేదీన ప్యూన్ తలుపులు తెరిచేందుకు రాగా.. షట్టర్ తాళాలు పగిలి ఉండడం గమనించాడు. సిబ్బంది తనిఖీచేయగా.. 59 కిలోల బంగారం మాయమైనట్లు తేలింది.

నీట్ పీజీ పరీక్ష వాయిదా

హైదరాబాద్, జూన్ 2: వైద్య విద్యలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే 'నీట్ పీజీ' పరీక్ష వాయిదా పడింది. ఈ నెల 15న జరగాల్సిన ఈ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామ్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సోమవారం ప్రకటించింది. ఈ జాతీయ పరీక్షను రెండు షిఫ్టుల్లో కాకుండా దేశవ్యాప్తంగా ఒకే షిఫ్టులో నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు మే 30 కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తగిన పరీక్షా కేంద్రాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. పరీక్ష నిర్వహించే కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపింది.

దాడిచేసిన విమానాలు ధ్వంసం

ఉక్రెయిన్ 'ఆపరేషన్ స్పైడర్ వెబ్' టార్గెట్ అదే.. రష్యా టీయూ-22ఎం3, టీయూ-95 బాంబర్లకు చావు దెబ్బ

- 34% దీర్ఘశ్రేణి క్షిపణి వాహకాలు ధ్వంసం
- నష్టం విలువ సుమారు 59 వేల కోట్లు
- వెల్లడించిన ఉక్రెయిన్ సైన్యం
- మా గడ్డ పైనుంచే దాడి జరిగింది: రష్యా



ఎస్‌బీయూ చీఫ్ మాలిక్‌ను అభినందిస్తున్న జెలెన్‌స్కీ

కీవ్/ఇస్తాంబుల్, జూన్ 2: మూడేళ్లుగా ఉక్రెయిన్‌పై రష్యా ముప్పేట దాడులు చేస్తోంది. దీర్ఘశ్రేణి క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఇందుకోసం తన దీర్ఘశ్రేణి క్షిపణి వాహక యుద్ధ విమానాలు(బాంబర్లు) టీయూ22ఎం3, టీయూ-95, టీయూ-160లను వినియోగిస్తోంది. వీటికి నావిగేషన్ సహకారం అందించేందుకు ఏ-50 అవాక్స్‌ను ఉపయోగించుకుంటోంది. దాంతో ప్రతీకారేచ్ఛతో రగిలిపోయిన ఉక్రెయిన్.. ఈ యుద్ధ విమానాలను టార్గెట్‌గా చేసుకుంది. అందుకోసం 18 నెలల క్రితం 'ఆపరేషన్ స్పైడర్ వెబ్'కు శ్రీకారం చుట్టింది. ఆపరేషన్ అమలు బాధ్యతలను సెక్యూరిటీ సర్వీస్(ఎస్‌బీయూ)కు అప్పగించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వయంగా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. తమ ఆపరేషన్‌ను అతి క్లిష్టమైన ఆధునిక యుద్ధ తంత్రంగా పేర్కొంటూనే.. బెలాయా(సైబీరియా సమీపంలో), ఒలేన్యా(ఆర్కిటిక్ సమీపంలో.. కోలా ద్వీపకల్పంలో), ఇవానోవో, డియాగిలెవ్‌లో ఉన్న రష్యన్ ఎయిర్‌బేస్‌ల వద్ద 117 ఎఫ్‌పీవీ డ్రోన్లను మోహరించింది. వీటిని రష్యాకు తరలించేందుకు ట్రక్కు డ్రైవర్లు, రష్యన్ భాష తెలిసిన ఉక్రెనియన్లను ఏజెంట్లుగా నియమించింది. గగనతలంలో చొచ్చుకువచ్చే డ్రోన్లను, క్షిపణులను అడ్డుకునే సాంకేతికత రష్యా వద్ద ఉన్న నేపథ్యంలో.. ట్రక్కుల్లో రోడ్డు మార్గాల్లో తన డ్రోన్లను తరలించింది. అంతేకాదు.. ఈ ఆపరేషన్ కోసం శ్రమించిన చివరి ఏజెంట్ కూడా క్షేమంగా ఉక్రెయిన్ భూభాగంలోకి అడుగుపెట్టాకే.. ఆదివారం ఉదయం ఆపరేషన్‌ను అమలు చేసి, 41 యుద్ధ విమానాల(బాంబర్ల)ను ధ్వంసం చేసింది. ఈ విజయంపై ఎస్‌బీయూ చీఫ్ మాలిక్‌ను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభినందించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ వివరాలను బయటి ప్రపంచానికి తెలియజేశారు. ఇన్నాళ్లు తమ ఏజెంట్లు రష్యా ఎఫ్ఎస్‌బీ(నిఘా సంస్థ) ప్రధాన కార్యాలయం సమీపంలోనే మకాం వేశారని వెల్లడించారు. ఉక్రెయిన్ సైన్యం కూడా ఈ ఆపరేషన్ తమకు అతిపెద్ద విజయం అని పేర్కొంది. రష్యా వద్ద సుమారు 120 వరకు దీర్ఘశ్రేణి క్షిపణి వాహక బాంబర్లు ఉన్నాయని.. వాటిల్లో 34% (41 విమానాలు) ధ్వంసమయ్యాయని తెలిపింది. తమ దాడుల వల్ల రష్యాకు కలిగిన నష్టం అంచనా రూ.59 వేల కోట్లుగా ఉంటుందని వెల్లడించింది. అటు రష్యా కూడా నాలుగు ఎయిర్ బేస్‌లపై ఉగ్రవాద దాడులు జరిగాయని ప్రకటించింది. డ్రోన్లు ఉక్రెయిన్ భూభాగం నుంచి రాలేదని స్పష్టం చేసింది. అవి తమ భూభాగం నుంచే ఎగిరినట్లు పరోక్షంగా అంగీకరించింది. ఆదివారం నాటి ఉక్రెయిన్ 'ఆపరేషన్ స్పైడర్ వెబ్'కు ప్రతీకారంగా రష్యా తన దాడులను కొనసాగిస్తోంది. అయితే.. సరిహద్దుల్లో ముఖాముఖి ఘర్షణల్లో ఆదివారం ఒక్కరోజే 1,140 మంది రష్యా సైనికులు చనిపోయారని ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. దీనిపై రష్యా నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

తేలని శాంతి చర్చలు

ఇస్తాంబుల్‌లో రష్యా-ఉక్రెయిన్ మధ్య జరిగిన శాంతి చర్చలు ఎటూ తేలలేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ప్రతిపాదించగా.. 2-3 రోజులకు అయితే సుముఖమని రష్యా వెల్లడించింది. ఈ నెల 20 నుంచి 30 వరకు ఉన్నతస్థాయిలో చర్చలు జరపాలని ఉక్రెయిన్ కోరగా.. రష్యా ఎలాంటి సమాధానమివ్వలేదు. అదేవిధంగా యుద్ధం ప్రారంభంలో డాన్‌బాస్(లుహాన్స్క్, డోనెట్స్క్), ఖార్కివ్, మారియుపోల్ వంటి ప్రాంతాల నుంచి రష్యా సైన్యం అపహరించిన చిన్నారుల జాబితాను అందజేసిన ఉక్రెయిన్.. వారిని భేషరతుగా తిరిగి అప్పగించాలని కోరింది. దీనికి కూడా రష్యా అంగీకారం తెలపలేదని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. యుద్ధ ఖైదీల మార్పిడి, యుద్ధంలో అమరుల మృతదేహాల అప్పగింతకు ఇరుదేశాల మధ్య తాజా చర్చల్లో ఏకాభిప్రాయం కుదిరింది. యువ సైనికులను, యుద్ధ ఖైదీలను 1:1 ప్రతిపాదికన 6వేల మందిని అప్పగించుకోవాలని ఇరుదేశాలు అంగీకరించాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ నిర్ధారించారు.

అన్నా వర్సిటీ విద్యార్థినిపై రేప్ కేసు..

బిర్యానీ మాస్టరే దోషి

- తేల్చిన చెన్నై మహిళా కోర్టు
- నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

చెన్నై, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం రేపిన అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసులో చెన్నై మహిళా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మొదటినుంచి నిందితునిగా ఉన్న వ్యక్తే దోషి అని తేల్చిన కోర్టు.. అతనికి యావజ్జీవ కారాగారశిక్ష, రూ.90వేల జరిమానా విధించింది. ఈ తీర్పు ప్రకారం ముద్దాయి జ్ఞానశేఖరన్ ఎలాంటి జైలు రాయితీలు లేకుండా 30 ఏళ్లపాటు ఏకబిగిన కఠినకారాగార శిక్ష అనుభవించాలని, అపరాధ సొమ్మును బాధిత విద్యార్థినికి అందజేయాలని స్పష్టం చేసింది. గత ఏడాది డిసెంబర్ 23 రాత్రి అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిపై అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి ఆ దృశ్యాలను మొబైల్‌లో వీడియో తీశాడు. ఈ ఘటనపై బాధిత విద్యార్థిని కోట్టూరుపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆ ప్రాంతంలో బిర్యానీ షాపు నడుపుతున్న జ్ఞానశేఖరన్(37)ను డిసెంబర్ 24న అరెస్టు చేశారు. నిందితునికి డీఎంకే నేతలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ కేసును సీబీఐకి అప్పగించాలని అన్నాడీఎంకే హైకోర్టును ఆశ్రయించగా.. మహిళా ఐపీఎస్ అధికారులు స్నేహప్రియ, బృందా, ఐమాన్ జమాల్‌తో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఆ దర్యాప్తు బృందం విచారణ జరిపి గత ఫిబ్రవరి 24న సైదాపేట 9వ క్రైం కోర్టులో ఛార్జిషీటు సమర్పించింది. విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో జ్ఞానశేఖరన్ తప్ప ఇతరులెవరికీ సంబంధంలేదని నివేదించింది. గత మార్చి 7న ఈ కేసు విచారణను చెన్నై మహిళా కోర్టుకు బదిలీ చేశారు. అక్కడ కేసు విచారణ ముగియడంతో న్యాయాధికారి ఎం.రాజలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు.

భారత్‌కు మరో రెండు స్క్వాడ్రన్ల ఎస్-400

- వచ్చే ఏడాది నాటికి అందజేస్తాం
- రష్యా ఉప రాయబారి బాబుష్కిన్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 2: ముందు అనుకున్న ప్రకారమే 2025-26 నాటికి మిగిలిన రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేస్తామని.. భారత్‌లో రష్యా ఉప రాయబారి రోమన్ బాబుష్కిన్ స్పష్టం చేశారు. ఇటీవలి భారత్-పాకిస్థాన్ ఘర్షణల సందర్భంగా ఎస్-400 సమర్థవంతంగా పని చేసినట్లు తమకు తెలిసిందన్నారు. 543 కోట్ల డాలర్ల విలువైన ఐదు ఎస్-400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ 2018లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు భారత్‌కు చేరాయి. భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా.. గగనతల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన చర్చలను ముందుకు తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నామని బాబుష్కిన్ వెల్లడించారు. భారత్-పాక్ ఘర్షణలో డ్రోన్లను భారీఎత్తున వినియోగించటాన్ని గుర్తు చేస్తూ.. డ్రోన్ల సమస్యను తాము చాలాకాలంగా ఎదుర్కొంటున్నామన్నారు. డ్రోన్లను నిలువరించే సాంకేతికతను తాము ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నామని, భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యం చర్చల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలు కూడా కీలకాంశమని గుర్తు చేశారు.

4 వేలకు పెరిగిన కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ, జూన్ 2: దేశవ్యాప్తగా కొవిడ్ మహమ్మారి విజృంభిస్తోంది. కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 3,758 నుంచి క్రమేపీ పెరిగి సోమవారం నాటికి 3,961కి చేరింది. ఈమేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఓ ప్రకటన చేసింది. పశ్చిమ బెంగాల్‌లో పాజిటివ్ కేసుల వ్యాప్తి ఎక్కువగా ఉంది. మొత్తం కేసుల సంఖ్య 280కి చేరింది. ఢిల్లీ, కేరళ, గుజరాత్‌లలో కూడా గుర్తించతగ్గ స్థాయిలో ఈ పెరుగుదల ఉంది. తాజాగా కర్ణాటక, కేరళలో ఇద్దరు మరణించారు. దీంతో కొవిడ్ మరణాల సంఖ్య 28కి చేరింది. కొవిడ్ వ్యాప్తికి ప్రధానంగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్ 7 రకాలే కారణమని మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ముందే ముగిసిన వేసవి!



- అంచనాల కంటే ముందే విచ్చేసిన నైరుతి
- అకాల వర్షాలతో చల్లబడిన వాతావరణం

న్యూఢిల్లీ, జూన్ 2: మే నెల మొదలైందంటే చాలు.. ఎండలు మండిపోతాయి. విపరీతమైన ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. 2024లోనూ భారత్‌లో ఎండలు ఠారెత్తించాయి. కాబట్టి.. ఈ ఏడాది కూడా ఉష్ణోగ్రతలు మండిపోతాయని అందరూ భావించారు. కానీ, దానికి భిన్నంగా ఈసారి వేసవి ఆరంభానికి ముందే చాలా ప్రాంతాలు అనూహ్యంగా చల్లబడ్డాయి. నైరుతి రుతుపవనాలు ముందే రావడం, అకాల వర్షాలు కురవడం, మేఘావృతంగా ఉండడంతో మే నెలలో ఎక్కువగా చల్లని వాతావరణం నెలకొంది. రికార్డులు నమోదుచేయడం ప్రారంభించినప్పటి నుంచి 2024 అత్యంత వేడి సంవత్సరంగా నిలవగా.. 2025లో మాత్రం ఎండలు ఎక్కువయ్యే సమయాని కంటే ముందే వేసవి ముగిసింది. గతేడాది మే, జూన్ నెలల్లో అనేక ప్రాంతాల్లో వేడి గాలులు, ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రమయ్యాయి. కానీ.. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. దేశ వాతావరణ నమూనాల్లో ఇదొక పెద్ద మార్పును సూచిస్తోంది.

తేమ గాలులు.. మారిన నమూనాలు..

అయితే ఈ క్రమరాహిత్యానికి అనేక అంశాలు దోహదపడి ఉండొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తు తేమ గాలుల ప్రభావం, మారిన గాలి నమూనాలతో పాటు రుతుపవనాల రాకలో మార్పులు ఉష్ణోగ్రతల పెరుగుదలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించాయని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మేఘావృతమైన వాతావరణం, అప్పుడప్పుడూ కురిసిన వర్షాలతో ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. వాతావరణం చల్లబడడం వల్ల తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం దక్కింది. అలాగే విద్యుత్ డిమాండ్ కూడా తగ్గింది. వేసవి ముందే ముగియడం వల్ల కొన్ని సమస్యలు కూడా ఎదురవుతాయి. ముఖ్యంగా వ్యవసాయ చక్రం దెబ్బతింటుంది. అధిక ఉష్ణోగ్రతలు అవసరమైన కొన్ని పంటల పెరుగుదలపై ఇది ప్రభావం చూపుతుంది. రైతులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలించి విత్తనాలు, కోత సమయాలను తదనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే వేడి నుంచి తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ.. భారత వాతావరణానికి సంబంధించి సంక్లిష్టమై, మారుతున్న స్వభావాన్ని ఇది సూచిస్తోందని నిపుణులు అంటున్నారు.

సైనిక శిబిరంపై పడ్డ కొండచరియలు

- ముగ్గురి మృతి.. ఆరుగురి గల్లంతు

గ్యాంగ్‌టక్, జూన్ 2: సిక్కింలోని ఛటేన్‌లో సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడడంతో ముగ్గురు భద్రతా సిబ్బంది మృతిచెందగా, ఆరుగురి జాడ గల్లంతయింది. ఆదివారం రాత్రి 7గంటల సమయంలో భారీ వర్షం పడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన సిబ్బంది లఖ్వీందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, అభిషేక్ లఖాడ మృతదేహాలను వెలికి తీశామని ఆయన వెల్లడించారు. మరో నలుగురు సైనికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయన్నారు.



సిక్కింలోని ఛటేన్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతం





రాజ్‌భవన్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో గవర్నర్

పురోభివృద్ధి దిశగా తెలంగాణ

- సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలి: గవర్నర్
- తేనీటి విందుకు హాజరైన సీఎం రేవంత్, మిస్‌వరల్డ్ సుచాత

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పడిన తెలంగాణ పురోభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, అన్నివర్గాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ విభాగాలు పని చేస్తున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాజ్‌భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రజలు ఐక్యంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ.. అన్ని విధాలా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యతను ప్రతిజ్ఞరూ తీసుకోవాలన్నారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో విజేతగా నిలిచిన ఓపల్ సుచాత, ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న ముగ్గురు సుందరీమణులకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు ఇచ్చారు. కార్యక్రమానికి సీఎం రేవంత్, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ, గవర్నర్ సతీమణి తదితరులు మిస్‌వరల్డ్ విజేత సుచాతను సన్మానించారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన కిషన్‌రెడ్డి, ఈటల

బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలు

- ఒట్టేసి చెబుతున్నా.. రాష్ట్ర అభివృద్ధి బాధ్యత మాదే: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ దోపిడీ, అవినీతి పార్టీలే అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ చెప్పిన బంగారు తెలంగాణ సాధించలేదని, ఆయన కుటుంబం మాత్రం బంగారమైందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా నడిపిందని మండిపడ్డారు. గతంలో సోనియా గాంధీని 'తెలంగాణ పాలిట దయ్యం' అన్న రేవంత్ రెడ్డి.. ముఖ్యమంత్రి పదవి రాగానే దేవతగా పొగడటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. మిగులు బడ్జెట్‌తో ప్రారంభమైన తెలంగాణ రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, ఇది టీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల వల్లే అని స్పష్టం చేశారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని పార్టీలకన్నా ముందుగా బీజేపీ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నదని, జేఏసీలో చేరిన ఏకైక జాతీయ పార్టీ బీజేపీయేనని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పునః నిర్మించాలంటే బీజేపీనే ప్రత్యామ్నాయమని అన్నారు. "ఒట్టేసి చెబుతున్నా.. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. తెలంగాణను నీతి, నిజాయితీ, అంకితభావంతో అభివృద్ధి చేస్తాం. ఇది బీజేపీ మాట. ప్రధాని మోదీ మాట" అని కిషన్‌రెడ్డి ప్రకటించారు. మూడు తరాల ఉద్యమం, వేల మంది బలిదానాల ఫలితంగా తెలంగాణ ఆవిర్భవించిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.



తెలంగాణభవన్‌లో ఆవిర్భావ వేడుకలలో హరీశ్, మధుసూదనాచారి

బీఆర్ఎస్ కార్యాలయంలో అవతరణ వేడుకలు

- ఆరోగ్యం సహకరించక.. హాజరు కాని కేసీఆర్
- నేడు లేదా రేపు ఆరోగ్య పరీక్షల కోసం ఆస్పత్రికి!

హైదరాబాద్/సంగారెడ్డి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం తెలంగాణభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీమంత్రి హరీశ్‌రావుతో కలిసి మండలి విపక్షనేతమధుసూదనాచారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పార్టీకార్యాలయం ఆవరణలోని తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ అవతరణ దినోత్సవ వేళ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆదివారం షుగర్ లెవల్స్ పెరగడంతో ఆయన కాస్త అస్వస్థతకు గురైనట్లు సమాచారం. విశ్రాంతి తీసుకుంటున్నందునే.. తెలంగాణ అవతరణ వేడుకలకు హాజరు కాలేదని తెలిసింది. మంగళవారం లేదా బుధవారం హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడమా లేక ఫామ్‌హౌస్‌కే వైద్యులు రప్పించి పరీక్షలు చేయించుకోవాలా అనే విషయమై ఆయన తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ సతీమణి శోభ, మనవడు హిమాన్షు సోమవారం ఫాంహౌస్‌కు వచ్చినట్లు సమాచారం.

సీఎం వ్యాఖ్యలు ఉద్యోగులను బాధించాయని తెలుసు!

- ప్రజాస్వామ్యంలో మనమంతా జవాబుదారీగా ఉండాలి: కేకే

మెదక్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మిమ్మల్ని బాధించాయని నాకు తెలుసు.. అయితే ప్రజాస్వామ్య పాలనలో పాలకులు, ప్రభుత్వ ఉద్యోగులు అంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అందుకనే సీఎం అంత ఘాటు వ్యాఖ్యలు చేయాల్సి వచ్చింది. ఏదేమైనా ఉద్యోగులు కోరుతున్న డిమాండ్లలో సగానికి పైగా త్వరలోనే సీఎం నెరవేరుస్తారని సమాచారం ఉంది' అని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు వ్యాఖ్యానించారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా కేకే హాజరై ప్రసంగించారు. దేశంలోని సీనియర్ రాజకీయవేత్తల్లో తానొకరినని.. తమ చేతుల మీదుగా తెలంగాణ ఆవిర్భవించడం సంతోషంగా ఉందన్నారు.

భూదాన్ భూముల కబ్జాపై జవాబు చెప్పాలి: టీడీపీ

తెలంగాణలో కబ్జాకు గురైన భూదానోద్యమ భూములపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సమాధానం చెప్పాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు. సుమారు 40 వేల ఎకరాల భూదానోద్యమ భూములు ఆక్రమణకు గురయ్యాయని అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ ఘనంగా నిర్వహించింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సింహులు మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలకు అనుగుణంగా చంద్రబాబు రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా లేఖ ఇవ్వడం వల్లే ఏర్పాటు ప్రక్రియను ఆనాడు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. టీడీపీ తెలంగాణ ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యాన్ని ఇచ్చిందని అన్నారు.





పురస్కారాలు అందుకున్న కవులు, ఉద్యమకారులతో సీఎం రేవంత్

పోలీసుకు పతకం అందజేస్తూ...

ప్రగతే మా పథం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి.. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి జపాన్‌లోని కిటాక్యుషు నగర మేయర్ కజుహిసా టకేచీ.. అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడుతూ.. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న ప్రణాళికలను వివరించారు. "2047 నాటికి తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నాం. ఆ దిశగానే 'తెలంగాణ రైజింగ్-2047' భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. వాటిని నెరవేర్చే ప్రయత్నాలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజల ఆలోచనలే ఆచరణగా ముందుకెళుతున్నాం" అని సీఎం రేవంత్ అన్నారు. సామాజిక తెలంగాణ కోసం బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, ఇందిరమ్మ ఇండ్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం..

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణను, ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి పలు చర్యలు చేపట్టినట్లు సీఎం రేవంత్ చెప్పారు. మూసీ పునరుజ్జీవ పథకం, ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, మెట్రో రైలు విస్తరణ ప్రణాళికలు, విమానాశ్రయాలు, రీజినల్ రింగ్ రోడ్డు వంటి అంశాలను వివరించారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల



పూలతో అలంకరించిన అమరవీరుల స్థూపం

అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని, ఇందుకోసం 27 ఎకరాల్లో రూ.2,700 కోట్లతో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు. యువత మన భవిష్యత్తు అని, అందుకే తమ ప్రభుత్వం 16 నెలల్లోనే 60 వేలకు పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి, నియామక పత్రాలు అందించిందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేస్తున్నామని, సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

న్యూయార్క్, టోక్యోకు దీటుగా ఫ్యూచర్ సిటీ...

న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో తెలంగాణ ప్రపంచ పెట్టుబడులకు కేంద్రంగా మారుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నామని అన్నారు. శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పుడే రాష్ట్ర అభివృద్ధి, నిర్దేశిత లక్ష్యాలు సాధ్యమవుతాయని సీఎం అన్నారు. ఆ లక్ష్యంతోనే పోలీసు యంత్రాంగాన్ని పటిష్టపరచడం, మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వేదికగా మారుస్తూ భారత్ సమ్మిట్‌ను నిర్వహించామని, 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదంతో మన సంస్కృతి, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి చాటాలన్న లక్ష్యంతో 'మిస్ వరల్డ్' పోటీలు నిర్వహించామని చెప్పారు. ఇక రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకెళుతోందని సీఎం అన్నారు. మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం చేపట్టిన పలు పథకాలను వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక కార్డులు అందజేయాలని నిర్ణయించామని, వారికి ప్రతి సంవత్సరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ వివరాలతోపాటు పూర్తి వివరాలను ఆ కార్డులో పొందుపరుస్తామని తెలిపారు.

వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు..

రాష్ట్రానికి వెన్నెముక రైతేనని, వారికి ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లోనే 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణ మాఫీ చేసి.. అన్నదాతల రుణం తీర్చుకున్నామని తెలిపారు. "రూ.15,333 కోట్లతో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.12 వేలకు పెంచాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తున్నాం. వరి ధాన్యానికి మద్దతు ధరతోపాటు సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా భూ భారతి-2025 చట్టాన్ని తీసుకువచ్చాం. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నాం" అని సీఎం వివరించారు. ఇక రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో ప్రక్షాళనకు విప్లవాత్మక చర్యలు తీసుకున్నామన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రీ స్కూల్ విధానం తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామని ప్రకటించారు.

ఉద్యమకారులకు నగదు పురస్కారాలు..

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది ప్రముఖులకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున నగదు పురస్కారాన్ని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజు ఈ పురస్కారాలను సీఎం ప్రకటించారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఎక్కా యాదగిరిరావు, అందెశ్రీ, సుద్దాల అశోక్ తేజ, జయరాజ్, పాశం యాదగిరి ఉన్నారు. దివంగత గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరికి సంబంధించి నగదు పురస్కారాన్ని వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న గోరేటి వెంకన్న తరఫున ఆయన కూతురు పురస్కారాన్ని స్వీకరించారు. కాగా, బహుభాషా సాహితీవేత్త నలిమెల భాస్కర్‌కు కాళోజీ పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 19 మంది పోలీస్ అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి.. గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.



కోలాటం ఆడుతూ బోనాలు తీసుకు వస్తున్న మహిళలు

పోరాటమనే పునాదిపైన.. పిడికిలి పీఠం ఎక్కిన తల్లి

- 'జయహో తెలంగాణ తల్లి' గీతాన్ని.. 'ఎక్స్'లో పోస్టు చేసిన సీఎం రేవంత్
- గీతాన్ని రచించి ఆలపించిన చంద్రబోస్
- అమరుల త్యాగఫలం తెలంగాణ వారి ఆశయాల సంకల్పం ప్రజాపాలన: సీఎం

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, 'జయహో తెలంగాణ తల్లి' అంటూ సాగే ఓ కొత్త గీతాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "పచ్చని చీర కట్టుకుని.. వరి కంకులు చేతబట్టుకుని.. చైతన్యానికి సంకేతంగా ఎర్రని బొట్టే పెట్టుకుని.. సౌభాగ్యానికి ప్రతిబింబంగా మెడలో నగలే వేసుకుని.. మా బతుకులనే తీర్చిదిద్దగా నిలువెత్తు బతుకమ్మవై.. పోరాటమనే పునాదిపైన.. పిడికిలి పీఠం ఎక్కిన తల్లి.. తెలంగాణ తల్లి.. జయహో తెలంగాణ తల్లి" అంటూ సాగే ఈ గీతాన్ని.. ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రచించి, స్వయంగా ఆలపించారు. కాగా, "త్యాగం.. ఆశయ రూపమై.. నగరం నడిబొడ్డున నిలువెత్తు చిహ్నమై.. దివికేగిన వీరుల స్మృతిలో.. గన్ పార్క్ అమరవీరుల స్థూపం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఘన నివాళి అర్పించాను" అంటూ సీఎం రేవంత్ 'ఎక్స్'లో మరో పోస్టు చేశారు. "అమరవీరులారా.. మీ త్యాగాల ఫలితం ఈ రాష్ట్రం. మీ ఆశయాల సంకల్పం.. ఈ ప్రజాపాలన" అని పేర్కొన్నారు. దీంతోపాటు "వారి కలం.. వారి గళం.. స్వరాష్ట్ర ఉద్యమ భాస్వరం. వారి ఆట.. వారి పాట.. పోరాటాలకు రాచబాట. అటువంటి తొమ్మిది మంది కవులు, కళాకారులు, సాహితీవేత్తలను రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా రూ.కోటి నగదు పురస్కారంతో రాష్ట్ర ప్రజల తరఫున గౌరవించుకున్నాం" అని 'ఎక్స్'లో సీఎం తెలిపారు.

చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు

'రాష్ట్రాలుగా వేరైనా తెలుగు ప్రజలు, తెలుగు జాతి ఒక్కటే. తెలుగువారు ఎక్కడున్నా సమున్నతంగా ఎదగాలన్నదే నా ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎక్స్ వేదికగా ఆయన తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడుతూ వికసిత్ భారత్ -2047 నాటికి అగ్రస్థానానికి చేరుకోవాలి.' అని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'జనసేన పార్టీకి జన్మనిచ్చిన నేల, నాకు పునర్జన్మను ఇచ్చిన నేల, నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ దాశరథి కృష్ణమాచార్య కీర్తించిన నేల నా తెలంగాణ' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజలందరికీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు.

హరీశ్, ఈటల భేటీపై పక్కా సమాచారం

పదేళ్ల పాలనపై చర్చకు హరీశ్‌రావు సిద్ధమా? .. తెలంగాణ పునర్నిర్మాణం దిశగా పాలన

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం అవినీతిపై విచారణకు హాజరు కావాలంటూ కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో హరీశ్ రావు, ఈటల భేటీ అయ్యారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పునరుద్ఘాటించారు. దీనికి సంబంధించి తమ వద్ద పక్కా సమాచారం ఉందని అన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకల్లోను, అనంతరం మీడియాతోను ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని, కంచే చేనును మేసినట్లుగా.. ప్రభుత్వ ఆస్తులను నాశనం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హరీశ్ రావుకు సవాల్ విసిరారు. దాదాపు రూ. 1.20 లక్షల కోట్లతో కట్టిన కాళేశ్వరంతో ఒక్క ఎకరానికీ నీరు రాలేదు కానీ.. ఆ ప్రాజెక్టు కాస్తా కూలేశ్వరంగా మారిందని విమర్శించారు.



గాంధీభవన్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పొత్తుపై కవిత చేసిన వ్యాఖ్యలకు ముందుగా హరీశ్ రావు సమాధానం చెప్పాలన్నారు. కేసీఆర్ కుటుంబంలో నాలుగు ముక్కలాట నడుస్తోందని, ఈ నేపథ్యంలో హరీశ్ రావు వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారో చెప్పాలని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, ఆ విధ్వంసాన్ని అధిగమిస్తూ తెలంగాణ పునర్నిర్మాణం దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని అన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినందుకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీకి ధన్యవాదాలు తెలుపుతూ టీపీసీసీ రూపొందించిన పోస్టర్‌ను మహేశ్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి, మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, అంజన్‌కుమార్‌యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, అమెర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గన్ పార్కు వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి మహేశ్ గౌడ్ నివాళిని అర్పించారు.

కష్ట పడేవారికి తగిన గుర్తింపు

రాజకీయాల్లో ఓపిక, కచ్చితత్వం ఉండాలని, అప్పుడే పార్టీలో కష్ట పడేవారికి కచ్చితంగా తగిన గుర్తింపు ఉంటుందని మహేశ్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పార్టీ పదవుల్లో సీనియర్ మహిళా కార్యకర్తలకు తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. గాంధీభవన్‌లో జరిగిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ మేరకు హామీ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా వేటు తప్పదని స్పష్టం చేశారు.

అభివృద్ధికి కేంద్రబిందువుగా తెలంగాణ

- 'ఎక్స్' వేదికగా రాష్ట్రపతి శుభాకాంక్షలు
- కేంద్రం సహకారంతో తెలంగాణ అభివృద్ధి: ప్రధాని మోదీ
- ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ కీలకపాత్ర: ఖర్గే, రాహుల్





న్యూఢిల్లీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధికి కేంద్ర బిందువుగా తెలంగాణ నిలుస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు 'ఎక్స్' వేదికగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. యువ రాష్ట్రమైన తెలంగాణ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, శ్రేయస్సు మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశ పురోగతికి తెలంగాణ విశేషంగా కృషి కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దశాబ్దకాలంలో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని 'ఎక్స్' వేదికగా గుర్తు చేశారు. రానున్న రోజుల్లో అభివృద్ధి పథంలో అత్యున్నత శిఖరాలను తెలంగాణ అధిరోహిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. తెలంగాణ మరింతగా వికసించాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుతో కోట్లాది మంది ప్రజల కలలు నెరవేరాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన విద్యార్థులు సహా అమరవీరులను స్మరించుకున్నారు. ప్రజా తెలంగాణ నిర్మాణంలో ప్రతి పౌరుడికి మంచి భవిష్యత్తును అందించేందుకు కాంగ్రెస్ పనిచేస్తుందని రాహుల్ పేర్కొన్నారు.



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్


హైకోర్టులో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టులో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్ రెడ్డి, అదనపు ఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజినీకాంత్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, రిజిస్ట్రీ అధికారులు పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీ ఆవరణలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఆవరణలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు వారు అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, డీజీపీ కార్యాలయంలో తెలంగాణ అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐజీ ఎం. శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

బ్లాక్-7 బాధ్యత తప్పించుకోలేరు

మేడిగడ్డ కుంగుబాటు నిర్మాణ వైఫల్యమే

- తొలగించినా, సురక్షితం చేయాలన్నా మీ పనే
- సమగ్ర పునరుద్ధరణకు ప్రణాళిక అందించాలి
- ఇతర బ్లాక్‌లపై ప్రభావం పడకుండా చూడాలి
- 3 బ్యారేజీల్లో ఒకేరకమైన నిర్మాణ లోపాలు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక స్పష్టంగా చెప్పింది
- ఎల్ అండ్ టీ సంస్థకు ప్రభుత్వం స్పష్టీకరణ



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నిర్మాణ వైఫల్యమేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. బ్లాక్-7లో సమస్యకు ఎల్ అండ్ టీ సంస్థ బాధ్యత వహించాల్సిందేనని తేల్చిచెప్పింది. దేశంలో ఆనకట్టల భద్రతకు సంబంధించి ఎన్‌డీఎస్‌ఏ అత్యున్నత చట్టబద్ధమైన సంస్థ అని, దాని నివేదికకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపింది. నివేదికలోని కొన్ని ఎంచుకున్న వ్యాఖ్యలను అంగీకరించి, కొన్నింటిని తిరస్కరించడం కుదరదని, నివేదికను మొత్తంగా చూడాలని మేడిగడ్డ నిర్మాణ సంస్థ అయిన ఎల్ అండ్ టీకి స్పష్టం చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర నీటి పారుదల శాఖ ఆ సంస్థకు ఘాటైన లేఖను రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్మాణ లోపాలు కూడా కారణమని, ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయనందువల్లే బ్యారేజీ కుంగిందని, ఇష్టారాజ్యంగా నిర్మాణం జరిగిందని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) తేల్చిందని ప్రస్తావించింది. మేడిగడ్డలోని బ్లాక్-7లో రాఫ్ట్, పిల్లర్లతో పలుచోట్ల పగుళ్లు వచ్చాయని నివేదికలోని పదహారవ అంశంలో పేర్కొన్నారని గుర్తు చేసింది. బ్లాక్-7ను తొలగించడం లేదా సురక్షితంగా ఉంచడం నిర్మాణ సంస్థ బాధ్యతేనని, ఇతర బ్లాకులపై ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవడం కూడా దాని పనేనని ప్రస్తావించింది. మేడిగడ్డ సమగ్ర పునరుద్ధరణకు ప్రణాళికను ఎల్ అండ్ టీ అందించాలని తేల్చిచెప్పింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో కొన్ని అంశాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని, వాటిని అంగీకరించేది లేదని ఇటీవల ఎల్ అండ్ టీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించింది. సుందిళ్ల, అన్నారంలో తలెత్తిన సమస్యలకు కారణమైన నిర్మాణ లోపాలు, నాణ్యత లోపాలు మేడిగడ్డలో పరిస్థితికి కూడా కారణమై ఉండవచ్చని ఎన్‌డీఎస్‌ఏ చెబితే దాని నుంచి పాఠాలు నేర్చుకోవడం మాని, నివేదికనే తప్పుపట్టే దిశగా ఎల్ అండ్ టీ ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిర్మాణ సంస్థకు, నీటిపారుదల శాఖకు మధ్య జరిగిన ఒప్పందంలోని 8, 16, 30, 32.2, 32.3, 34, 35.1, 38 అంశాల ప్రకారం ఎల్ అండ్ టీ నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. మేడిగడ్డ నిర్మాణ పటిష్టత, దానిపై ఆధారపడిన ప్రజల జీవనాధారం నేపథ్యంలో మళ్లీ వైఫల్యాలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పింది. మేడిగడ్డలో నిర్మాణ లోపాలే కాకుండా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ లోపాలు, డిజైన్‌కు తగ్గట్లుగా నిర్మాణం జరుగక పోవడం వంటి సమస్యలను ఎన్‌డీఎస్‌ఏ గుర్తించిందని ప్రస్తావించింది. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) నిపుణులు కూడా ఈ నివేదికను సమీక్షించింది, బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేసిందని గుర్తు చేసింది.

లేఖలోని ముఖ్యాంశాలు

- బ్యారేజీ దిగువ/ఎగువ భాగంలో సీకెంట్ పైల్స్ దెబ్బతినడానికి, కటాఫ్‌ల అసలు పరిస్థితిని సరిగ్గా అంచనా వేయలేక పోవడానికి గ్రౌటింగ్ చేయడమే కారణం.
- ఏడో బ్లాక్‌లోని 17, 20, 21 పిల్లర్ల కటాఫ్‌లలో రంధ్రాలు కనిపించాయి. పిల్లర్ల కింది నుంచి ఇసుక జారడంతో పిల్లర్లు కుంగాయి.
- ఏవిధంగా నిర్మాణంజరిగింది.? వినియోగించిన సామగ్రి పరీక్షలకు సంబంధించిన ఏ పత్రాలు మీ వద్ద లేవు.
- నిర్మాణానికి ఏయే సామగ్రి వినియోగించారు? అధికారుల ఆమోదం ఉందా? అంటే ఆధారాలు లేవు.
- సిమెంట్, కాంక్రీట్‌లో నీళ్లు కలిపినప్పుడు ఎంత వేడి వస్తుంది, ఆ వేడిని చల్లబరచడానికి ఎంత సమయం పడుతుందనే పత్రాలు నిర్మాణ సంస్థ వద్ద లేవు. ఆ పత్రాలు నీటిపారుదల శాఖ క్షేత్ర స్థాయి ఇంజనీర్లకు కూడా ఇవ్వలేదు.



ఆ ఖర్చు రాబట్టండి!

ఏడో బ్లాక్ నష్టాన్ని ఎల్ అండ్ టీ సంస్థ నుంచే వసూలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ కమిషన్ సిఫారసు

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి కారణమైన నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి బ్లాక్-7 నిర్మాణ ఖర్చును వసూలు చేయాలని తెలంగాణ విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సంచలన సిఫారసు చేసింది. ఈ మేరకు కాళేశ్వరం బ్యారేజీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వీ అండ్ ఈ) విచారణ జరిపి, సమర్పించిన నివేదికను కమిషన్ ఆమోదించింది. మార్చి 5వ తేదీన విజిలెన్స్ తన నివేదికను కమిషన్‌కు అందించింది. తర్వాత అదే నెల 18వ తేదీన నివేదికను కమిషన్ యథాతథంగా ఆమోదించి, మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ నుంచి బ్లాక్-7కు అయిన ఖర్చును తిరిగి రాబట్టాలని సిఫారసు చేసింది. కమిషన్ నివేదిక పూర్తి పాఠం తాజాగా వెలుగులోకి వచ్చింది. మేడిగడ్డ బ్యారేజీని 8 బ్లాకులుగా, 85 పిల్లర్లతో నిర్మించారు. అంచనా వ్యయం రూ.4613 కోట్లు. ఇక ఏడో బ్లాకులో మొత్తం 11 పిల్లర్లు ఉండగా వాటి పునర్నిర్మాణానికి అయ్యే మొత్తాన్ని ఎల్ అండ్ టీ నుంచి వసూలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. తెలంగాణ విజిలెన్స్ కమిషనర్ ఎంజీ గోపాల్ గత మార్చి 18వ తేదీన ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు సిఫారసు చేశారు. ఇప్పటిదాకా మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ పునర్నిర్మాణ బాధ్యతను, ఖర్చును ఎల్ అండ్ టీ భరించాలని నీటి పారుదల శాఖ కోరుతూ వచ్చింది. తాజాగా రికవరీ చేయాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేయడం గమనార్హం. అంతేకాకుండా నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ -పీఈఎస్ జాయింట్ వెంచర్‌పై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు ఉపక్రమించాలని కమిషన్ కోరింది. బ్యారేజీ నిర్మాణం పూర్తి కాకముందే పని పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడం కూడా సరైంది కాదని గుర్తు చేసింది. సాగునీటి శాఖకు చెందిన 17 మంది అధికారులకు ఐపీసీలోని సెక్షన్-120(బీ), 336, 409, 418, 423, 426తోపాటు పీసీ యాక్ట్-1988, ఆనకట్టల భద్రత చట్టం-2021, పీడీపీపీ చట్టం-1984ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టాలని చెప్పింది. వీరిలో పదవీ విరమణ చేసిన ఈఎన్‌సీ(జనరల్) సి.మురళీధర్, మాజీ ఈఎన్‌సీ(ఓ అండ్ ఎం) భూపతి రాజు నాగేంద్రరావు, రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఆర్థిక శాఖకు చెందిన డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణి భూషణ్‌శర్మ, మాజీ ఈఎన్‌సీ(సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి, మాజీ సీఈ కె.ఎస్.ఎస్.చంద్రశేఖర్, ప్రస్తుత ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) టి.శ్రీనివాస్ సహా 17 మంది ఉన్నారు. సి.మురళీధర్ పదవీ విరమణ చేసినప్పటికీ పదేళ్ల పాటు ఈఎన్‌సీ గా పని చేయడం గమనార్హం. ప్రాణహిత-చేవెళ్ల రీడిజైన్ సమయం(2015 ఏప్రిల్) నుంచి 2023 అక్టోబరు 21న మేడిగడ్డ ఏడో బ్లాక్ కుంగిపోయే దాకా పనిచేసిన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలని కమిషన్ కోరింది. సహేతుక కారణాల్లేకుండా ప్రాజెక్టు రీ-డిజైన్ ప్రతిపాదనలు ఆమోదించిన నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శులతో పాటు ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులపై చర్యలకు ఉపక్రమించాలని సిఫారసు చేసింది. డిజైన్ల ప్రకారం బ్యారేజీ పునాదుల్లో షీట్ పైల్స్ వాడాల్సి ఉండగా, సీకెంట్ పైల్స్ వినియోగించిన విషయం కమిషన్ ప్రస్తావించింది. అందులోనూ తీవ్రమైన లోపం జరిగిందని, ప్రైమరీ పైల్స్ వేసిన ఒకటి రెండు రోజుల్లో ఆర్‌సీసీ సీకెంట్ పైల్స్ వేయాల్సి ఉండగా జాప్యం చేయడంతోనే బ్యారేజీ వైఫల్యం చెందిందని తెలిపింది. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ క్షేత్ర స్థాయి ఇంజనీర్లు/క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు కూడా చూసీ చూడనట్లు వ్యవహరించారని తెలిపింది. పాలనా అనుమతి ఇచ్చిన మొత్తానికి మించి 15శాతం అదనానికి అనుమతి ఇవ్వడానికి చీఫ్ ఇంజనీర్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ, తను ప్రభుత్వానికి ముందుగా సమాచారం ఇచ్చి చేయాలని నిబంధన ఉందని, చీఫ్ ఇంజనీర్ సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారని పేర్కొంది. మొదట్లో సవరించిన అంచనాల్లో కొన్ని పనులు చేయలేదని, అంచనాల్లో లేని పనులు చేసి బిల్లులు పొందారని, కొన్ని మంజూరు చేసిన పరిమాణం కన్నా ఎక్కువ చేసి బిల్లులు తీసుకున్నారని, రూ.1,343 కోట్ల డీవియేషన్‌కు చీఫ్ ఇంజనీర్ ఆమోదం తెలిపారని విజిలెన్స్ కమిషన్ వెల్లడించింది. 2018 జూన్ 23న రూ.3,260కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం రాగా, అంతకు ముందే 2018 జూన్ 14న రూ.1,343 కోట్ల డీవియేషన్‌కు ఆమోదం తెలిపారని గుర్తు చేసింది. నాణ్యత పరీక్షల విషయంలో 1,88,257 క్యూబిక్ మీటర్ల టెస్ట్ రిజిస్టర్లు లేవని, భారీగా అవకతవకలు జరిగాయని పేర్కొంది. బ్యారేజీలో నీటి నిల్వకు ముందు కాఫర్ డ్యామ్ తొలగించలేదని ప్రస్తావించింది. ఈ పని పూర్తి కాక ముందే పూర్తయినట్లు 2021 మార్చి 15న ఈఈ ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ క్లెయిమ్ చేసుకోవడం కుదరదని స్పష్టం చేసింది.

33 మందిపై అభియోగాలు

టీసీఎస్-1991 రూల్-24 ప్రకారం పదవీ విరమణ చేసిన వారితో పాటు సర్వీసులో ఉన్న 33 మందిపై అభియోగాలు నమోదు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. వీరిలో మాజీ ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, ప్రస్తుత ఈఎన్‌సీ టి.శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ వి.ఫణి భూషణ్‌శర్మతో కలిపి 33మందిపై అభియోగాలు నమోదు చేయాలని చెప్పింది. పదవీ విరమణ చేసిన మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ గజ్జెల హరిహరచారి, మాజీ చీఫ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వర్లు, మాజీ ఎస్ఈ గంగాధర్, మాజీ సీఈ అజయకుమార్, మాజీ ఈఎన్‌సీ నరేందర్‌రెడ్డిలు ఉన్నారు. వీరిపై అభియోగాల నమోదు తర్వాత మారిన పెన్షన్ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని చెప్పింది.

- రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ సభ్యులకు మార్గదర్శకాలు జారీ చేయాలి. ఖజానాపై ఆర్థిక భారం తగ్గించడానికి వీలుగా స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, సభ్యులను బాధ్యులను చేయాలి. వీరు ప్రాజెక్టుల ఇంజనీర్లపై బాధ్యతను నెట్టి, తప్పించుకోకుండా చూసుకోవాలి.
- కాంట్రాక్టర్ ఒప్పంద షరతులకు మించి... అదనంగా క్లెయిమ్ చేస్తే పరిగణనలోకి తీసుకోకూడదు.
- డిజైన్లను ప్రారంభించడానికి ముందే సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు కాంట్రాక్ట్ ప్రతుల కాపీ అందించాలి. నాణ్యత నియంత్రణ, నిర్మాణ అధికారులు.. నిర్మాణ స్థలాలను పరిశీలించి, సవరణ డ్రాయింగ్ ప్రతిపాదనలు సమర్పించాలి.
- ప్రాజెక్టుల నిర్మాణ స్థలాల సందర్శన బృందంలో సీడీవోను సభ్యుడిగా చేర్చాలి.
- ఒకే ప్రాజెక్టు మీద తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ రిసేర్చ్ ల్యాబోరేటరీ(టీజీఈఆర్ఎల్) వేర్వేరు నివేదికలు ఇస్తే థర్డ్ పార్టీని ఆశ్రయించాలి.
- బ్యారేజీల దిగువభాగంలో తదుపరినష్టం జరుగకుండా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేయాలి.
- సరైన శిక్షణలేని, కొత్తగా నియమితులైన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు నిర్మాణ కొలతల(ఎంబుక్) బాధ్యత అప్పగిస్తే కొలతలుఎక్కువ, తక్కువగా రాశారు.

ఏయే సెక్షన్లు

- ఐపీసీ-120(బి)ప్రకారం నేరపూరిత కుట్ర. 6 నెల్ల జైలు.
- ఐపీసీ-336 ప్రకారం మానవ తప్పిదం. మూడునెలల శిక్ష లేదా జరిమానా.
- ఐపీసీ-409 ప్రభుత్వ ఉద్యోగి నమ్మక ద్రోహం. యావజ్జీవ శిక్ష.
- ఐపీసీ-418 మోసపూరితంగా ఇతరుల అభిప్రాయాలను ప్రభావితం చేయడం. మూడేళ్ల జైలు.
- ఐపీసీ-423 చీకటి ఒప్పందంతో హక్కులు ఇవ్వడం. రెండేళ్ల జైలు. ఐపీసీ-426 తగిన కారణాల్లేకుండా నష్టం కలిగించడం. మూడు నెలల జైలు.
- అవినీతి నిరోధక చట్టం మూడు నుంచి ఏడేళ్ల జైలు.
- ఆనకట్టల భద్రత చట్టం-2021 జవాబుదారీతనం లేక పోవడం, రెండేళ్ల జైలు.
- ప్రభుత్వ ఆస్తులకు నష్టం నివారించే చట్టం 1984 ప్రకారం ఐదేళ్ల జైలు.

11న కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్



హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 11వ తేదీన హాజరు కానున్నారు. మొదట ఆయనను ఈ నెల 5న విచారణకు రావాలని కమిషన్ కోరింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. విచారణకు స్వయంగా హాజరయ్యేందుకు సుముఖత వ్యక్తం చేసిన కేసీఆర్, వ్యక్తిగత పనుల కారణంగా 5న హాజరు కాలేనని చెప్పారు. 11కి మారిస్తే రాగలనన్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు కమిషన్ విచారణ తేదీని మార్చింది. మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం కమిషన్ నోటీసుల్లో పేర్కొన్న ప్రకారం ఈ నెల 9నే కమిషన్ ఎదుట విచారణకు హాజరు కానున్నారు.

తుది అంకానికి కాళేశ్వరం కమిషన్ విచారణ

- 4న హైదరాబాద్‌కు జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ విచారణ తుది అంకానికి చేరుకుంది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ తుది విచారణలో భాగంగా ఈనెల 4న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ దఫా విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ఈనెల 6న మాజీ మంత్రి ఈటల రాజేందర్, 9న మాజీ మంత్రి హరీశ్‌రావు, 11న మాజీ సీఎం కేసీఆర్ విచారణకు హాజరవుతారు. ఈనెల 5వ తేదీన కేసీఆర్ కమిషన్ ఎదుట హాజరుకావాల్సి ఉండగా... మరింత సమయం కావాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఈనెల 11వ తేదీకి విచారణను వాయిదా వేస్తూ కమిషన్ నోటీసులు పంపింది. నివేదిక అందించడానికి కమిషన్‌కు జూలై నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించిన విషయం తెలిసిందే.

దమ్ముంటే సస్పెండ్ చేయండి

- అప్పుడు అందరి బాగోతాలు బయటపెడతా
- బీజేపీలో ఇంటి దొంగలంతా ఒక్కటయ్యారు: రాజాసింగ్



హైదరాబాద్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం తనకు నోటీసులు జారీ చేయడం కాదని, కావాలంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, అప్పుడు అందరి జాతకాలు బయట పెడతానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగిందో ప్రజల ముందుంచుతానని హెచ్చరించారు. బీజేపీలో ఇంటిదొంగలంతా ఒక్కటయ్యారని మండిపడ్డారు. కరీంనగర్ నుంచి తనపై వార్ మొదలైందని ఆరోపించారు. తనను కెలికితే అందరి బాగోతాలూ బయటపెడతానని అన్నారు. రాజాసింగ్‌పై పార్టీ అధిష్ఠానం క్రమ శిక్షణ చర్యలకు సిద్ధమైందని, ఆయనకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించిందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. కొంత కాలంగా రాజాసింగ్ పార్టీలోని కొందరు నేతల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ పొత్తు అంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. పెద్ద ప్యాకేజీ వస్తే బీజేపీ నేతలు బీఆర్ఎస్‌తో కలిసిపోతారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మంగళ, బుధ వారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని పేర్కొంది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అమెరికాకు తలొగ్గిన చరిత్ర మోదీది

ఆ దేశాన్ని ఎదిరించి.. పాక్‌ను వంచింది ఇందిర.. కశ్మీర్‌లో కేంద్ర నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది

- 26 మందిని చంపేదాకా సర్కారుకు సోయి లేదా..?
- పాక్‌తో యుద్ధం ఆగిందని ట్రంప్ ఎలా ప్రకటిస్తారు
- చెప్పా పెట్టకుండా పాక్ ప్రధాని ఇంటికెళ్లింది ఎవరు?
- కిషన్‌రెడ్డి, సంజయ్ జవాబివ్వాలి
- రాహుల్‌పై దుష్ప్రచారం చేసినందుకు సారీ చెప్పాలి
- లేకుంటే ప్రతిఘటన తప్పదు: జగ్గారెడ్డి



హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం విషయంలో అమెరికాకు తలొగ్గిన చరిత్ర మోదీదైతే.. ఆ అమెరికానే ఎదిరించి, పాకిస్తాన్ తలను వంచిన ఘనత ఇందిరా గాంధీది అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు కశ్మీర్‌లోకి చొరబడి.. 26 మంది పర్యాటకులను చంపే వరకూ బీజేపీ ప్రభుత్వానికి సోయి లేదని మండిపడ్డారు. అప్పటి దాకా కేంద్ర నిఘా వ్యవస్థ ఏం చేసిందని ప్రశ్నించారు. దీనిపై దేశ ప్రజలకు మోదీ ఎందుకు సమాధానం చెప్పలేదని నిలదీశారు. తప్పులన్నీ వారు చేసి.. నిందలు రాహుల్ గాంధీపై వేస్తారా..? అని ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ అడిగే ప్రశ్నలకు బీజేపీ నేతలు జవాబులు చెప్పకుండా.. ఆయనపై విమర్శలు చేస్తూ దృష్టి మరల్చే రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌ను ఓడిస్తారని ప్రజలు అనుకుంటే.. ఒక్కసారిగా యుద్ధం ఆగిపోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి ప్రకటన వచ్చింది. ఆ ప్రకటన చేయాల్సింది ప్రధాని మోదీ కదా..? బీజేపీ నేతలకు సిగ్గనిపించట్లేదా..? ట్రంప్ చెబితే రాజీ పడిన వారు.. రాహుల్‌గాంధీ కుటుంబంపై నిందలు వేస్తారా..?"అంటూ ధ్వజమెత్తారు. యుద్ధం చేయండి.. అండగా ఉంటామని మోదీకి భరోసా ఇచ్చిన నేత రాహుల్‌గాంధీ అని తెలిపారు. వాజ్‌పేయీ పుట్టిన రోజున చెప్పా పెట్టకుండా పాకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీ.. ఆ దేశ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికెళ్లి.. ఆయన తల్లి కాళ్లు మొక్కలేదా..? అంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని ప్రశ్నించారు. దీనికి సమాధానం చెప్పిన తర్వాతనే వారు రాహుల్‌గాంధీ గురించి మాట్లాడాలన్నారు. "పాకిస్థాన్ నుంచి కశ్మీర్‌లోకి చొరబడి 26 మందిని చంపిన వారు ఎక్కడున్నారో ఇంత వరకు తెలుసుకోలేదు. కిషన్‌రెడ్డికి సిగ్గనిపించడంలేదా..? తెలంగాణలోని బీజేపీ నేతలకు తలకాయలు ఉన్నాయి తప్ప.. అందులో మెదళ్లు లేవు. వారు ఎందుకు ర్యాలీలు చేస్తున్నారో ఆ ట్రంప్‌కే తెలియాలి" అంటూ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నందుకు క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో తమ నుంచి ప్రతిఘటన తప్పదని కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను జగ్గారెడ్డి హెచ్చరించారు.

బనకచర్లకు సాయం చేయండి

కేంద్రానికి ఏపీ ప్రభుత్వం వినతి.. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖతో పీయూష్ బృందం భేటీ

- పోలవరం-బనకచర్ల అనుసంధానంపై ప్రజెంటేషన్

అమరావతి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతం రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి, పల్నాడు ప్రాంతాన్ని దుర్భిక్షానికి దూరం చేసేందుకు తలపెట్టిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి సహకరించాలని ఏపీప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాలని కేంద్ర ఆర్థిక శాఖ సూచించింది. అది అందితే నిధుల విడుదలపై కార్యాచరణ సిద్ధంచేస్తామని హామీ ఇచ్చింది. దాదాపు రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టుపై సోమవారం ఢిల్లీలో ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్.. కేంద్ర ఆర్థిక శాఖ (వ్యయం) కార్యదర్శి నాగరాజును కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దేశంలో మొదటిసారిగా వరద జలాలను ఎత్తిపోయడం ద్వారా కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం తలపెట్టామని పీయూష్ తెలిపారు. 'జలహారతి' పేరిట ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన ఈ పథకానికి ప్రాథమికంగా రూ.80,000 కోట్ల మేర వ్యయమవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. దీనికి నదుల అనుసంధాన కార్యక్రమంలో భాగంగా కేంద్రం ప్రత్యేకంగా ఇచ్చే నిధులతోపాటు విదేశీ ఆర్థిక సంస్థల నుంచి కూడా రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇది పోలవరం ప్రాజెక్టు కంటే చాలా పెద్దదైనందున స్వల్పకాలికంగా కాకుండా దీర్ఘకాలం.. ఏడేళ్లపాటు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీని ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదికను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి పంపామన్నారు. దీంతో సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించాలని అనిల్ యాదవ్ సూచించారు. ఈ నెలాఖరునాటికి రిపోర్టును సిద్ధం చేసి సమర్పిస్తామని పీయూష్ తెలిపారు.

వరద జలాల సద్వినియోగానికి..

బనకచర్ల పథకం రూపకల్పనపై పీయూష్ చెప్పిన సమాచారాన్ని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సావధానంగా విన్నారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేలా తెలంగాణ భూభాగంలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. విభజిత ఆంధ్రప్రదేశ్ కూడా గోదావరి జలాలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలంటే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏటా 2,800 నుంచి 3,200 టీఎంసీల గోదావరి జలాలు వరదల సమయంలో వృథాగా కడలిపాలవుతున్నాయి. ఈ వరదనీటి సద్వినియోగానికే బనకచర్ల పథకం చేపట్టాలని నిర్ణయించాం. దిగువ రాష్ట్రంగా సముద్రంలో కలసిపోతున్న వరద జలాలను వాడుకునే స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. ఈ పథకం కింద వరద జలాలనే తరలిస్తాం' అని స్పష్టంచేశారు. గోదావరి నదికి జూలై 1 తేదీ నుంచి అక్టోబరు మధ్యదాకా వరద ఉధృతంగా ఉంటుందని పీయూష్ వెల్లడించారు. ఈ వరద నీటిలో 200 టీఎంసీలను 100 రోజుల్లో ఎత్తిపోస్తామని తెలిపారు. ఈ వివరాలు ఆలకించాక కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. డీపీఆర్‌ను సమర్పిస్తే.. నిధుల విడుదలపై కార్యాచరణ వెల్లడిస్తామని హామీ ఇచ్చారు.

'మిస్ ఇంగ్లండ్'తో బీఆర్ఎస్ వాళ్లే మాట్లాడించారేమో: చామల

- బీఆర్ఎస్ బలహీనపడితే.. బలపడేది బీజేపీనే: యాష్కీ

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ ప్రభుత్వాన్ని బద్‌నాం చేయడం కోసం.. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీతో బీఆర్ఎస్ వాళ్లే అలా మాట్లాడించారేమో..' అంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఆమెను ఇబ్బంది పెట్టినట్లుగా వీడియో ఫుటేజీలు ఉంటే బయటపెట్టాలంటూ హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. సీఎం సన్నిహిత ఎంపీ, కార్పొరేషన్ ఛైర్మన్‌లు విల్లీ మాగీని ఇబ్బంది పెట్టినట్లుగా వార్తలు వస్తున్నాయంటూ హరీశ్ చేసిన వ్యాఖ్యలపై చామల ఈ మేరకు స్పందించారు. మూడేళ్లకే కేసీఆర్ సీఎం అవుతాడని కేటీఆర్ అంటున్నాడని, ఆయన సీఎం అయ్యేది స్వర్గానికా.. లేక నరకానికా అని ప్రశ్నించారు. కేటీఆర్‌కు ఉన్న నల్లధనాన్ని మొత్తం ఖర్చు పెట్టినా.. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాడన్నారు. తెలంగాణలో కన్ఫ్యూజన్ పొలిటీషియన్ ఎవరైనా ఉన్నారంటే ఆయన ఈటల రాజేందరేనని ఎద్దేవా చేశారు. ఆయన ఇంటిలోపల ఈటల రాజేందర్‌రెడ్డి అని, ఆ ఇంటి గేటు దాటగానే బీసీ నాయకుడైపోతాడని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత చర్యలతో బీఆర్ఎస్ బలహీన పడితే.. ఆ స్థానంలో బీజేపీనే బలపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ గౌడ్ వ్యాఖ్యానించారు. కవిత.. బీజేపీ వదిలిన బాణమేనన్నారు. ఆమె ఓ లేడీ మాఫీయా డాన్, ఆమె చేయని దందాలు లేవని ఆరోపించారు. ఆ కేసుల నుంచి బయటపడాలంటే ఆమెకు బీజేపీ సహకారం అవసరమన్నారు. జాగృతి.. ఓ అవినీతి సంస్థ అని, దానిపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

30 మున్సిపాలిటీల్లో వార్డుల పునర్‌విభజనకు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ముప్పై మున్సిపాలిటీల్లో విలీనం కానున్న గ్రామ పంచాయతీలను వార్డులుగా పునర్‌విభజన చేయడానికి షెడ్యూల్‌ను విడుదల చేస్తూ పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీలోపు 19 రోజుల్లో పునర్‌విభజన ప్రక్రియ పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూన్ 21న తుది నోటిఫికేషన్ విడుదల చేయాలని పేర్కొన్నారు. 43 మున్సిపాలిటీల్లో ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా ఓఆర్ఆర్ లోపల ఉన్న 13 మున్సిపాలిటీల్లో వాయిదా వేశారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ కింద ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నందున ఈ మున్సిపాలిటీలను మినహాయించినట్లు పురపాలక శాఖ అధికారులు తెలిపారు.

అవినీతి అధికారులపై ప్రభుత్వానికి ఏసీబీ నివేదిక

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన వివిధ విభాగాల్లోని అధికారులపై నమోదు చేసిన కేసులు, దర్యాప్తు వివరాల నివేదికను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రభుత్వానికి సమర్పించింది. గతంలో 112 మంది ఉద్యోగులపై నమోదైన అవినీతి కేసులకు సంబంధించి ఈ ఏడాది జనవరి నుంచి మే చివరి నాటికి జరిగిన దర్యాప్తు, సేకరించిన ఆధారాలతో తుది నివేదికను ప్రభుత్వానికి ఏసీబీ ఉన్నతాధికారులు అందించారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా లంచం, అవినీతి, నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించిన మొత్తం 19 అవినీతి కేసులను నమోదు చేశారు. ఆయా కేసుల్లో మొత్తం 25 మంది ప్రభుత్వోద్యోగులను ట్రాప్ చేసి, రెడ్‌హ్యాండెడ్‌గా, ఆకస్మిక తనిఖీల్లో పట్టుకుని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ జోన్ టాప్!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయి టాప్-10లో ఇద్దరు

- అత్యధికంగా 12946 మంది అర్హత
- ఢిల్లీ విద్యార్థి రజిత్ గుప్తాకు మొదటి ర్యాంకు
- 332 మార్కులు సాధించిన విద్యార్థి
- బాలికల్లో దేవదత్త మాఝీ ఫస్ట్

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్ష నిర్వాహక సంస్థ ఐఐటీ కాన్పూర్ సోమవారం ఈ ఫలితాలను విడుదల చేసింది. జాతీయ ర్యాంకులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలను ఏడు జోన్లుగా విభజించి, జోన్ల వారీగా ఫలితాలను ప్రకటించారు. జాతీయస్థాయిలో ఢిల్లీకి చెందిన విద్యార్థి రజిత్ గుప్తా 360 మార్కులకుగాను 332 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించారు. 332 మార్కులతో ఢిల్లీకి చెందిన సక్షం జిందాల్ ద్వితీయ, 330 మార్కులతో ముంబైకి చెందిన మాజిద్ హుస్సేన్ తృతీయ స్థానంలో నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన అర్ణవ్ సింగ్ 319 మార్కులతో 9వ ర్యాంకు; 317 మార్కులతో వడ్లమూడి లోకేశ్ 10వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈ పరీక్షకు 116 మంది విదేశీ అభ్యర్థులు కూడా హాజరయ్యారు. వారిలో 13 మంది అర్హత సాధించారు. కాగా ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలను చదివి, మాక్ టెస్ట్ పేపర్లను జాగ్రత్తగా విశ్లేషించడం ద్వారా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో విజయం సాధించామని ప్రథమ, రెండో ర్యాంకర్లు రజిత్ గుప్తా, సక్షం జిందాల్ తెలిపారు. వీరిద్దరూ రాజస్థాన్‌లోని కోటలో ఒకే కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందారు. జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో హైదరాబాద్ విద్యార్థి వంగాల అజయ్‌రెడ్డి జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే ఓబీసీ నాన్ క్రీమీలేయర్ విభాగంలో హైదరాబాద్ నుంచి ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి జాతీయస్థాయిలో అగ్రగామిగా నిలిచి సత్తా చాటాడు.

ఐఐటీ జోన్లలో హైదరాబాద్ టాప్..

అత్యధికంగా అర్హత సాధించిన జోన్లలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి మొత్తం 12946 మంది విద్యార్థులు అర్హత సాధించారు. 11370 మందితో ఢిల్లీ జోన్, 11226 మందితో ముంబై జోన్ వరగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రూర్కీ 5445, ఖరగ్‌పూర్ 5353, కాన్పూర్ 5295, గువాహటి జోన్లో 2743 మంది అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా మొత్తం 1,80,422 మంది పరీక్షకు హాజరవగా.. 54,378 (30.13శాతం) మంది అర్హత సాధించారు. హైదరాబాద్ జోన్ నుంచి టాప్-10లో ఇద్దరు విద్యార్థులు ఉండగా, టాప్-100లో 23, టాప్-200లో 57, టాప్-300లో 78, టాప్-400లో 116, టాప్-500లో 139 మంది ర్యాంకులు సాధించారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష దేశవ్యాప్తంగా 14,75,103 మంది హాజరయ్యారు. ఈ లెక్కన ఐఐటీల్లో ప్రవేశాలే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 14.75 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. చివరికి అర్హత సాధించింది కేవలం 54,378 మాత్రమే. అంటే మొత్తం అభ్యర్థుల్లో కేవలం 3.68 శాతం విద్యార్థులే అర్హత సాధించి ఐఐటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు హాజరు కానున్నారు. మొత్తం 23 ఐఐటీల్లో 17,740 సీట్లు భర్తీ చేయనున్నారు.



ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 11వ ర్యాంకు సాధించిన అర్ణవ్ నిఘమ్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

హైదరాబాద్ జోన్ టాపర్లు	పేరు	కామన్ ర్యాంక్ (సీఆర్ఎల్)
1	అర్ణవ్ సింగ్	9
2	వడ్లమూడి లోకేశ్	10
3	ధర్మాన జ్ఞాన రుత్విక్ సాయి	18
4	వంగాల అజయ్‌రెడ్డి	19
5	అవనగంటి అనిరుధ్‌రెడ్డి	20

కామన్‌లో 74 మార్కులకు అర్హత..

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కామన్ ర్యాంకు లిస్ట్ (సీఆర్ఎల్)లో ప్రతి సబ్జెక్టులో కనీస మార్కులు 7, మొత్తం మార్కులు 74గా నిర్ణయించి అర్హులను ఎంపిక చేశారు. అలాగే ఓబీసీ, జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో సబ్జెక్టు మార్కులు 6, మొత్తం మార్కులు 66గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీడబ్ల్యూడీ విభాగం విద్యార్థులకు సబ్జెక్టులో కనీస మార్కులు 3, మొత్తం 37గా, ప్రిపరేటరీ కోర్సు (పీసీ) ర్యాంకు లిస్టులో కనీస సబ్జెక్టు మార్కులు 1, మొత్తం 18గా పరిగణనలోకి తీసుకున్నారు.

9404 మంది విద్యార్థినుల అర్హత

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు 54,378 మంది అర్హత సాధించగా.. వీరిలో 9404 మంది విద్యార్థినులు ఉన్నారు. ఖరగ్‌పూర్ జోన్‌కు చెందిన దేవదత్త మాఝీ జాతీయస్థాయిలో 16వ ర్యాంకు సాధించి బాలికల్లో టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ జోన్‌లో కోరికాన రసజ్ఞ టాపర్‌గా నిలిచారు. ఈమె జాతీయ స్థాయిలో 78వ ర్యాంకు సాధించారు. ఐఐటీ రూర్కీ నుంచి పీయూష దాస్ 29, ఢిల్లీ నుంచి లారిసా 59, ముంబై నుంచి అలీస్ పటేల్ 155, కాన్పూర్ నుంచి హర్షిత గోయల్ 434, గువాహటి నుంచి సౌమ్యా శ్రేయాసి 581వ ర్యాంకుతో బాలికల్లో జోన్ టాపర్లుగా నిలిచారు. మొత్తం అర్హత సాధించిన 54,378 విద్యార్థుల్లో జనరల్ విభాగంలో అత్యధికంగా 17273 మంది ఉండగా, ఓబీసీ 12606, ఎస్సీ 12499, జనరల్ ఈడబ్ల్యూఎస్ 6414, దివ్యాంగులు 578 మంది ఉన్నారు.



ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 19వ ర్యాంకు సాధించిన వి.అజయ్‌రెడ్డితో తల్లిదండ్రులు



ఓబీసీ విభాగంలో మొదటిర్యాంకు సాధించిన జ్ఞాన రుత్విక్ సాయితో తండ్రి శంకర్‌నారాయణ

కామన్ ర్యాంక్	పేరు	మార్కులు	జోన్
1	రజిత్ గుప్తా	332	ఐఐటీ ఢిల్లీ
2	సక్షం జిందాల్	332	ఐఐటీ ఢిల్లీ
3	మాజిద్ ముజాహిద్ హుసేన్	330	ఐఐటీ ముంబై
4	పార్త్ మందార్ వర్తక్	327	ఐఐటీ ముంబై
5	ఉజ్వల్ కేసరి	324	ఐఐటీ ఢిల్లీ
6	అక్షత్ కుమార్ చౌరాసియా	321	ఐఐటీ కాన్పూర్
7	సాహిల్ ముకేశ్‌దేవ్	321	ఐఐటీ ముంబై
8	దేవేశ్ పంకజ్ భయ్యా	319	ఐఐటీ ఢిల్లీ
9	అర్ణవ్ సింగ్	319	ఐఐటీ హైదరాబాద్
10	వడ్లమూడి లోకేశ్	317	ఐఐటీ హైదరాబాద్



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సుష్మ

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఆలిండియా మొదటి ర్యాంకుతో పాటు ఓపెన్ కేటగిరీలో 3, 5, 6, 11 ర్యాంకులు సాధించారని శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో, అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. వంగాల అజయ్ రెడ్డి 300 మార్కులకు 300 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఓపెన్ కేటగిరీలో ఎం.ఎ. జిద్దుసైన్ 3, ఉజ్వల్‌కేసరి 5, అక్షత్‌కుమార్ చౌరాసియా 6, అర్ణవ్‌నిగమ్ 11, దేవ్‌దుత్త మఝీ 16, రుత్వికసాయి 18, వంగాల అజయ్‌రెడ్డి 19వ ర్యాంకు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో టాప్ 10లోపు మూడు ర్యాంక్‌లు, 20లోపు ఎనిమిది, 50లోపు 19 ర్యాంకులు, 100లోపు 29 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, అధ్యాపకులను అభినందించారు.



ర్యాంకులు సాధించిన నారాయణ విద్యార్థులు

సత్తా చాటిన నారాయణ విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో మాజిద్ హుస్సేన్ (3వ ర్యాంక్), పార్థ్ మందార్ వార్తక్ 4, అక్షత్ చౌరాసియా 6, సాహిల్ డియో 7, వడ్లమూడి లోకేష్ 10వ ర్యాంక్‌లతో టాప్ 10లో నిలిచారని పేర్కొన్నారు. వీరితోపాటు ఓపెన్ కేటగిరీలో 100లోపు 43 ర్యాంకులు తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. అన్ని కేటగిరీల్లో 50లోపు 42 ర్యాంకులు, 100లోపు 75 ర్యాంకులను సొంతం చేసుకుని, విశేష ప్రతిభ చాటారని వివరించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వారు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

సంచలనం సృష్టించిన భాష్యం విద్యార్థులు

గుంటూరు(విద్య), జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఓపెన్ కేటగిరిలో ఎస్.వెంకటసాయి చక్రి 33వ ర్యాంకు సాధంచగా, ఎం.శ్రీకర గణేష్ 104, ఎస్.ఆకాష్ 108, టి.విక్రమ్ లెవీ 146, డి.జస్వంత్ బాలాజీ 151, జి.సాయిమనోజ్ఞ 152వ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారన్నారు. 100లోపు 14ర్యాంకులు, 200లోపు 26 ర్యాంకులు, 500లోపు 57 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని వెల్లడించారు. ఉన్నత చదువుల నిమిత్తం ఎస్.వెంకటసాయిచక్రి, జి.సాయిమనోజ్ఞకు రూ.5లక్షల చొప్పున, శ్రీకర గణేష్, ఎస్.ఆకాశ్‌కు రూ.2 లక్షల చొప్పున, టి.విక్రమ్ లెవీ, డి.జస్వంత్ బాలాజీలకు రూ.లక్ష చొప్పున అందజేసినట్టు తెలిపారు.

ఎస్సార్ విద్యార్థుల ప్రభంజనం



ఎం.రవిచంద్రరెడ్డి, వి.నాగసిద్ధార్థ, పి.సాక్షి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో ఎం.రవిచంద్రరెడ్డి 8వ ర్యాంకు, వి.నాగసిద్ధార్థ 13, పి.సాక్షి 40, ఎ.అనుశ్రీ 47వ ర్యాంకు సాధించి ఎస్సార్ విద్యాసంస్థల కీర్తిని పతాక స్థాయికి చేర్చారన్నారు. వీరితోపాటు ఓపెన్ కేటగిరీలో బి.సాయి 68వ ర్యాంకు, వి.భరణిశంకర్ 90, జి. రాజేష్ 106, బి.వినోద్ 115, ఎం.వెంకటకౌశిక్ 123, ఎస్.పవన్ 204, ఎ.సంతోష్ 265, బి.వాగ్దేవి 269 ర్యాంకులు సాధించారని వెల్లడించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎస్సార్ విద్యాసంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

అల్ఫోర్స్ విద్యార్థుల అద్భుత విజయం

సుభాష్‌నగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. వివిధ కేటగిరీల్లో అజ్మీరా పురుషోత్తం నాయక్ 166, పీఎస్ సాయిధృవ 557, ఎస్ అనిరుధ్ సాయి 657, బి ఆదిత్య945వ ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే, 11 మంది విద్యార్థులు 2000లోపు, 19 మంది విద్యార్థులు 3000లోపు ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు ఆయన అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి 8వ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ అడ్వాన్‌డ్ ఫలితాలలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యారులు వివిధ కేటగిరీల్లో మొదటి 100 లోపు 13 ర్యాంకులు సాధించారు. కొరికన రసజ్ఞ 8వ ర్యాంకు, ఎం. మణిదీప్ వర్మ 21, ఎస్. నిర్మిత్ 29, సీహెచ్.చేతన్ 34, కే.ధీరజ్ 37, ఎల్. చెర్విత 41, జి.ప్రత్యూష 47, ఎస్.హేమంత్ అభిరామ్ 48, శ్రీవినయ్ 50వ ర్యాంకులు సాధించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఓపెన్ కేటగిరీలో 78వ ర్యాంకు సాధించటం గమనార్హం. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

రెసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో రెసోనెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థి పల్లా శివ సంకేత్ రెడ్డి 102వ ర్యాంకు సాధించారు. రెసోనెన్స్‌కు చెందిన 21 మంది విద్యార్థులు 1000లోపు ర్యాంకులు సాధించారు. ఈ సంస్థ క్యాంపస్‌ల నుంచి 170కు పైగా విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీల్లో ప్రవేశం పొందనున్నట్లు రెసోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ నర్రా పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తెలంగాణ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన 492 మంది పరీక్షకు హాజరవగా.. 97 మంది డైరెక్ట్ ర్యాంకులు, 132 మంది ప్రిపరేటరీ ర్యాంకులు సాధించారని గురుకుల కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు చెందిన 146 మంది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని ఆ సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. మొత్తం 285 మంది శిక్షణ పొందగా.. 8 మంది ఓపెన్ క్యాటగిరీలో ర్యాంకులు సాధించారని, 20 మందికి వెయ్యిలోపు ర్యాంకులు వచ్చాయని, 82 మందికి ఐఐటీల్లో సీట్లు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

సత్తా చాటిన గిరిజన విద్యార్థులు

ఖమ్మం జిల్లా నుంచి ఎస్టీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. అజ్మీరా రోషిక్ మణిదీప్ జాతీయ స్థాయిలో 5వ ర్యాంక్, హసావత్ జశ్వంత్‌రామ్ 9వ ర్యాంక్ సాధించారు. ఇంజనీర్‌గా స్థిరపడాలనే లక్ష్యంతోనే చదువుతున్నట్లు రోషిక్ చెప్పాడు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్‌లో స్థిరపడాలన్నది తన లక్ష్యమని జశ్వంత్‌రామ్ తెలిపాడు. మహబూబాబాద్ జిల్లా తూర్పుతండాకు చెందిన గుగులోతు హిమాన్షు ఎస్టీ విభాగంలో ఆలిండియా 12వ ర్యాంకు సాధించాడు.

మంచి గైడెన్స్‌తోనే..: అర్ణవ్ నిఘమ్

ఉపాధ్యాయులిచ్చిన మంచి గైడెన్స్‌తో చదవడం వల్లే ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 11వ ర్యాంకు సాధించా. మాక్ టెస్టులు క్రమం తప్పకుండా రాయడంతో ఎక్కడ తప్పు చేస్తున్నామో తెలుసుకుంటూ తర్వాత రాసే పరీక్షలో ఆ తప్పులు జరగకుండా జాగ్రత్త పడేవాణ్ణి. సబ్జెక్టులపై అవగాహన వచ్చే వరకు చదవడంతో పాటు పరీక్షల సమయంలో భయం లేకుండా రాశా. ఐఐటీ ముంబైలో చేరతా.

కంప్యూటర్ సైన్స్‌లో చేరతా: అజయ్‌రెడ్డి

పదో తరగతి నుంచి ఒక లక్ష్యంతో చదువుతుండడంతో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 19వ ర్యాంకు సాధించగలిగా. ఉదయం నుంచి రాత్రి వరకు ఎలాంటి ఒత్తిడి లేకుండా రోజూ మాక్ టెస్టులు రాశా. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా.

18 గంటలు ఇష్టంతో చదివా: జ్ఞాన రుత్విక్‌సాయి

రోజూ 18 గంటలు ఇష్టపడి చదవడం వల్లే ఓబీసీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించా. చిన్నప్పటి నుంచి ఉన్నతస్థాయికి చేరాలనే లక్ష్యంతోనే చదువుతున్నా. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా.

మరికొన్ని ఉత్తమ ర్యాంకులు సాధించిన తెలుగు విద్యార్థులు..

ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా గుణానుపురం గ్రామానికి చెందిన పల్ల భరత్‌చంద్ర ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 21వ ర్యాంకు, ఓబీసీలో 2వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. విజయనగరం జిల్లాకు చెందిన పీతల ఆనంద చక్రవర్తి 118వ ర్యాంకు సాధించాడు. తెలంగాణలోని పరిగి విద్యార్థి కె.ప్రణవ్‌తేజ 136వ ర్యాంకు సాధించారు. ఏపీకి చెందిన ఎం.జయచంద్ర 169వ ర్యాంకు, పి.ఆదిత్య అభిషేక్ 257, జి.శ్రీరామశశాంక్ 281, జాగాన యోగేశ్వర్ 284, వై.శుభశ్రీవల్లీ ఆత్రేయి 296, పొట్నూరు కార్తీక్ 419వ ర్యాంకు సాధించారు.

మలిసంధ్యలో ఉత్సాహ పొద్దు!

- రాష్ట్రవ్యాప్తంగా 37 మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు
- వృద్ధుల్లో ఒంటరితనాన్ని దూరం చేసేందుకే
- క్యారమ్స్, చెస్ వంటి గేమ్స్.. యోగా, ధ్యానం ఏర్పాట్లు
- ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం.. త్వరలోనే టెండర్లు



హైదరాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఉదయం తొమ్మిదింటికే డ్యూటీ వెళ్లేవారు వెళ్లిపోవడంతో, పిల్లలు బడికి వెళ్లిపోవడంతో ఇంట్లోని పెద్దమనుషులు పలకరించేవారు లేక సమయాన్ని భారంగా గడుపుతున్నారు. ఈ రోజుల్లో చాలా ఇళ్లలోని వృద్ధులు ఇలా రోజంతా బోర్‌గా ఫీలవుతున్నారు. ఈ సమస్య నుంచి వారిని బయటపడేసేందుకు త్వరలోనే 'మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్లు' వచ్చేస్తున్నాయి. అక్కడ టైంపాస్ అవ్వడం లేదన్న మాటే లేకుండా వృద్ధులు రోజంతా హాయిగా గడిపేయొచ్చు. ఈ మేరకు 60 ఏళ్లపైబడిన వారు మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా గడిపేందుకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, హనుమకొండ జిల్లాల్లో రెండేసి కేంద్రాలు, మిగతాజిల్లాల్లో ఒక సెంటర్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కొత్త భవనాలు నిర్మించడమో, కొన్నిచోట్ల అద్దె భవనాలు తీసుకోవడమో చేస్తున్నారు. ప్రతి డే కేర్ సెంటర్లో అధునాతన వసతులు అందుబాటులో ఉంటాయి. దీనికి సంబంధించిన ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేశారు. ఈ మేరకు త్వరలోనే డే కేర్ సెంటర్ల నిర్వహణ కోసం టెండర్లు పిలుస్తారు. జిల్లా సంక్షేమ అధికారుల నిరంతర పర్యవేక్షణలో ఈ సెంటర్లు నడుస్తాయి. ఈ కేంద్రాల ఏర్పాటు తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా మరిన్నిచోట్ల వీటిని ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్వహణ కోసం రూ.90వేల చొప్పున విడుదల చేశారు. ప్రతి కేంద్రంలో 50 మంది వయోధికులకు సేవలందించేలా ఏర్పాట్లుంటాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రాలు ఊరటనిస్తాయని, గౌరవంగా, సంతోషంగా జీవించడానికి వేదిక అవుతున్నాయని సీతక్క పేర్కొన్నారు.

చెస్, క్యారమ్స్.. ఉప్మా, జ్యూస్

డే కేర్ సెంటర్లలో వృద్ధులు ఇతర సీనియర్ సిటిజెన్స్‌తో ఉల్లాసంగా గడపడంలో భాగంగా క్యారమ్స్, చెస్ తదితర గేమ్స్ ఆడుకునే ఏర్పాట్లు చేయనున్నారు. ప్రాంగణంలో సేదతీరేందుకు పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పుస్తక ప్రియుల కోసం లైబ్రరీ ఏర్పాటు చేస్తారు. అక్కడ వార్తాపత్రికలు కూడా అందుబాటులో ఉంచుతారు. టీవీ చూడొచ్చు. వైఫై సౌకర్యమూ ఉంటుంది. యోగ, ధ్యానం చేసుకునేవారికి ప్రత్యేక ఏర్పాట్లుంటాయి. వారానికి రెండుసార్లు వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఉచితంగా మందులు ఇస్తారు. కుటుంబ సమస్యల కారణంగా మానసిక వేదనతో సతమతమవుతున్న వారి కోసం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తారు. నడవలేని వారికి వీల్‌చైర్లు, ఇతర సహాయ పరికరాలు అందుబాటులో ఉంచుతారు. రాగి జావ, పండ్లు, జ్యూస్, ఉప్మా, టీ, బిస్కెట్లు వంటి ఆహారాన్ని అందజేస్తారు.

మెడికల్ సీట్లలో స్థానికతపై

కౌంటర్ దాఖలు చేయండి

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంనోటీసులు
- జీవో 33పై విచారణ

న్యూఢిల్లీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీట్ల కేటాయింపులో స్థానికత అంశంపై సమాధానం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విద్యార్థులు దాఖలు చేసిన ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్లకు(ఐఏ) కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో 33ని తీసుకొచ్చింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు నాలుగు సంవత్సరాలు స్థానికంగా చదవాలని జీవో 33లోని నిబంధన 3(ఏ)లో స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్ సహా 160 మంది తొలుత హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత గతేడాది సెప్టెంబర్ 5న హైకోర్టు సీజే నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు చెప్పింది. ఒక విద్యార్థి తెలంగాణలో నివాసం లేదా శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వం మార్గదర్శకాలేవీ రూపొందించలేదని అభిప్రాయ పడింది. తొలుత మార్గదర్శకాలు, నిబంధనలను రూపొందించాలని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సెప్టెంబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ తర్వాత మరికొంతమంది విద్యార్థులు తమకు స్థానికత వర్తింపజేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అన్ని పిటిషన్లను సోమవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిశీలించింది. వేసవి సెలవుల తర్వాత దీనిపై విచారణ చేపడతామని ధర్మాసనం తెలపగా, ఈ నెల 14న నీట్ ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని, అందువల్ల వెంటనే విచారణ జరపాలని అభ్యర్థుల తరఫున న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే పుట్టి, అక్కడే చదువుకుని, అన్ని గుర్తింపు కార్డులు ఉన్నప్పటికీ.. కేవలం నాలుగేళ్లు వేరేచోట చదువుకున్నారన్న కారణంతో స్థానికతను వర్తింపజేయకపోవడం సరికాదని వాదనలు వినిపించారు. దీనికి ప్రభుత్వం తరఫున న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో పుట్టి వేరే రాష్ట్రాలు, దేశాలకు వెళ్లి చదువుకుని మళ్లీ అడ్మిషన్ల సమయానికి రాష్ట్రానికి తిరిగి వస్తున్నారని ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు. గతంలో కొంతమందికి కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించారని, అలాగే తమకూ అవకాశం కల్పించాలని మరికొంత మంది ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్(ఐఏ)లు దాఖలు చేశారని అభ్యర్థుల తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ పిటిషన్లపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈలోపు అత్యవసరం అనుకుంటే.. సుప్రీంకోర్టు ఎదుట ప్రత్యేకంగా ప్రస్తావించవచ్చని తెలిపింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

నా పేరు కవిత... నేనెప్పుడూ ప్రజలపక్షమే

- రాష్ట్రం నుంచి ప్రపంచ స్థాయి సాహిత్యం రావాలి
- పాలకులు ఎవరున్నా ప్రశ్నించాల్సిందే: ఎమ్మెల్సీ కవిత
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువకవుల సమ్మేళనం



తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కవిత

హైదరాబాద్ సిటీ, జూన్2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయి సాహిత్యం రావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆకాంక్షించారు. తెలంగాణ సాహిత్యం, సంస్కృతి వర్ధిల్లడం ద్వారానే ఈ నేల సమృద్ధిగా ఉంటుందన్నది తెలంగాణ జాగృతి విశ్వాసమని పేర్కొన్నారు. చిన్నారులు బతుకమ్మ పాటలు నేర్చుకోవడం ద్వారా, యువత సాహిత్య రంగంలోకి ప్రవేశించడం ద్వారా కనీసం మరో వందేళ్ల వరకైనా మన సంస్కృతి, సాహిత్యాలు విరాజిల్లుతాయని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ ధిక్కార స్వభావం తెలంగాణ కవుల సొంతమని గుర్తు చేశారు. యువ వికాసం పథకానికి శ్రీకాంతాచారి పేరు పెట్టాలన్నందుకు.. సీఎం రేవంత్ ఆ కార్యక్రమాన్నే రద్దు చేసుకొన్నారని మండిపడ్డారు. ఇలాంటి కుట్రలకు వ్యతిరేకంగా కవులు, రచయితలు, కళాకారులు గళమెత్తాలని కోరారు. ఇది ఒక రకంగా తెలంగాణ జాగృతి విజయమని వ్యాఖ్యానించారు. "ఇవాళ మా నాన్న అధికారంలో లేనందున ప్రశ్నించమంటున్నానని అనుకుంటున్నారేమో.! కవులు ఎప్పుడూ ప్రజల పక్షాన ప్రశ్నించాల్సిందే.. అప్పుడే అభివృద్ధి దిశగా సమాజం ముందుకు సాగుతుంది. నా పేరే కవిత. నేనెప్పుడూ ప్రజల పక్షమే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. కవి సమ్మేళనంలో వివిధ జిల్లాలకు చెందిన 55మంది యువతీ, యువకులు తాము రాసిన కవిత్వాన్ని సభలో చదివి వినిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


SR'S LEGACY CONTINUES!
When dedication meets direction, AIRs are just milestones.
JEE ADVANCED RESULTS-2025
50 YEARS OF BRILLIANCE
All INDIA RANK 8 M.RAVI CHANDRA REDDY R.No. 256015010 (R)
Groomed by SR from School to College
All INDIA RANK 13 V.NAGA SIDDHARTHA R.No. 256196129 (R)
All INDIA RANK 40 P.SAKSHI R.No. 256159038 (R)
All INDIA RANK 47 A.ANUSRI R.No. 256183009 (R)
All INDIA RANK 68 BANAVATH SAI R.No. 256152005 (R)
Groomed by SR from School to College
All INDIA RANK 90 Y.BHARANI SHANKAR R.No. 256196022 (R)
106 G.RAJESH R.No. 256165339 (R)
115 B.VINOD R.No. 256178179 (R)
123 M.VENKATA KOWSIK R.No. 256039003 (R)
204 S.PAVAN R.No. 256168251 (R)
265 A.SANTHOSH R.No. 256179171 (R)
269 B.VAAGDEVI R.No. 256199037 (R)
279 CH.ANSIKA R.No. 256200171 (R)
279 B.NIKHIL R.No. 256192046 (R)
376 G.MANJULA R.No. 256193140 (R)
389 B.GANESH R.No. 256195015 (R)
395 B.RAM CHARAN R.No. 256146476 (R)
438 J.RAJESH R.No. 256146400 (R)
452 D.NAVEEN R.No. 256196136 (R)
464 V.SWARAN NAIK R.No. 256175071 (R)
465 B.D.SHANMUKHA SREE R.No. 256182006 (R)
471 K.M.SATHWIK BHARATH R.No. 256019221 (R)
506 B.RAJENDER R.No. 256195150 (R)
555 K.SANJAY R.No. 256196074 (R)
566 K.GANESH R.No. 256145241 (R)
566 K.SUDHA RANI R.No. 256166596 (R)
567 L.VIGNESWAR R.No. 256014144 (R)
570 M.VENU R.No. 256176184 (R)
594 M.MAHESH NAIK R.No. 256022158 (R)
633 B.ARUN R.No. 256195192 (R)
662 T.TEJAS UDBHAV REDDY R.No. 256018041
698 M.AKHILESH R.No. 256170261 (R)
772 S.BHARGAV R.No. 256131239 (R)
784 MD.KAIF FARMAAN R.No. 256195286 (R)
839 CH.RUCHITH REDDY R.No. 256150019 (R)
867 J.ABHI RAM R.No. 256196108 (R)
886 C.KAMALA VARDHAN R.No. 256146186 (R)
LONG TERM JEE (MAIN & ADVANCED) ADMISSIONS ARE IN PROGRESS 2025-26
HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433 | WARANGAL: 9642117378 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695 | NIZAMABAD: 9642117110, 096421 15777 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 |
KARIMNAGAR: 9642117335 | NALGONDA: 9573927070 |
ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 |
ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 |
NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.
SR Educational Academy
TELANGANA ● ANDHRA PRADESH ● KARNATAKA



అసమ్మతి గోల

- మరోసారి బయటపడ్డ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతల విభేదాలు
- ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఎదుట ఫిర్యాదులు
- మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేల తీరుపై ఆక్షేపణలు
- కార్పొరేషన్ చైర్మన్‌ల ప్రొటోకాల్ లొల్లి.. టీపీసీసీలో ఛాన్స్ కోసం నేతల రిక్వెస్టులు
- బీసీ కోటాలో మంత్రి పదవి కోసం విజయశాంతి ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లా నేతలతో హాట్‌హాట్‌గా సాగిన మీనాక్షి సమావేశం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్‌లో అసమ్మతి గోల అధిష్ఠానానికి చిరాకు పెట్టిస్తోంది. ఒకరిపై మరొకరు పరస్పరం చేసుకుంటున్న ఫిర్యాదులపై ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షినటరాజన్ దృష్టి పెట్టారు. కీలక నేతలు, ప్రజా ప్రతినిధుల మధ్య విభేదాలను తొలిగించి, పార్టీని బలోపేతం చేసే దిశగా ఏఐసీసీ నేతలు దృష్టిసారించారు. ఈక్రమంలోనే ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అర్ధరాత్రి వరకు జరిగిన వరంగల్ పార్లమెంట్ పరిధి నేతలతో మీనాక్షి చర్చలు జరిపారు. పలువురు ఎమ్మెల్యేలు మంత్రి కొండా సురేఖ తీరుపై ఫిర్యాదులు చేయగా (మిగతా 5వ పేజీలో)



హనుమకొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

పేదల అభ్యున్నతే లక్ష్యం



- అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి
- కొత్తగా 20,633 తెల్లరేషన్ కార్డుల జారీ
- రూ.30 కోట్లతో భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణం
- మొదటి, రెండవ దశల్లో 5705 ఇందిరమ్మ ఇళ్లు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

2



ఖిలావరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రైతులను రుణ విముక్తులను చేశాం

- ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం
- భూ భారతితో సమస్యలకు పరిష్కారం
- సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం
- వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

2



జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో
ఎస్సార్ ప్రభంజనం

- జాతీయ స్థాయిలో ఎం.రవిచంద్రరెడ్డికి 8వ, వి.నాగసిద్ధార్థకు 13వ ర్యాంకు
- విజేతలను అభినందించిన చైర్మన్ ఎ.వరదారెడ్డి

2

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- ఇక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- తహసీల్దార్ నేతృత్వంలో బృందాలు
- ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ

2

ఏఎల్‌పీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- 1,498 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు రైల్వే జీఎం వెల్లడి
- ఫలించిన ఎంపీ కడియం కావ్య కృషి

2

బాలుడిని రక్షించబోయి.. తానూ బలై..

- చెరువులో మునిగి ఇద్దరు దుర్మరణం
- నడికూడ మండలం రాయపర్తిలో విషాదం





వీర్ల హర్షవర్ధన్, సురేందర్ (ఫైల్)

నడికూడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడిన బాలుడిని రక్షించబోయిన వ్యక్తితో పాటు ఆ బాలుడు మృతి చెందిన విషాద ఘటన హనుమకొండ జిల్లా నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో సోమవారం జరిగింది. పరకాల పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాయపర్తికి చెందిన కూరాకుల సురేందర్ (45) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన ఇద్దరు కుమారులతో కలిసి చెరువులో చేపల వేటకు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన వీర్ల రాజమౌళి కుమారుడు హర్షవర్ధన్ (12) చెరువులో ఆడుతూ లోతుగా ఉన్న చోట మునిగిపోతున్నాడు. గమనించిన సురేందర్ బాలుడిని రక్షించడానికి వెళ్లాడు. హర్షవర్ధన్ భయంతో సురేందర్‌ని గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరు నీటిలో మునిగిపోయారు. ఒడ్డున ఉన్న సురేందర్ పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు చెరువులోకి దిగి అప్పటికే మృతి చెందిన వారి మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్ నాయక్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేసి పోస్టుమార్టానికి పంపించారు. సురేందర్‌కి భార్య రాణి, ఇద్దరు కుమారులున్నారు. బాలుడు హర్షవర్ధన్... తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి పూర్తి చేశాడు. కాగా, హర్షవర్ధన్ తండ్రి రాజమౌళి గతంలో మృతి చెందాడు. తల్లి సుజాత ఉంది. వారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎదుగుతున్న కొడుకుని కోల్పోయిన తల్లి సుజాత ఒకవైపు, ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన భార్యా, పిల్లలు మరోవైపు రోదిస్తున్న వారిని చూసి గ్రామస్థులు కంటతడి పెట్టారు.

రైతులను రుణ విముక్తులను చేసింది మేమే

రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ సిటీ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి.. కానీ రైతులను పూర్తిస్థాయిలో రుణ విముక్తులను చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన ఖిలావరంగల్‌లో జాతీయజెండా ఎగరేశారు.

అనంతరం మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఎనమిది నెలల్లోనే 26 లక్షల రైతులకు రూ.20.617 కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. రైతులకు పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని, వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేలు ఇస్తున్నామని, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని అన్నారు. అంతేగాకుండా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిస్కారం చూపేందుకు భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి పొంగులేటి అన్నారు. మంగళవారం నుంచి అన్ని మండలాల్లో ఇది అమలులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలోని పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.

సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో శాస్త్రీయంగా జరిపిన కుల గణన సర్వేలో బీసీలు 50.36 శాతం ఉన్నట్లు తేలిందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. దీని ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని శాసనసభలో ఆమోదించి బిల్లు ఆమోదించి పార్లమెంటుకు పంపామన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటాలకు మా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని పునరుద్ఘాటించారు.

యువతకు బంగారు భవిష్యత్తు..

కేవలం 16 నెలల్లోనే 60 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి ప్రకటించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామన్నారు. అభయహస్తం పథకం కింద సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరయ్యే వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని అందిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ ఏడాది ప్రతీ నియోజకవర్గానికి 3,500ల ఇళ్ల చొప్పున మంజూరు చేస్తున్నామని, పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో 47 వేల ఇండ్లను మంజూరు చేశామని, వరంగల్ జిల్లాలో 612 ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తున్నామన్నారు.



వరంగల్‌లో జరిగిన వేడుకల్లో రైతులకు కంది విత్తనాలను అందజేస్తున్న మంత్రి

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి రూ.4962 కోట్లు కేటాయించామన్నారు. 2040 నాటికి జనాభాకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ తీసుకువచ్చామని చెప్పారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ కళ త్వరలో సాకారం అవుతుందన్నారు. భూసేకరణకోసం ఇప్పటికే రూ.205 కోట్లు కేటాయించామన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనులను వేగవంతం చేశామన్నారు. వరంగల్ పాత బస్‌స్టేషన్ స్థానంలో అత్యంత అధునాతన సౌకర్యాలతో కొత్త బస్ స్టేషన్ నిర్మిస్తున్నామని, కాళోజీ కళాక్షేత్రం పనులను పూర్తి చేసి ప్రారంభించామని, అదేవిధంగా రూ.80 కోట్లతో వరంగల్‌లో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో

ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

హనుమకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని, అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నా రు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు జరుగు తోందన్నారు. ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండదండలను అందిస్తోందని, అ న్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతోందని అన్నా రు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల జిల్లా అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి సాధిస్తోందన్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో వివరించారు. జిల్లా ప్రజలకు రాష్ట్రావతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, రూ.500కు గ్యాస్ సరఫరా, మహాలక్ష్మి పథకంలో భాగంగా దీపం పథకం, ఉజ్వల పథకం కింద 88626 గ్యాస్ కనెక్షన్లు పొందారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో వాటితో పాటు నిధులను మంజూరు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.



హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి శకటం

జిల్లాలో 54,734 మంది రైతులకు రూ. 450 కోట్ల రుణమాఫీ చేశామన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 12 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. జిల్లాలో రైతుల నుండి 63925.64 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లు కొనుగోలు చేసి రూ.31.96 కోట్ల బోనస్ అందించామని, యాసంగి సీజన్‌లో 27,045 మంది రైతుల నుండి 1.17,610 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ. 252.36 కోట్లు చెల్లించామని చెప్పారు. జిల్లాలో తెల్లరేషన్‌కార్డులు ఉన్న కుటుంబాలకు ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు గాను 13,389.8 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని, జిల్లాలో కొత్తగా 20,633 తెల్లరేషన్ కార్డులను జారీ చేయడం ద్వారా 92,362 మంది కుటుంబ సభ్యులు ఉచితంగా రేషన్ పొందుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు.

25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటె డ్ మోడల్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చు ట్టామని, 58 పాఠశాలల నిర్మాణం చేపట్టామని, జి ల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల మంజురు అయ్యాయని తెలిపారు.

కుడా ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి రూ. 483.05 కోట్లతో కార్యప్రణాళికను రూపొందించామన్నారు. రూ. 30 కోట్లతో భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణం, రూ. 5 కోట్లతో ఎల్కతుర్తి బస్టాండ్ కూడలి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రూ. 2 కోట్లతో పాత కలెక్టరేట్ నివాసం, రూ. 2 కోట్లతో భద్రకాళి చెరువు సుందరీకరణ పనులు చేపట్టినట్టు తెలిపారు. వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ పథకం కింద రూ. 944.67 కోట్లతో 108 పనులు మంజూరు కాగా రూ. 542.29 కోట్లతో 70 పనులు పూర్తయ్యాయనీ, 38 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. 15వ ఆర్థిక సంఘం కింద 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 47.98 కోట్లు విడుదలయ్యాయని, ఈ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు.

దేవాదుల పథకం మూడవ దశలోని ప్యాకేజీ-3 కింద రామప్ప చెరువు నుంచి నీటిని దేవన్నపేట పంప్ హౌజ్ వరకు గ్రావిటీ టన్నెల్ ద్వారా, దేవన్నపేట పంపు హౌజ్ నుంచి ధర్మసాగర్ వరకు మూడు వరుసల పైప్‌లైన్, మూడు మోటార్ల ద్వారా 49.60 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు రూ. 2229.90 కోట్లతో పనులు చేపట్టామని పేర్కొన్నారు. దేవన్నపేట పంప్ హౌజ్‌లోని మోటారు-2 ప్రారంభించి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోస్తున్నట్టు తెలిపారు. రూ. 80.39 కోట్లతో కొత్తకొండ- గార్ల నర్సింగాపూర్ 7 కిమీ రహదారి , ఘనపూర్ - ఐనవోలు రోడ్డు, గర్నెపల్లి 13 కిమీ రోడ్డు, ఓగ్లాపూర్ - ధర్మారం 13 కిమీ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయన్నారు.

ప్రసంగంలో తడబాటు....

వరంగల్ క్రైం(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ అభివృద్ధి సందేశాన్ని చదువుతూ పలు మార్లు తడబాటుకు గురయ్యారు. సోమవారం హనుమకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పనులపై ముద్రించి సందేశాన్ని చదువుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకకు బదులు గణతంత్ర దినోత్సవ వేడుకలని చదవడంతో ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురైనారు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం



ఎం.రవిచంద్రరెడ్డి వి.నాగసిద్ధార్థ పి. సాక్షి ఎ. అనుశ్రీ



బి. సాయి వి. భరణిశంకర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఎస్సార్ విద్యార్థులు మరోసారి ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఎం. రవి చంద్రరెడ్డి జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించగా, వి. నాగసిద్ధార్థ 13వ ర్యాంకు, పి.సాక్షి 40వ ర్యాంకు, ఎ.అనుశ్రీ 47వ ర్యాంకు సాధించి ఎస్సార్ విద్యాసంస్థల కీర్తిని పతాకస్థాయికి చేర్చా రన్నారు. వీరితో పాటు ఓపెన్ కేటగిరిలో బి. సాయి 68వ ర్యాంకు సాధించగా, వి.భరణిశంకర్ 90, జి. రాజేష్ 106, బి.వినోద్ 115, ఎం.వెంకటకౌశిక్ 123, ఎస్.పవన్ 204, ఎ. సంతోష్ 265, బి. వాగ్దేవి 269 ర్యాంకులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. గత యాభై సంవత్సరాలుగా పటిష్టమైన ప్రణాళికతో ఎస్సార్ విద్యా సంస్థల్లో విద్యాబోధన కొనసాగిస్తున్నామన్నారు. ఆధునిక సాంకే తికత పరిజ్ఞానం ప్రణాళికబద్ధమైన బోధన పద్ధతులతో విద్యార్థుల భవిష్య త్తును తీర్చిదిద్దుతున్నామన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఎస్సార్ కరిక్యులమ్ ఉంటుందన్నారు. అందుకు కృషి చేస్తున్న అధ్యాపకులకు, సహకరిస్తున్న తల్లిదండ్రులకు వర దారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సార్ విద్యా సంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డితో కలిసి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విజయఢంకా



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన జె. జెస్వాంత్ 402, మణిచంద్రసాయి 418, బి. భాను ప్రసాద్ 598, కె. బన్నీ 732, బి. సంహిత 765, డి. రాజేశ్వరి 798, టి. దినేష్ 994, జి. వినీత 1109, జె. శివ చేతన్ 1154, డి. మహేశ్వర్ 1249, ఏ. సంయుక్త 1263, బి. రాహుల్ 1305, బి. చక్రవర్తి 1325, బి. పూజిత 1333, పి. మేఘన 1382, ఎన్. శివ శంకర వరప్రసాద్ 1384, బి. కృష్ణ ప్రసాద్ 1458, ఈ సుహాస్ 2261 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం. రాంచద్రయ్య, అకాడమిక్ ఇంచార్జ్ వంశీకృష్ణ, ఏవో నిరంజన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివాని విద్యార్థుల ప్రభంజనం



అభినయ్ జి. రమేశ్ జె. సురేందర్ జి. తరుణ్

రాంనగర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఐఐటీ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో హనుమకొండ అశోక కాలనీలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి తెలిపారు. సాధారణ విద్యార్థులను జాతీయ స్థాయిలో ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం శివానికే సాధ్యమన్నారు. ర్యాంకుల సాధించిన వారిలో బి. అభినయ్ 98వ ర్యాంకు, జి. రమేశ్ 536, జి. సురేందర్ 548, జి. తరుణ్ 632, బి. సందీప్ 1756, జె. యాకేశ్ 1944, బి. గణేశ్ 2361 వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాం డెంట్ స్వామితో పాటు ప్రిన్సిపాల్స్ సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్. రమేశ్, ఎ. మురళీధర్, వి. సురేశ్, ఎస్. సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

ఏఎల్‌పీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- 1,498 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు రైల్వే జీఎం వెల్లడి
- ఫలించిన ఎంపీ కడియం కావ్య కృషి

కాజీపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట నుంచి క్రూలింక్‌ల తరలింపు, ఇక్కడకి పంపించాల్సిన లోకో పైలట్లను విజయవాడకు తరలించడా న్ని ఎంపీ కడియం కావ్య వ్యతిరేకించారు. దీంతో తిరిగి కాజీపేట జంక్షన్‌కు 1,498 అసిస్టెంట్ లోకో పైలెట్ల పోస్టులు మంజూరు చేస్తున్నట్లు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ ఎంపీ కావ్యకు లేఖ ద్వార తెలిపారు. రైల్వే అడ్మినిస్ట్రేషన్‌కు అనుకూలంగా క్రూలింకులు, లోకోపైలెట్ల పోస్టులను తరలించినట్లు వివరించారు. కానీ కాజీపేటకు మళ్లీ కొత్త లింకులు మంజూరు చేయడమే కాకుండా 1,498 అసిస్టెంట్ లోకో పైలెట్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఇవే కాకుండా 272 మంది అసిస్టెంట్ లోకో పైలెట్ల పోస్టులకు ఇప్పటికే ఎంపికైనవారు జూలై నాటికి శిక్షణ పూర్తి చేయనున్న ట్లు వివరించారు. ఇంకా 56 మంది కొత్తవాళ్లకు శిక్షణ ఇవ్వడానికి సి ద్ధం గా ఉన్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పూర్తయిన అనంతరం కాజీపేట క్రూ డిపోలో ఖాళీలను పూర్తి స్థాయిలో భర్తీ చేస్తామని ఎంపీకి రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఎంపీ కావ్యకు రైల్వే కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

హనుమకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) భూ భారతి చట్టం అమలుకు వీలుగా, ప్రజల భూసమస్యల పరిష్కారానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం (జూన్ 3 నుంచి) గ్రామ స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సదస్సుల నిర్వహణకు రెవెన్యూ సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ సదస్సులు కొనసాగనున్నాయి. రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్‌తో కూడిన బృందం వెళుతుంది. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటిని వీలయినంత మేరకు అక్కడికక్కడే పరిష్కరిస్తుంది. మొదటి, రెండవ విడతలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఇప్పటి వరకు 60 శాతం భూ సమస్యలను పరిష్కరించారు. భూభారతి చట్టంలో భాగంగా గ్రామ పరిపాలన అధికారులను త్వరలో నియమించనున్నారు. వీరితో పాటు లైసెన్సుడ్ సర్వేయర్లు కూడా అందుబాటులోకి రాబోతున్నారు. లైసెన్సుడు సర్వేయర్లకు ప్రస్తుతం ఆరు జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. 50 రోజుల శిక్షణ పూర్తయిన తర్వాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి లైసెన్సులు ఇచ్చి సర్వేయర్లుగా వారి సేవలను వినియోగించుకుంటారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి భూముల రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లతో పాటు సర్వే మ్యాపు జతపరచాలని భూభారతి చట్టంలో పేర్కొన్న సంగతి తెలిసిందే. తరతరాలుగా నక్షాలేని గ్రామాల్లో పునఃసర్వే నిర్వహించడం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేయనున్నారు.

గంగారంలో కారు బీభత్సం

చెట్ల కింద సేద తీరుతున్న వారిపైకి దూసుకెళ్లిన వైనం

ఇద్దరు వృద్ధుల మృతి..

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన మారపాక మధునమ్మ, బాలయ్య బాలయ్య(ఫైల్) మధునమ్మ (ఫైల్)

కాటారం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం మండలంలోని గంగారంలో సోమవారం కారు బీభత్సం సృష్టించింది. మండే ఎండకు రోడ్డు పక్కన ఇంటి ముందు చెట్లకింద సేద తీరడానికి కూర్చున్న వారిపైకి వాహనం దూసుకెళ్లిన దుర్ఘటనలో ఇద్దరు వృద్ధులు మృతి చెందగా మరో వృద్ధుడు, చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు, బాధితుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మొగిలి అనే డ్రైవర్ హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఉంటున్నాడు. ముగ్గురు యువకులతో కలిసి మొగిలి కారులో కాళేశ్వరం వెళ్లి దైవదర్శనం అనంతరం తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో డ్రైవర్‌తో పాటు మిగతా వారు మద్యం తాగిన మత్తులో కారును వేగంగా నడిపిస్తూ హల్‌చల్‌గా గంగారం ఎస్సీ కాలనీలో తమ ఇళ్ల ముందు చెట్ల కింద సేదతీరుతున్న ఎనిమిదిమంది గల గుంపు పైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన మారపాక మధునమ్మ(80) అక్కడికక్కడే మృతిచెందగా నీలాల బాలయ్య (65) మార్గ మధ్యలో ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. నీలాల మల్లయ్య(70)కు తీవ్రగాయాలు కాగా మరో మూడేళ్ల చిన్నారి డానియేల్ చేయి విరిగింది. ప్రమాద సంఘటనా స్థలాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులను భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

కారు బీభత్సం సృష్టించిన సంఘటనా స్థలాన్ని పలువురు చూసి క్షతగాత్రుల రోదనలతో కంటతడిపెట్టారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరావు తెలిపా రు. డ్రైవర్‌తో పాటు మిగతా యువకులు పారిపోయి అనంతరం పోలీసుల ముందు లొంగిపోయినట్లు సమాచారం.

కేయూ మహిళ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జ్యోతి

వర్సిటీ పీజీ కళాశాలకు నరసింహచారి

ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్

కేయూ క్యాంపస్ జూన్ 2, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతిని, సుబేదారిలోని వర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపా ల్‌గా ఎస్.నరసింహచారి, క్యాంపస్‌లోని ఫిజి కల్ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపా ల్ గా కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ ఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌ను నియ మిస్తూ సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వ ల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళ పీజీ కళాశాలకు ఇప్పటి వరకు ప్రిన్సి పాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ జి.మ ధుశ్రీ పదవీ కాలం పూర్తి అయింది. అలాగే పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వర లక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్‌ల నుంచి కొత్త ప్రిన్సిపాళ్ళు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. నరసింహచారిని ఏడాది కాలానికి ప్రిన్సి పాల్‌గా నియమించగా ప్రొఫెసర్ జ్యోతి, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌లను తిరిగి ఉత్తర్వులు వచ్చే వరకు పదవీలో కొనసా గాలని ఉత్తర్వులు వెలువరించారు. నరసిం హచారి గతంలో అడ్మిషన్ల సెల్ డైరెక్టర్‌గా, కే యూ పరీక్షల నియంత్రణాధికారిగా, ఐసెట్ కన్వీనర్‌గా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా పనిచే శారు.



మహిళ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిని అభినందిస్తున్న అధ్యాపకులు

అసిస్టెంట్ రిజిస్ట్రార్ల బదిలీ..

కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన కేయూ టీచింగ్, నాన్ టీచింగ్ విభాగానికి క్యాంపస్ ప్రిన్సి పాల్ కార్యాలయంలో ఏఆర్‌గా పనిచేస్తున్న పంజాల శ్రీధర్‌ను బదిలీ చేశారు. అలాగే అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేసిన సీహెచ్. ప్రణయ్‌కుమార్‌ను కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ కార్యాలయానికి, పరీక్షల విభాగంలో పనిచేస్తున్న ఆర్.శ్రీలతదేవిని అకౌంట్స్ బ్రాంచ్‌కి, అకౌంట్స్‌లో పనిచేస్తున్న కె.శ్రీలతను అకౌంట్స్ బ్రాంచీ నుంచి సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు బదిలీ చేశారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏఆర్‌గా పనిచేస్తున్న బి. నేతాజీని పరీక్షల విభాగానికి బదిలీ చేశారు.

ఇన్నోవేషన్ హబ్ కోఆర్డినేటర్‌గా కిరణ్‌కుమార్..

అలాగే కె-హబ్ ఇంటర్‌పె న్యూర్‌షిప్ ఎంప్లాయిబులిటీ అండ్ ఇన్నోవే షన్ హబ్ కోఆర్డినేటర్‌గా కిరణ్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తోపులాట

డోర్నకల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డోర్నకల్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు పోటాపోటీగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాయి. గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ డోర్నకల్ రైల్వే సెంటర్‌లో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణకు భారీ ర్యాలీతో వస్తుండగా, గాంధీ సెంటర్‌లో అప్పటికే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా డీజే సౌండ్ పెంచి జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఉద్రిక్తత ఏర్పడి ఒకరినొకరు నెట్టుకున్నారు. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి ఇరు పార్టీల కార్యకర్తలను నివారించారు. అనంతరం రైల్వే సెంటర్‌లో రెడ్యానాయక్ జెండా ఎగురవేశారు. రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటానని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన తర్వాత అందరి సంగతి తేలుస్తానని హెచ్చరించారు.

కొవిడ్ కేర్

తిరగబెట్టిన కొవిడ్ కథ

కొవిడ్ కథ ముగిసిందని సంబరపడేలోపే కొత్త వేరియెంట్స్ పుట్టుకొచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో కొవిడ్ కేసులు ఊపందుకుంటున్న నేపథ్యంలో, తాజా కొవిడ్ వేరియెంట్లు, వాటి ప్రభావాల గురించి తెలుసుకుందాం!

వ్యాక్సిన్లు, బూస్టర్లతో కొవిడ్ రక్షణ పొందినప్పటికీ, ఆరోగ్య భద్రతా చర్యలు పటిష్టంగా పాటిస్తున్నప్పటికీ, కొత్త కొవిడ్ లక్షణాల మీద ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇప్పటివరకూ మన దేశంలో రెండు రకాల కొత్త వేరియెంట్లు వెలుగులోకొచ్చాయి. అవేంటంటే...



- **ఎన్‌బి.1.8.1:** ఢిల్లీ, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో విస్తృతంగా కనిపిస్తున్న వేరియెంట్ ఇది. ఒమైక్రాన్‌తో సన్నిహిత సంబంధం కలిగిన ఈ వేరియెంట్, స్పైక్ ప్రొటీన్‌పరంగా స్వల్ప ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. తేలికపాటి లక్షణాలతో బయల్పడుతున్న ఈ వైరస్, వ్యాక్సిన్ తీసుకోని పెద్దల్లో వేగంగా విస్తరిస్తోంది
- **ఎల్ఎఫ్.7:** ఈ వైరస్ దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో బయల్పడింది. 2022కు ముందు కొవిడ్-19 బారిన పడిన పెద్దల వ్యాధినిరోధకశక్తికి, ఈ వైరస్ ఎక్కువ నిరోధకతను కలిగి ఉండవచ్చని అధ్యయనాలు చెప్తున్నాయి.

అయితే ప్రస్తుతానికి ఈ రెండు వేరియెంట్లలో ఏ ఒక్కదాన్నీ ఆందోళనకరమైన వేరియెంటుగా వర్గీకరించడం జరగలేదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. కాబట్టి వ్యాక్సిన్లు తీసుకున్న వారిని ఈ వేరియెంట్లు తీవ్ర అస్వస్థతకు గురి చేయలేవు. అయితే గొంతు నొప్పి, పొడి దగ్గు, నీరసం ఈ కొత్త వేరియెంట్ల ప్రధాన లక్షణాలు అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. రుచి, వాసన కోల్పోవడం, లాంటి కొవిడ్ సంప్రదాయ లక్షణాలేవీ లేకుండానే ప్రస్తుతం పాజిటివ్ ఫలితాలు వెలువడుతున్నాయి. వీటికి బదులుగా అలర్జీ, సాధారణ జలుబును తలపించే లక్షణాల రూపంలోనే తాజా కొవిడ్ వేరియెంట్లు బయల్పడుతున్నాయి.

వీటి మీద కన్నేసి...

- జ్వరం, లేదా చలి
- ముక్కు దిబ్బెడ, ముక్కు నుంచి నీరు కారడం
- గొంతు నొప్పి
- పొడి దగ్గు
- తలనొప్పి, నీరసం
- జీర్ణసంబంధ సమస్యలు (డయేరియా)
- ఒంటి నొప్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే?

- ఇంటి పట్టునే శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ మోతాదులను పరీక్షించుకోవాలి
- బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఇంటికే పరిమితమైపోవాలి
- ఆర్‌టి-పిసిఆర్ లేదా యాంటిజెన్ పరీక్షలు చేయించుకోవాలి
- 3 నుంచి 4 రోజుల్లో లక్షణాలు అదుపులోకి రాకపోతే వైద్యులను కలవాలి

ఆయుర్వేదం



వానాకాలం జలుబు, దగ్గు, జ్వరాలు సహజమే! అయితే వీటన్నిటి మూల కారణం జీర్ణ వ్యవస్థలో ఉంటుందని ఆయుర్వేదం చెప్తోంది. ఈ కాలంలో కుంటుపడే జీర్ణవ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థలను ఎలా దార్లోకి తెచ్చుకోవాలో తెలుసుకుందాం!

వానాకాలం వేతలకు చెక్

వానాకాలంలో శరీరంలో వాతం, పిత్తం పెరుగుతాయి. ఆదాన కాలమైన వేసవిలో కుంటుపడే జీర్ణశక్తి, వానాకాలంలో మరికాస్త దిగజారుతుంది. దాంతో అరుగుదల మందగిస్తుంది. ఫలితంగా పేగుల్లోని మంచి బ్యాక్టీరియా క్షీణించి, రోగనిరోధకశక్తి కూడా సన్నగిల్లుతుంది. దీనికి తోడు వానాకాలంలో వ్యాధికారక సూక్ష్మక్రిములు విజృంభించడం, కలుషిత ఆహారం, నీటి వల్ల సులభంగా వ్యాధుల బారిన పడుతూ ఉంటాం.



అయితే దగ్గు, జలుబులు, జ్వరాలు చలికాలంలో కూడా వేధిస్తాయి. కానీ వాటికి ప్రధానంగా గాల్లో విస్తరించి ఉండే వ్యాధికారక సూక్ష్మక్రిములు పొడిబారిన శ్వాసకోశ వ్యవస్థలోకి సులువుగా చొరబడి ఇబ్బంది పెట్టడమే కారణం. కానీ వానాకాలపు జలుబు, దగ్గు, జ్వరాలకు మాత్రం సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తే ప్రధాన కారణమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కాలంలో తలెత్తే అసౌకర్యాలకు కారణాన్ని బట్టి చికిత్సను అందించాల్సి ఉంటుంది.

త్రికటుతో తరిమికొట్టి...

త్రికటువులైన శొంఠి, మిరియాలు, పిప్పళ్లు ఈ కాలంలో తీసుకుంటూ ఉండాలి. ఈ పొడిని పండ్ల మీద చల్లుకుని తినొచ్చు. లేదా నేరుగా తినొచ్చు. గోరువెచ్చని నీళ్లలో కలుపుకుని తాగొచ్చు. దీంతో జీర్ణశక్తి పెరగడంతో పాటు శ్వాసకోశ వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా రక్షణ కూడా దొరుకుతుంది. కాబట్టి రోజుకు పావు టీస్పూను చొప్పున త్రికటు తీసుకోవచ్చు. ఇదే కాకుండా తాలిసాది చూర్ణం, సీతోఫలాది చూర్ణాలు కూడా వానాకాలపు అనారోగ్యాల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. జలుబు వచ్చినా, రాబోతున్నట్టు అనిపించినా త్రికటు, లేదా సీతాఫలాది లేదా తాలిసాది చూర్ణాల్లో ఏదో ఒకదాన్ని తీసుకోవచ్చు. పెద్దలు ఉదయం, సాయంత్రం ఒక చెంచా చూర్ణాన్ని తేనెతో లేదా గోరువెచ్చని నీటితో కలిపి తీసుకోవాలి. తేనె స్వచ్ఛంగా ఉండాలి.

జలుబు, దగ్గు, జ్వరం

జ్వరాన్ని తగ్గించడం కోసం 'షడంగ పానీయం' తీసుకోవచ్చు. అర చెంచా పొడిని రెండు గ్లాసుల నీళ్లలో కలిపి, ముప్పావు వంతుకు మరిగించి, వడగట్టి రెండు పూటలా తీసుకోవాలి. జలుబుకు 'వ్యోషాది వటి' ఉపయోగపడుతుంది. ఉదయం, రాత్రి రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. రెండేళ్ల లోపు పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరాలను తగ్గించడం కోసం 'కస్తూరి' మాత్రలు అందించాలి. ఒకటి లేదా రెండు మాత్రలను దంచి తల్లిపాలలో లేదా మరిగించి చల్లార్చిన నీళ్లలో రంగరించి పిల్లలకు పట్టించవచ్చు. 'వాయు గుళిక' జలుబుకు సమర్థమైన ఔషధం. ఈ గుళికను మూడు పూటలా తీసుకోవాలి. నవజ్వరానికి (ప్రారంభంలో ఉన్న జ్వరం) శొంఠి, అల్లపు రసం, మిరియాలు, తేనె కలిపి చెంచా చొప్పున మూడు పూటలూ ఇవ్వాలి. పొట్టలో సమస్యలకు, నీళ్ల విరోచనాలకు 'కుటజ ఘనవటి' మూడు పూటలా రెండు మాత్రల చొప్పున తీసుకోవాలి. పిల్లలకు అర మాత్ర సరిపోతుంది. ద్రవరూపంలోని కుటజారిష్ట అయితే, పెద్దలు, 15 మిల్లీ లీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. నులిపురుగుల సమస్యలు కూడా ఈ కాలంలో ఎక్కువే! దీని కోసం ద్రవరూపంలోని 'విడంగారిష్ఠ'ను 15 మిల్లీలీటర్ల చొప్పున మూడు పూటలా తీసుకోవాలి. పిల్లలకు 10 మిల్లీలీటర్లు సరిపోతుంది.

తినవలసినవి - తినకూడనివి

ఈ కాలంలోని ఆరోగ్య సమస్యలకు సన్నగిల్లిన వ్యాధినిరోధకశక్తి ప్రధాన కారణం కాబట్టి అందుకు కారణమైన జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడం మీదే ధ్యాస పెట్టాలి. అందుకోసం జీర్ణ సంబంధ సమస్యలను నియంత్రించుకోవాలి. కొన్ని పదార్థాలను తినడం మానుకోవాలి. కొన్నిటిని తప్పనిసరిగా తింటూ ఉండాలి.

- **తినకూడనివి:** పచ్చి కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగి తినాలి. మొక్కజొన్నను ఉడికించకుండా, కాల్చి తినాలి. సజ్జలు, మార్కెట్లో దొరికే పాలకూర తినకూడదు. ఇంట్లో పండించిన పాలకూర తినొచ్చు. అలాగే కాకరకాయ, క్యాబేజీ, బంగాళాదుంపలు, క్యారెట్ తినకూడదు. కఫాన్ని పెంచే చేపలు తగ్గించాలి. ఆవు పాలు తీసుకోవచ్చు. గేదె పాలు మానేయాలి. కఫాన్ని పెంచే తీపి పదార్థాలు, వెన్న, జున్ను తీసుకోకూడదు. అలాగే చల్లదనాన్ని అందించే కీర, పుచ్చ ఈ కాలంలో పనికి రాదు. మజ్జిగను నేరుగా తీసుకోకుండా మజ్జిగపులుసు రూపంలో తీసుకోవచ్చు.
- **తినదగినవి :** బెండ, పెసరపప్పు, మినపప్పు, ఉల్లి, వెల్లుల్లి తీసుకోవచ్చు. ఉల్లి, వెల్లుల్లిలో నీటిలో కరిగే పీచు ఉంటుంది. ఇది పేగులకు మంచిది కాబట్టి వీటిని ఈ కాలంలో తప్పనిసరిగా తీసుకోవాలి. దుంపల్లో కంద తినొచ్చు. ద్రాక్ష పండ్ల మీద తెల్లని పొర ఉంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్టు పురుగుమందులతో ఏర్పడిన పొర కాదు. అది ఆరోగ్యానికి మేలుకరమైన బ్యాక్టీరియా పొర. కాబట్టి ద్రాక్షను కడిగినా, ఈ తెల్లని పొర తొలగిపోకుండా చూసుకోవాలి. మామిడి, నిమ్మ పండ్లు తీసుకోవచ్చు. ఈ కాలంలో కొత్తిమీర, పుదీనా కూడా తీసుకోవాలి.

డాక్టర్ డి.వి. ప్రశాంత్ కుమార్
పంచకర్మ స్పెషలిస్ట్, శక్తి ఆయుర్వేదిక్ క్లినిక్,
ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.



కంటి ఆరోగ్యం

డిజిటల్ స్క్రీన్స్ మన జీవితంలో భాగాలైపోయాయి. గంటల తరబడి కళ్లను తెరలకు అప్పగించకపోతే రోజు గడవని పరిస్థితి. అయితే ఈ జీవనశైలితో కళ్లకు కీడు కలుగుతోందా? వైద్యులేమంటున్నారు?





తెరలతో తంటా

కళ్లు పొడిబారడం, కళ్ల మంటలు, ఎరుపెక్కడం, నీరు కారడం, కనుబొమల నొప్పులు... ఇవన్నీ డిజిటల్ స్క్రీన్స్ వాడకంలో మనం చేసే పొరపాట్లకు సంకేతాలు. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టివిలు మన జీవితంలో భాగాలైపోయినప్పుడు, వాటిని వినియోగించుకుంటూనే కళ్లు దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు కూడా పాటిస్తూ ఉండాలి. ఏ స్క్రీన్ ఎంత దూరంలో ఉండాలి? వాటిని ఎంత సమయం పాటు చూడాలి? ఎంత వ్యవధికి బ్రేక్ తీసుకోవాలి? కళ్లు అలసటకు లోను కాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? అన్నది కూడా తెలుసుకోవాలి.

నీలి కిరణాలను వడగట్టి...

పుస్తకం చదివేటప్పుడు కళ్లకు ఎంత దూరంగా ఉంచుకుని చదువుతామో, మొబైల్ ఫోన్లను కూడా అంతే దూరంలో ఉంచి వాడుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో పిల్లలు సెల్‌ఫోన్లకు ఎక్కువగా అలవాటు పడిపోతున్న సందర్భాలు పెరుగుతున్నాయి. నిజానికి ఆరేళ్ల వరకూ పిల్లల కనుగుడ్లు అభివృద్ధి దశలోనే ఉంటాయి. కాబట్టి ఈలోగా అతిగా మొబైల్ ఫోన్లకు అలవాటు పడడం వల్ల పిల్లల్లో మెల్లకన్ను తలెత్తుతుంది. పెద్దలైనా అదే పనిగా రెండు గంటలకు మించి సెల్‌ఫోన్ వాడడం కళ్లకు హానికరం. ఆ రెండు గంటల్లో ప్రతి అరగంటకూ విరామం తీసుకోవాలి. పిల్లల విషయానికొస్తే, రోజు మొత్తంలో, బడిలో, ఇంట్లో కలిపి, రెండు గంటలకు మించి స్క్రీన్స్ చూడకూడదు. ఈ రెండు గంటల్లో ప్రతి 20 నిమిషాలకూ బ్రేక్ ఇవ్వాలి. పిల్లలకు సెల్‌ఫోన్స్ ఇచ్చేటప్పుడు, అలారం, స్క్రీన్ కంట్రోల్ టైమ్ సెట్ చేసి ఇవ్వడం మంచిది. వీటితో పిల్లల సెల్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేయవచ్చు. గేమ్స్ ఆడేటప్పుడు పిల్లలు మొబైల్‌ఫోన్‌ను కళ్లకు మరీ దగ్గరకు తీసుకొచ్చేస్తూ ఉంటారు. దీంతో కళ్లలో మైనస్ పవర్ పెరుగుతుంది. కాబట్టి ఈ విషయంలో పెద్దలు పిల్లలను కట్టడి చేయాలి. మరీ ముఖ్యంగా డిజిటల్ స్క్రీన్స్ నుంచి వెలువడే నీలి కిరణాల వల్ల కంటికి హాని కలుగుతుంది. కాబట్టి ఆ కిరణాలను అడ్డుకునే ఫిల్టర్లను ఫోన్లు, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్స్‌లో ఉపయోగించాలి. కళ్లజోడు అలవాటున్న వాళ్లు ఆ కిరణాలను అడ్డుకునే పూత కలిగిన జోళ్లను వాడుకోవాలి. అలాగే టివిలకు కనీసం 20 అడుగుల దూరం పాటించాలి. సాధారణ వెలుగులోనే టివి చూడాలి తప్ప, కిటికీలు, తలుపులు మూసేసి, లైట్లు ఆర్పేసి చీకట్లో టివి చూడడం సరి కాదు.

ఇలాంటప్పుడు అప్రమత్తం కావాలి

- స్క్రీన్ చూస్తున్న అరగంటకే కళ్లు మసకబారుతున్నా...
- ఒకటికి రెండు చిత్రాలు కనిపిస్తున్నా...
- కళ్లు ఎర్రబడి, నీళ్లు కారుతున్నా...
- పిల్లల్లో మెల్లకన్ను మొదలైనా...
- పిల్లలు తెరను చూడడం మొదలుపెట్టిన అరగంటకే తలనొప్పి మొదలైనా...
- పిల్లలు రాయడానికి ఇబ్బంది పడుతున్నా...
- పెద్దలు ఫాంట్ సైజు పెంచవలసిన అవసరం పడుతున్నా...

20-20-20 నియమం


ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడవలసిన నియమమిది. దగ్గర్లో ఉన్న తెరలను చూస్తున్నప్పుడు కళ్లలోని కండరాలు అలసటకు లోనవుతాయి కాబట్టి ప్రతి 20 నిమిషాలకూ 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడగలిగితే, కంటి కండరాలు రిలాక్స్ అవుతాయి.

ఏం చేయాలి?

కళ్లు అలసటకు లోనై పొడిబారినా, మండుతున్నా, నీరు కారుతున్నా మానిటర్ల వాడకం ఆపేసి, 20-20-20 నియమం అనుసరించాలి. దీంతో ఫలితం లేనప్పుడు కంటి వైద్యులను కలిసి, వాళ్లు సూచించే కంటి చుక్కల మందులు వాడుకోవాలి. వీటితో పొడిబారిన కళ్లు తేమగా మారతాయి. ఈ చుక్కల మందును ఫ్రిజ్ డోర్‌లో దాచుకుని వాడుకోవాలి. అలాగే ఈ చుక్కల మందును ఒకసారి మూత తెరిచి, వాడడం మొదలుపెట్టిన తర్వాత నెల రోజుల వరకూ వాడుకుని, మిగతా మందును పారేయాలి. దాచుకుని వాడుకోకూడదు.

అయితే ఈ చుక్కల మందును ఎవరికి వారు కొనుక్కుని వాడుకోవడం సరి కాదు. కంటి సమస్యలకు కారణం స్క్రీన్స్ మాత్రమే అని నిర్ధారించలేం! ఇతరత్రా కంటి సమస్యల్లో కూడా ఈ లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మాత్రమే వీటిని వాడుకోవాలి.

డాక్టర్ ఎమ్. నిఖిల,
కన్సల్టెంట్ ఆప్తల్మాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్
జూబ్లీహిల్స్, హైదరాబాద్



పరిశోధన

బరువు తగ్గించే అమైనో ఆమ్లం

బరువు తగ్గడంలో అమైనో ఆమ్లం కీలక పాత్ర పోషిస్తుందని అమెరికా, కెనడా పరిశోధకులు కనుగొన్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

మాంసం, తృణధాన్యాల్లోని సిస్టీన్ అనే అమైనో ఆమ్లం, బరువు తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని ఎలుకలపై చేసిన ఓ తాజా అధ్యయనంలో తేలింది. దీని వలన అమైనో ఆమ్లాలతో ఔషధాల అభివృద్ధికి అవకాశం కలుగుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేశారు. 9 రకాల అమైనో ఆమ్లాలు లేని ఆహారం అందించి ఎలుకలను పరిశీలించినప్పుడు, పలు అణువులను అమైనో ఆమ్లంగా మార్చే ఎంజైమ్ లోపించిన ఎలుకలు, సిస్టీన్ రహిత ఆహారం తిని వారంలోనే 31 శాతం బరువు తగ్గినట్లు నేచర్‌లో ప్రచురితమైన ఆ అధ్యయనంలో వెల్లడించారు. అయితే ఎంజైమ్ ఉన్న ఎలుకలు సిస్టీన్ రహిత ఆహారం తీసుకున్నా బరువు తగ్గలేదు. అయితే ఆ ఎంజైమ్ ఉన్న ఎలుకలు పరిమిత క్యాలరీల సిస్టీన్, మిథియోనిన్ లేని ఆహారం తీసుకున్నప్పుడు, 25 శాతం బరువు తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు కనుగొన్నారు.



మనుషులకు మంచిదేనా?

ఫిలడెల్ఫియాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో చేసిన ఓ మానవ ప్రయోగంలో... సిస్టీన్, మెథియోనిన్ తక్కువగా ఉన్న ఆహారం తిన్న వారిలో ఎలాంటి ప్రతికూల ప్రభావాలు కనుగొనలేదని, అలాగే వారు బరువు తగ్గినట్లు గుర్తించామని పరిశోధకులు వెల్లడించారు. అయితే ఈ విధమైన ఆహారం ప్రజలపై ఎంత ప్రభావవంతంగా పనిచేస్తుంది, ఏ మేరకు సురక్షితమన్నది తెలుకోవడం కోసం మరిన్ని పరిశోధనలకు అవసరమని వారు పేర్కొన్నారు. సిస్టీన్ చాలా ఆహార పదార్థాల్లో ఉంటుంది కాబట్టి ఆహారం ద్వారా సిస్టీన్ అందకుండా చేయడం సవాలుతో కూడుకున్న విషయమని అభిప్రాయపడ్డారు. కాబట్టి సిస్టీన్ స్థాయులను అవసరమైన మేర తగ్గించడానికి ఔషధాలను అభివృద్ధి చేయడం సరైన మార్గమనీ, ఆ ఔషధాలు కొవ్వు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మీకు తెలుసా?

కృత్రిమ రక్తం



రక్తదానం ప్రాణదానంతో సమానం. కానీ అనేక సందర్భాల్లో సమయానికి సరిపడా రక్తం దొరకక, సరిపోలే రక్తగ్రూపు అందుబాటులో లేక సర్జరీలు వాయిదా పడుతూ ఉండడం, ప్రాణనష్టం సంభవించడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి ఇబ్బందులకు చెల్లుచీటీ రాస్తూ, నేషనల్ డిఫెన్స్ మెడికల్ కాలేజీకి చెందిన జపాన్ పరిశోధకులు కృత్రిమ రక్తాన్ని రూపొందించారు.

ఈ కృత్రిమ రక్తాన్ని రక్తపు గ్రూపు మ్యాచింగ్‌తో సంబంధం లేకుండా, ఎవరైనా మార్పిడి చేసుకోవచ్చు. ఈ సింథటిక్ రక్తంలో ఎర్ర రక్త కణాలతో పాటు, ప్లేట్‌లెట్లు కూడా ఉంటాయి. ఇప్పటివరకూ చేపట్టిన జంతు ప్రయోగాల్లో ఈ రక్తంతో విజయవంతంగా రక్త నష్టాన్ని భర్తీ చేయగలిగారు. దానం చేసిన రక్తానికి భిన్నంగా ఈ కృత్రిమ రక్తాన్ని ఎక్కువ కాలం కూడా నిల్వ చేసుకోవచ్చు. దీన్ని గది ఉష్ణోగ్రత వద్ద ఏకంగా ఏడాది పాటు నిల్వ చేసుకుని, అత్యవసర సమయాల్లో, మారుమూల ప్రాంతాలకు తరలించడానికి ఉపయోగించుకోవచ్చు.

ఆవిష్కరణ

గర్భం వెలుపల పిండం



శరీరం వెలుపల పిండాన్ని పెంచే వీలుండే కృత్రిమ గర్భాశయాన్ని జపాన్ అభివృద్ధి చేసింది. జపాన్, ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు నెలలు నిండకుండా పుట్టిన, జబ్బుపడిన పిండాలకు చికిత్సలందించి, ప్రాణాలను కాపాడడం కోసం, ఎక్స్ వివో యుటెరిన్ ఎన్విరాన్‌మెంట్ థెరపీ ప్రధానంగా ఈ ఆవిష్కరణకు పూనుకుంది. ఈ కృత్రిమ గర్భాశయం, నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో తలెత్తే సమస్యలను అడ్డుకునే నియంత్రిత పర్యావరణాన్ని కలిగి ఉండడం విశేషం. అయితే మానవ శరీరం వెలుపల తొమ్మిది నెలల పిండాన్ని పెంచడం ఈ సాంకేతిక ఆవిష్కరణ ఉద్దేశం కాదనీ, కేవలం నెలలు నిండకుండా పుట్టిన పిల్లల ప్రాణాలను కాపాడడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

బిజినెస్

వరంగల్ ● మంగళవారం 3 జూన్ 2025

ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్

రూ.18.45 లక్షల కోట్ల మార్కెట్ విలువతో 23వ స్థానంలో అంబానీ కంపెనీ

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్-ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.

ఇనుప ఖనిజం ఉత్పత్తిలో 22 శాతం వృద్ధి లక్ష్యం: ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ ఈ ఏడాది ఇనుప ఖనిజం ఉత్పత్తిని 22% మేరకు పెంచి 5.5 కోట్ల టన్నులకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి 10 కోట్ల టన్నులకు ఉత్పత్తిని విస్తరించాలన్న బృహత్ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 4.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించింది. ఏప్రిల్, మే నెలల్లో 45% వృద్ధితో 84.3 లక్షల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసినట్టు తెలిపింది.

వైమానిక రంగంలో అద్భుత అవకాశాలు



విదేశీ సంస్థలు పెట్టుబడులతో రావాలి

విమానాల తయారీ కేంద్రంగా భారత్

ఐఏటీఏ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత వైమానిక రంగం పెట్టుబడులకు అద్భుత అవకాశాల గని అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. 2030 నాటికి భారత విమానాల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్ఓ) రంగం 400 కోట్ల డాలర్ల స్థాయికి చేరనుందన్నారు. భారత్‌ను విమానాల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌ను ఒక మార్కెట్‌గా కాకుండా.. వాల్యూ చెయిన్ లీడర్‌గా చూడాలని కోరారు. దేశీయ విమానయానపరంగా చూస్తే ప్రస్తుతం భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఎదిగిన విషయాన్ని ప్రధాని గుర్తు చేశారు. దేశంలోని మారుమూల ప్రాంతాలకు విమానయానాన్ని దగ్గర చేసేందుకు తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉడాన్ పథకం భారత విమానయాన చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమన్నారు.

మరో 50 ఎయిర్‌పోర్టులు

వచ్చే ఐదేళ్లలో దేశంలో కొత్తగా మరో 50 విమానాశ్రయాలు ఏర్పాటు చేయనున్నట్టు ఇదే సదస్సులో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య 164కు చేరిందన్నారు. ఉడాన్ పథకంతో దేశంలో విమానయానం ప్రజాస్వామ్యీకరించబడి 619 మార్గాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. విమానాల నిర్వహణ మరమ్మత్తులకూ భారత్‌ను కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు.

విమాన సంస్థల లాభాలు రూ.3 లక్షల కోట్లు

కొన్ని సమస్యలు, సవాళ్లు ఉన్నా ఈ సంవత్సరం అంతర్జాతీయ విమానయాన సంస్థలు 97,900 కోట్ల డాలర్ల (సుమారు రూ.83.59 లక్షల కోట్లు) ఆదాయంపై 3,600 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.07 లక్షల కోట్లు) లాభాలు ఆర్జించే అవకాశం ఉందని ఐఏటీఏ అంచనా. గత ఏడాదితో పోలిస్తే ఇది 360 కోట్ల డాలర్లు ఎక్కువని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ ప్రకటించారు. ప్రస్తుతం విమానయాన రంగం ప్రపంచ జీడీపీలో 3.9 శాతం వాటా కలిగి ఉందన్నారు. భారత విమానయాన రంగం జీడీపీకి 560 కోట్ల డాలర్లు (సుమారు రూ.47,818 కోట్లు) సమకూరుస్తూ నేరుగా 3,69,700 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోందన్నారు. ఖర్చులు, పన్నుల భారం పెరుగుతున్నా పదేళ్ల క్రితంతో పోలిస్తే విమానయాన సంస్థల వాస్తవ ఖర్చులు 40 శాతం వరకు తగ్గాయని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్ అన్నారు. పరోక్షంగా విమానయాన రంగంతో ముడిపడి ఉన్న పర్యాటక రంగాన్ని కూడా కలుపుకుంటే భారత విమానయాన రంగం 77 లక్షల మందికి ఉపాధి, జీడీపీకి 1.5 శాతం సమకూరుస్తోందన్నారు.

ప్లాంట్ పెట్టేందుకు రెడీ: ఎంబ్రాయర్

భారత్‌లో పూర్తి స్థాయి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయర్ విమానాల తయారీ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. కాకపోతే ఇందుకు భారత విమానయాన సంస్థల నుంచి కనీసం 200 విమానాల ఆర్డర్ అవసరమని కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ ఫ్రాన్సిస్కో గొమెస్ నెటో స్పష్టం చేశారు. ఐఏటీఏ సదస్సుకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. తమ విమానాలు అమ్మేందుకు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు నెటో వెల్లడించారు.

అదానీ గ్రూప్‌పై అమెరికా దర్యాప్తు!

గుట్టుగా ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి

తోసిపుచ్చిన అదానీ గ్రూప్

న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. గుజరాత్‌లోని తన ముంద్రా రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకునేందుకు సహకరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై అమెరికా దర్యాప్తు సంస్థలు దర్యాప్తు ప్రారంభించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక కథనం ప్రచురించింది. అయితే అదానీ గ్రూప్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నౌకలు ఏవీ కూడా ఎల్‌పీజీతో తమ రేవులకు రాలేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తమపై అమెరికా సంస్థలు దర్యాప్తు జరుపుతున్న విషయం కూడా తమకు తెలియదని తెలిపింది. కొన్నిసంస్థలు దురుద్దేశాలతో తమపై కావాలనే ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నాయని అదానీ గ్రూప్ తెలిపింది. 'మా రేవుల ద్వారా ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి సరుకుల ఎగుమతి, దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ జెండాతో వచ్చే నౌకలు లేదా నేరుగా ఇరాన్ రేవుల నుంచి వచ్చే నౌకలు అన్నిటికి ఇది వర్తిస్తుంది' అని తెలిపింది.

ఈ విడత 0.50% వడ్డీకోత: ఎస్‌బీఐ

దేశంలో రుణ విభాగాన్ని ఉత్తేజితం చేయడంతో పాటు పలు రకాల అస్థిరతలను దీటుగా ఎదుర్కొనగల శక్తి కల్పించడం కోసం రిజర్వ్ బ్యాంక్ ఈసారి అర శాతం మేరకు రెపోరేటును తగ్గించవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. బుధవారం ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు ప్రారంభమవుతాయి. శుక్రవారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఎంపీసీ నిర్ణయాలను ప్రకటించనున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,640 ▲	89,500 ▲	1,11,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	99,820 ▲	89,500 ▲	1,11,000 ▲
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,00,300 ▲
ప్రొద్దుటూరు	96,250 ▲	88,550 ▲	98,600 ▲
ముంబై	96,680 ▲	88,559 ▲	97,761 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	109
వరంగల్	107	గుంటూరు	112
కరీంనగర్	107	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	97
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	101	అనంతపురం	102
గోదావరి	109		

విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే..

8,000 ఈవీలకు మాత్రమే అనుమతి

దేశీయ తయారీపై కనీస పెట్టుబడి రూ.4,150 కోట్లు ఉండాలి

కొత్త ఈవీ పాలసీ మార్గదర్శకాలు విడుదల

న్యూఢిల్లీ: దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిఫై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్టవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది.

ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

భారత్‌లో తయారీపై టెస్లా అనాసక్తి

ప్రపంచ ఆటోమొబైల్ కంపెనీలు మెర్సిడెస్ బెంజ్, స్కోడా-ఫోక్స్‌వేగన్, హ్యుండయ్, కియా దేశంలో విద్యుత్ కార్ల తయారీపై ఆసక్తిని ప్రకటించాయని ఈ పాలసీ మార్గదర్శకాల విడుదల సందర్భంగా కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. అయితే ప్రపంచ ఈవీ దిగ్గజం టెస్లా మాత్రం దేశీయ తయారీ పట్ల ఆసక్తిగా లేదని, దేశంలో తమ షోరూమ్‌లు ప్రారంభించేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

మార్కెట్లో మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు

» సెన్సెక్స్ 77 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లను మళ్లీ వాణిజ్య, యుద్ధ భయాలు అలుముకున్నాయి. స్టీల్, అల్యూమినియంపై సుంకాలను రెట్టింపు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఈ మధ్యనే కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ అమెరికా-చైనా పరస్పర ఆరోపణలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రతరం కావడం, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ వంటి అంశాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌కు గండికొట్టాయి. దాంతో సోమవారం సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 796.75 పాయింట్లు క్షీణించి 80,654 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 77.26 పాయింట్ల నష్టంతో 81,373.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ప్రారంభంలో 224.55 పాయింట్ల వరకు కోల్పోయినప్పటికీ, చివరికి 34.10 పాయింట్ల నష్టంతో 24,716.60 వద్ద స్థిరపడింది. గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి ప్రభుత్వ అంచనాలకు అనుగుణంగా 6.5 శాతంగా నమోదవడంతో పాటు జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండో నెలా రూ.2 లక్షల కోట్లు దాటడం, ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును అర శాతం వరకు తగ్గించవచ్చన్న అంచనాలు సూచీల రికవరీకి తోడ్పడ్డాయి.

మీనాక్షి ఆల్టర్నేట్స్ రియల్టీ ఫోకస్డ్ ఫండ్

700 కోట్ల కార్పస్‌తో ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన రియల్టీ, శుద్ధ ఇంధన వ్యాపారాల నిర్వహణలోని మీనాక్షి గ్రూప్ తాజాగా ఆర్థిక సేవల రంగంలోకి ప్రవేశించింది. మీనాక్షి ఆల్టర్నేట్స్ (ఎం-ఆల్ట్స్) పేరుతో ఆర్థిక సేవల అనుబంధ విభాగంతో పాటు దాని పరిధిలో తొలి ఫండ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మీనాక్షి గ్రూప్ వెల్లడించింది.

'మీనాక్షి రియల్ అసెట్స్ ఫండ్' పేరుతో రూ.700 కోట్ల కార్పస్‌తో ఈ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సెబీ అనుమతితో కూడిన కేటగిరీ-2 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) ఇది.

చిత్రజ్యోతి

SINCE 1965

విడుదలకు సిద్ధమైన ఘాటీ



అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఘాటీ'. తమిళ నటుడు విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా, ఈ సినిమాను జూలై 11న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలోని ప్రధాన పాత్రధారులు సంచులు మోసుకుంటూ నదిని దాటుతున్న విజువల్స్ ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: చాణక్యరెడ్డి తూరుపు, వెంకట్ ఎన్.స్వామి, సినిమాటోగ్రఫీ:మనోజ్‌రెడ్డి కాటసాని, సంగీతం:నాగవెల్లి విద్యాసాగర్. కాగా, 'వేదం' తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.

ధనుష్ నటనకు జాతీయ అవార్డు వస్తుంది





శేఖర్ కమ్ముల

నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుష్కర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా, చెన్నైలో ఆడియో వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన చిత్రం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది. నాగార్జున, ధనుష్‌ల నటన నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ధనుష్ ఆల్‌రౌండర్. ఈ చిత్రంలో ఆయన నటనకు జాతీయ అవార్డు వస్తుంది" అని అన్నారు. "సినిమా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. శేఖర్ కమ్ముల అద్భుతంగా సినిమాను తెరకెక్కించారు. రజనీకాంత్‌తో నేను నటించిన 'కూలీ' సినిమా మీ అందరి ఊహలకు మించి ఉండబోతోంది" అని నాగార్జున చెప్పారు. "శేఖర్ కమ్ముల స్వచ్ఛమైన మనసు ఉన్న వ్యక్తి. ఇందులో చేసిన పాత్ర నాకెంతో ప్రత్యేకం" అని ధనుష్ తెలిపారు.

ఎంత దుష్ప్రచారం చేస్తారో చేస్కోండి

తనపై వస్తున్న దుష్ప్రచారాలపై ధనుష్ ఈ సందర్భంగా స్పందించారు. "నేనెప్పుడూ నా బెస్ట్ ఇవ్వడానికే ప్రయత్నిస్తుంటాను. నాపై, నా సినిమాలపై ఎంతగా దుష్ప్రచారం చేస్తారో చేసుకోండి. నా సినిమాల విడుదలకు ముందు ప్రతిసారి ఏదో ఒక విషయంలో కుట్రలు పన్నుతూనే ఉంటారు. అయినా ఆ ప్రయత్నాలు నన్నేమీ చేయలేవు. నా అభిమానులు 23 ఏళ్లుగా నా వెన్నంటే ఉన్నారు. ఇలాంటి సర్కస్‌లు చేయడం మానుకోండి. ఎవరెంత దుష్ప్రచారం చేసినా అభిమానులు నాతోనే ఉంటారు" అని పేర్కొన్నారు.

ఫిల్మ్ చాంబర్‌లో 'వీరమల్లు' నిర్మాత



సినిమా టికెట్ ధరల పెంపు లేదా ఏ ఇతర విషయాలకు సంబంధించి అయినా సినీ పరిశ్రమకు చెందిన వారితో వ్యక్తిగత చర్చలకు తావులేదని ఇటీవలె ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పవన్ సూచన మేరకు 'హరి హర వీరమల్లు' చిత్ర నిర్మాత ఏ.ఎం.రత్నం తాజాగా ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్‌ను కలిశారు. తమ చిత్రానికి సంబంధించి అదనపు షోలకు అనుమతి, టికెట్ ధరల సవరణ కోరుతూ లేఖను అందజేశారు. 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 12న విడుదల కానుంది.

మనసును తాకేలా



సిద్ధు జొన్నలగడ్డ, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమా 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. దీపావళి సందర్భంగా అక్టోబర్ 17 సినిమాను ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఊహించని మలుపులతో నిండిన ఈ సినిమా ప్రేక్షకుల మనసును తాకేలా ఉంటుందని తెలిపారు.

థగ్‌లైఫ్‌ను అడ్డుకుంటాం



కన్నడ భాష గురించి నటుడు కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలతో థగ్‌లైఫ్ సినిమాను కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నెల 5న సినిమాను కర్నాటకలో విడుదల చేస్తే థియేటర్లకు నిప్పు పెడతామని కర్ణాటక రక్షణ వేదిక(కరవే) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ గౌడ హెచ్చరించారు. కన్నడ సంఘాల ఐక్యకూటమి అధ్యక్షుడు వాటాళ్ నాగరాజ్ మైసూరులో సోమవారం మీడియాతో మాట్లాడుతూ, కమల్‌హాసన్ సినిమాను బహిష్కరించాల్సిందేనని అన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్

థగ్‌లైఫ్ సినిమాకు వస్తున్న బెదిరింపులపై కమల్ హాసన్, కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. సినిమా ప్రదర్శనకు ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రత కల్పించేలా చూడాలని కోర్టుకు విన్నవించారు. ఇదిలా ఉంటే తమిళం నుంచి కన్నడ పుట్టిందని కమల్ హాసన్ వ్యాఖ్యానించినప్పుడు తాను చప్పట్లు కొట్టలేదని నటుడు శివరాజ్‌కుమార్ వివరణ ఇచ్చారు. అన్ని భాషలూ ముఖ్యమైనవేనని, తన మాతృభాష కన్నడకే ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని ఇంతకు ముందే చెప్పానని అన్నారు. కన్నడ కోసం తన ప్రాణమైనా ఇస్తానని అన్నారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వైభవంగా ఆవిర్భావ వేడుకలు

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- శకటాలు ప్రదర్శించిన ప్రభుత్వ శాఖలు

జాతీయ జెండాలు ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు



వరంగల్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



భూపాలపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆయా జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌సరెడ్డి, మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, ములుగు జిల్లాలో మంత్రి సీతక్క, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, జనగామ జిల్లాలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాలను ఎగురవేశారు. జాతీయ గీతాలాపన చేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను గణాంకాలతో వివరించారు. జిల్లా ప్రజలకు రాష్ట్రావతణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటాలు ఆలోచింపజేశాయి. వారు ప్రజలకు అందించే సేవలు, వారు తయారు చేసిన ఆహారపదార్థాలు, పచ్చళ్ళు, వస్తువులను స్టాళ్లలో ప్రదర్శించారు.



భూపాలపల్లి జిల్లాలో జయశంకర్ విగ్రహం వద్ద బతుకమ్మలతో సింగరేణి జీఎం, ఇతర అధికారులు



మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



వరంగల్‌లో పోలీసుల పరేడ్



వరంగల్‌లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు



హనుమకొండలో శకటాల ప్రదర్శన



హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినుల నృత్యాలు





జనగామలో కలెక్టరేట్‌లో అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ములుగు జిల్లాలో అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం చేస్తున్న మంత్రి సీతక్క



హనుమకొండలో సేవా పతకం అందుకున్న పోలీసులు



వరంగల్‌లో వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు

జనగామలో కలెక్టరేట్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు



మహబూబాబాద్ జిల్లా కోర్టులో పోలీసులచే గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీక్



తెలంగాణ ఇచ్చింది సోనియమ్మే..

- సుమారు రూ.8లక్షల కోట్లు అప్పుగా మిగిల్చిన కేసీఆర్
- పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు..
- ప్రస్తుతం కొత్తగా 18 లక్షల రేషన్ కార్డులు మంజూరు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మరిపెడ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): 1400 మంది ప్రాణ త్యాగం ఫలితమే ప్రత్యేక రాష్ట్రమని, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియమ్మే తెలంగాణ ఇచ్చిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మరిపెడ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాను పంపిణీ చేశారు. గడిచిన 18 నెలల్లో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు వివిధ అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతీ సంవత్సరం నియోజవర్గానికి 3,500 ఇందిరమ్మ గృహాలు మంజూరవుతాయన్నారు. మరో నాలుగు సంవత్సరాల్లో 14వేలఇళ్లు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తోందన్నారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో ఒక్క నిరుపేదకు ఇల్లు కట్టివ్వలేదని విమర్శించారు. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్ సుమారు రూ.8 లక్షల కొట్లు అప్పు చేస్తే వాటికి వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.8500కోట్లు చెల్లిస్తున్నామన్నారు. గత 10సంవత్సరాల పరిపాలన బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క నిరుపేదకు కూడా రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలేవన్నారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు 18లక్షలు మంజూరయ్యాయన్నారు. అంతేకాక రెండేళ్ల క్రితం యాసంగి సీజన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేయమని బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం అంటే రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంట దళారులు పాలైయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందని, ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రెండు, మూడు రోజుల్లో రైతు ఖాతాల్లోడబ్బు జమచేసిన ఘనతకాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి

బలిసినోడి గురించి కాంగ్రెస్ పార్టీ ఆలోచించట్లే..


ప్రభుత్వ విప్ రామచందర్‌నాయక్

బలిసినోడి గురించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించట్లే.. నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా, అవినీతి రహితంగానే పరిపాలన చేస్తున్నామని ప్రభుత్వ విప్ జాటోతు రామచందర్‌నాయక్ అన్నారు. గ్రామాలు, తండాల్లో ఉన్న నిరుపేదల గురించి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో మహిళలకు రూ.54 కోట్లు వడ్డీలేని రుణాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోందన్నారు. అనంతరం పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యం చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, డీఈవో రవీందర్‌రెడ్డి, తొర్రూర్ ఆర్డీవో గణేష్‌బాబు, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, జిల్లా యూత్ లీడర్ నూకల అభినవ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవినాయక్, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్ యార్డు చైర్మన్లు సుధాకర్‌నాయక్, సంజీవ్‌రెడ్డి, భట్టునాయక్, పెద్దబోయిన ఐలమల్లు, పానుగోతు రాంలాల్, విసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటాకు చప్పుళ్లకు బెదరం

- బీఆర్ఎస్‌కు భయపడేది లేదు..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- పాలకుర్తిలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

పాలకుర్తి, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ నాయకుల తాటాకు చప్పుళ్లకు ఇందిరమ్మ రా జ్యంలో భయపడేది లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం రాజీవ్‌చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉండి కూడా కనీసం తెలంగాణ తల్లిని అధికారికంగా గుర్తించలేదని బీఆర్ఎస్‌నువిమర్శించారు. సోనియా గాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తుచేశారు. మాయ మాటలు చెప్పి మోసం చేసిందన్నారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉండి కూడా తెలంగాణ తల్లిని, తెలంగాణ పాటను, టీజీ పదాన్ని కూడా ఉచ్చరించలేదని విమర్శించారు. తెచ్చుకున్న తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. గత నెలలో వరంగల్ సభలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభు త్వం అవాకులు, చవాకులు విసిరారని పేర్కొన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు చచ్చిన పాము అని, కానీ తోక ఆడిస్తుందని వారి ఆటలు మా ముందు సాగవని హెచ్చరించారు. నియోజకవర్గంలో ప్రజలను బీఆర్ఎస్ నాయకులు మోసం చేస్తున్నారని, వారి తటాకు చప్పుళ్ల కాంగ్రెస్ భయపడదన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ర్యాలీగా వస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే


స్థానికల ఎన్నికల్లో మాదే విజయం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందని మంత్రి పొంగులేటి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 4.50లక్షలు ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇస్తుండగా, నియోజకవర్గంలో 3500 ఇండ్లు ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్యమంత్రి, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నిధులు తెస్తున్నారని గుర్తు చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకురాలు అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, రాపాక సత్యనారాయణ, కుమారస్వామి, యాకాంతరావు, ఎర్రబెల్లి రాఘవరావు, గాదె పాక భాస్కర్, ఎడవెల్లి సోమల్లయ్య ఉన్నారు.

జాతీయ జెండాకు అవమానం

మూడుసార్లు జెండాను ఎగురవేసిన కమిషనర్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ రవీందర్‌గౌడ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ క్రమంలో జెండా పైకి వెళ్లిన తర్వాత విప్పుకోలేదు. దీంతో కమిషనర్ జెండాను కిందకు దించారు. సిబ్బంది జెండాను సెట్‌చేయగా తలకిందులుగా ఎగిరింది. అక్కడ ఉన్నవారు గమనించి తలకిందులుగా ఎగిరిందని తెలుపడంతో మరోసారి కిందకు దించాడు. సిబ్బంది జెండాను సరిచేసి ఇచ్చిన తరువాత మూడోసారి సరిగ్గా జాతీయ జెండాను ఎగురవేశారు. సిబ్బంది నిర్లక్ష్యంపై పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



తలక్రిందులుగా ఎగురవేసిన జాతీయ జెండా

అసమ్మతి గోల

1వ పేజీ తరువాయి

మరికొందరు ఎమ్మెల్యేలు, వారి వారసుల తీరుపై ఫిర్యాదులు చేసుకున్నట్లుగా సమాచారం. మరికొందరు టీపీసీసీలో చోటు కోసం రిక్వెస్టులు చేసుకున్నట్లు సమాచారం. అయితే అనుహ్యంగా ఎమ్మెల్సీ విజయశాంతి బీసీ కోటాలో తనకు మంత్రిగా అవకాశం కల్పించాలని మీనాక్షిని కలవటం కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది.

పార్టీ ఎలా ఉంది..

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మీనాక్షి దృష్టి సారించారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. మే 31న మహబూబాబాద్, జూన్ 1న వరంగల్ పార్లమెంట్ పరిధిలోని కీలక నేతలు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి వరకు వరంగల్ నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదుల పరంపర కొనసాగించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ సమీక్షకు ఎంపీతో పాటు ఒకరిద్దరు ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నట్లుగా తెలిసింది. తొలుత ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళుతున్నాయా.. ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏం చేయాలి.. పార్టీ పరిస్థితి ఏలా ఉంది..? పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఏలాంటి చర్యలు తీసుకోవాలి.. లోకల్ బాడి ఎన్నికలు నిర్వహిస్తే గెలుస్తామా అనే ప్రశ్నలను మీనాక్షి తనను కలిసిన ఎమ్మెల్యేలకు సంధించినట్లుగా సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే మెజార్టీ స్థానాల్లో గెలుస్తామని ఎమ్మెల్యేలు చెప్పినట్లుగా సమాచారం.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంకా పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందని కొందరు చెప్పగా, ఎన్నికల్లో ఇచ్చిన మరికొన్ని హమీలను కూడా వెంటనే అమలు అయ్యేలా చూడాలని సూచించారని తెలిసింది. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఇబ్బందికర పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా, సన్న వడ్ల బోనస్ వంటివి వెంటనే అందేలా చూడాలని కోరారు. వీటితో పాటు జిల్లా స్థాయిలో ఉన్న నామినెటెడ్ పోస్టులన్నీ కూడా భర్తీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పనితీరు బాగుందని, అయితే అధికారులు తమ మాట వినటం లేదని కొందరు ఎమ్మెల్యేలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా కొందరు స్పందించటం లేదని, ప్రభుత్వ పేద ప్రజల కోసం తీసుకవచ్చే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలపైన ఉందని మీనాక్షి స్పష్టం చేసినట్లుగా తెలిసింది.

పరస్పర ఫిర్యాదులు

ఓరుగల్లు ఎమ్మెల్యేలను కదిలిస్తే అసమ్మతి లావలా ఎగిసిపడుతోంది. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ తీరుపై ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో వివాదం అడియో బయటకు వచ్చినప్పటి నుంచి, సినీనటుడు అక్కినేని కుటుంబంపై చేసిన వాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా వివాదాస్పదంగా మారిన వైనాన్ని వివరించినట్లుగా తెలిసింది. అంతేకాకుండా గతేడాది దసరాకు గీసుకొండ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంలో మంత్రి ఏకంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ సీట్లో కూర్చున్న అంశం వివాదంగా మారిందని, వేములవాడ రాజన్న కోడెల విషయం, ఇటీవల మంత్రులు డబ్బులు తీసుకుని పనులు చేస్తారని చేసిన వాఖ్యలు వివాదాస్పదంగా మారిన అంశాన్ని మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు. నామినెటేడ్ పోస్టుల భర్తీలో తమ నియోజకవర్గాల్లో మంత్రి కలుగ చేసుకుంటున్నారని ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం.

సదరు ఫిర్యాదులను నోట్ చేసుకున్న మీనాక్షి నటరాజన్... మంత్రి సురేఖను పిలిపించుకుని వివరణ తీసుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బీఆర్ఎస్ మంత్రులు డబ్బులు తీసుకుని పనులు చేశారని తను చెప్పితే.. దానిని వక్రీకరించారని వివరణ ఇచ్చారు. మిగతా విషయాల్లో కూడా తనపై తప్పుడు ఆరోపణలేనని, ఏ నియోజకవర్గంలో తాము జోక్యం చేసుకోవటం లేదని క్లారిటీ ఇచ్చారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలు తెలుసుకోవాలని కోరినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఓ ఎమ్మెల్యే వారసుడు తనకున్న పదవిని అడ్డు పెట్టుకుని ఇతర నియోజకవర్గాల్లో తలదూర్చుతున్నారని ఓ ఎమ్మెల్యే, తన సెగ్మెంట్‌కు రావాల్సిన నిధులను మరో ఎమ్మెల్యే తీసుకెళ్లారని పరస్పరం ఫిర్యాదులు చేసినట్లుగా సమాచారం. ఎమ్మెల్యేల నుంచి వచ్చిన ఫిర్యాదులను నోట్ చేసుకొని ఒక్కొక్కరితో వ్యక్తిగతంగా మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా మాట్లాడినట్లుగా తెలిసింది.

వినతుల పరంపర

ఓరుగల్లుకు చెందిన పలువురు కార్పోరేషన్ చైర్మన్‌లు మీనాక్షి నటరాజన్‌ను కలి ఉమ్మడి జిల్లా రాజకీయ పరిణామాలపై వివరించారు. పనిలో పనిగా తమకు ప్రొటోకాల్ వర్తింప చేయటం లేదని ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. రాష్ట్రస్థాయి పదవిలో ఉన్నప్పటికీ కనీస గౌరవం దక్కటం లేదని, అన్ని జిల్లా కలెక్టర్లకు తమకు ప్రొటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇచ్చేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లుగా తెలిసింది. ఇక కొందరు నేతలు తమకు టీపీసీసీలో కీలక బాధ్యతలు అప్పగించాలని కోరినట్లుగా తెలిసింది. ఒకవైపు ఓరుగల్లు నేతలు, ప్రజాప్రతినిధులతో ఏఐసీసీ వ్యవహరాల ఇంచార్జి సమీక్షిస్తుండగా, సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి సైతం మీనాక్షినటరాజన్‌ను కలిసేందుకు రావటం చర్చనీయాంశంగా మారింది. తనది వరంగల్ ప్రాంతమని చెప్పుకునే విజయశాంతి తనకు బీసీ కోటలో మంత్రి పదవి ఇవ్వాలని రిక్వెస్టు చేసినట్లుగా జరుగుతున్న ప్రచారం ఓరుగల్లు పాలిట్రీక్స్‌లో హట్‌హట్‌గా మారింది.

రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రుద్రేశ్వరుడికి పాశుపత ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సుస్థిరంగా పరిపాలించాలని ప్రజలు ఆశయాలు నెరవేర్చే విధంగా రుద్రేశ్వరుడు ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేయాలని అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అనిల్‌కుమార్, ఆలయ సిబ్బంది మధుకర్, రజిత పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవోపై పాలకవర్గం ఆగ్రహం

హసన్‌పర్తి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి పీఏసీఎస్ సీఈవో సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై పాలకవర్గం అసహనం వ్యక్తం చేసింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా సోమవారం సీఈవో పాలకవర్గానికి సమాచారం ఇవ్వకుండా జాతీయ జెండాను ఆవిష్కరించడంపై మండిపడుతున్నారు. సీఈవోపై చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఈవోను ఫోన్‌లో వివరణ కోరగా పీఏసీఎస్ చెర్మన్‌కు సమాచారం అందించామని తెలిపారు.

రెపరెపలాడిన జాతీయ పతాకాలు

- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కేయూ క్యాంపస్ జూన్ 2, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కేయూ పరిపాలన భవనం ఎదుట తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్వాగత ఉపన్యాసం చేశారు.ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, పరిపాలన అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ టౌన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం ఆగమవుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఆవరణలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి, మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతచారి, జయశంకర్ సారు, అంబేడ్కర్ ఫొటోలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ జెండాను దాస్యం వినయ్‌బాస్కర్ ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ కార్యాలయాల్లో..

హనుమకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని ఆర్టీసీ రిజినల్ కార్యాలయం, సుబేదారి పోలీస్‌స్టేషన్, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ కార్పొరేషన్ : రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు బల్దియాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మజూదలతో పాటు పలు డివిజన్ల కార్పొరేటర్లు, బల్దియా సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ అమరులకు, జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 మాసాల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి చెందిందని, చెందుతుందని అన్నారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, కావటి కవిత, అరుణ, పద్మ, సురేష్‌జోషి, రవి, అరుణ, ఉమ, చందన పాల్గొన్నారు.

బల్దియాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పెద్ద ఎత్తున బల్దియాతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్‌తో పాటు వివిధ డివిజన్‌లలో పని చేసే సిబ్బంది హాజరయ్యారు. సుమారు 400 మంది టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, మలేరియా, హార్టికల్చర్, మెప్మాతో పాటు బల్దియా పరిపాలనా విభాగం సిబ్బంది హాజరయ్యారు. కానీ వేదిక ముందు 100 కుర్చీలు మాత్రమే వేయడంతో చాలా మంది మహిళలు గంటల తరబడి నిలుచున్నారు.

- వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిపాలన భవనం ఎదుట ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సీపీ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం జాతీయ జెండావిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, రవి, ప్రభాకర్‌రావు, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్‌లు పాల్గొన్నారు.
- రాంనగర్ : సుబేదారిలోని అమరుల స్థూపం వద్ద సోమవారం టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జెండావిష్కరణ చేసిన అనంతరం ఇంచార్జీ డైరెక్టర్ బి. అశోక్‌కుమార్ మాట్లాడారు.
- వరంగల్ ఎడ్యుకేషన్ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని అన్ని యాజమాన్య పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ కె. సత్యనారాయణరెడ్డి, ఇంటర్ ఆర్జేడీ కార్యాలయంలో ఏవో కృష్ణమోహన్‌రెడ్డి, వరంగల్ డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో జి.శ్రీధర్‌సుమన్, హనుమకొండ డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో ఎ. గోపాల్ జెండాలను ఎగురవేశారు. వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం. జ్ఞానేశ్వర్, హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఈవో డి. వాసంతి, ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

హనుమకొండ సిటీ : హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రజాభవన్‌లో ఆవిర్భావ వేడుకలు

హనుమకొండ బాలసముద్రంలోని ప్రజా భవన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేశారు.

డీసీసీ భవన్‌లో

హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

- మడికొండ, (ఆంధ్రజ్యోతి): కడిపికొండలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కట్కూరి రమేష్, మడికొండలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద కార్పొరేటర్ ఏ రాధికారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణగౌడ్, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, నాయకులు సట్ల సదానందం, మడికొండలో కే రాజేందర్, పేపర్ రవి, వస్కుల దేవేందర్, వెన్నమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. మడికొండ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పెండ్లి క్రిష్ణమూర్తి, కుర్ల మోహన్, వస్కుల శంకర్, బిల్ల రవిందర్, గుర్రం జ్యోతీ అమర్‌నాథ్, బైరి లింగమూర్తి, ఎడబోయిన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
- హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు.
- కాజీపేట : కాజీపేట తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ బావుసింగ్ జెండా ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి, రైల్వే స్టేషన్‌లో మేనేజర్ అగ్గి రవీందర్, 62, 63 డివిజన్లలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ జెండా ఆవిష్కరించారు. రైల్వే క్రూలాబీలో ఓబీసీ డివిజనల్ అధ్యక్షుడు రేండ్ల రమేశ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.
- వడ్డేపల్లి : 56వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు కొంక హరిబాబు, చింత రమేష్ గౌడ్, దూలం రాజుగౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత, డివిజన్ నాయకులు విజయ్‌నాయక్, లావుడ్య శ్రీను పాల్గొన్నారు. డివిజన్‌లోని గోపాల్‌పూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకల్లో టీపీసీసీ లీగల్‌సెల్ నేత కందుకూరి రజినీకాంత్, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సాబీర్, ప్రధానకార్యదర్శి ఏ ప్రకాష్, కోశాధికారి కృష్ణమూర్తి, ఇబ్రహీం, చిర్ర వెంకటస్వామి గౌడ్, లక్ష్మణ్, వలీపాషా పాల్గొన్నారు. జవహర్ కాలనీలో, బీజేపీ గోపాల్‌పూర్ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, బీజేపీ ఓబీసీ మోర్చ కార్యాలయ కార్యదర్శి ఎ. కృష్ణం రాజు పాల్గొన్నారు.



కడిపికొండలో వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు, దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు



హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మువ్వన్నెల జెండాను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, పక్కన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం



బల్దియాలో నాయకుల చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న మేయర్, కమిషనర్



కమిషనరేట్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సీపీ



కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

ఆకట్టుకున్న పోలీస్ పరేడ్, విద్యార్థుల నృత్యాలు

మంత్రి సురేఖకు పోలీసుల గౌరవ వందనం

వరంగల్ క్రైం/హనుమకొండ టౌన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన పోలీస్ పరేడ్, విద్యార్థుల నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేఖ పూలతో ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఓపెన్ టాపు జీపులో పరేడ్‌లోని ప్లాటూన్ టీంలను సందర్శించారు. అనంతరం పోలీస్ బ్యాండ్ మధ్య పరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్‌రాజ్ ఆధ్వర్యంలో 6 ప్లాటూన్స్ మార్చ్‌పాస్ట్ నిర్వహించి మంత్రి సురేఖకు గౌరవ వందనం చేశారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులపై మంత్రి ప్రసంగించిన అనంతరం స్వరాష్ట్రం కోసం అమరులైన కుటుంబాలను సత్కరించారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు..

బతుకమ్మ, జానపద పాటలతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అరిలరించాయి. ఈ సందర్భంగా హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో పాటు హసన్‌పర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు చేసిన నృత్యాలు అలరించాయి. బతుకమ్మ, మేడారం, కాకతీయ సంస్కృతిపై సాగిన పాటకు మడికొండకు చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు నృత్యం చేశారు. వివిధ శాఖలకు చెందినన ఉత్తమ ఉద్యోగులతో పాటు 2021లో ప్రకటించిన ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పతకాలను 18మంది పోలీసులకు అందజేశారు. కొంత మంది రైతులు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విత్తనాలు అందజేశారు.

ఆకట్టుకున్న వైద్యారోగ్యశాఖ శకటం

ఓవరాల్‌గా 10 శకటాలు ప్రదర్శనలో పాల్గొనగా వైద్యారోగ్యశాఖకు చెందిన శకటం అందరిని ఆకట్టుకొని మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో డీఆర్‌డీఏ, మూడో స్థానంలో వ్యవసాయ శాఖ శకటం నిలిచింది. కాగా, శకటాల్లో పౌర సరఫరాలు, ఫీషరీస్, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, రవాణాశాఖ, అగ్నిమాపక శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం, రాష్ట్ర గృహనిర్మాణశాఖకు చెందిన శకటాలు పాల్గొన్నాయి. వ్యవయశాఖకు చెందిన శకటంలో పంటలకు పిచికారీ చేసే డ్రోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డ్రోన్‌కు జాతీయ జెండా కట్టి పరేడ్ గ్రౌండ్‌లో గాలిలో ఎగిరేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. పెద్దలు ఆసక్తిగా తిలకించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన శాఖల అధికారులు మంత్రి, కలెక్టర్, సీపీతో గ్రూప్ ఫోటో దిగారు.



హనుమకొండలో పరేడ్ చేస్తున్న పోలీసులు

వీఐపీ వెళ్లకముందే బాంబ్ స్క్వాడ్ నిష్క్రమణ

మంత్రి వేదిక మీదికి వచ్చిన కొద్ది నిమిషాలకే పరేడ్ గ్రౌండ్‌లోని మరో గేట్ వద్ద ఉన్న డాగ్ అండ్ బాంబ్ స్క్వాడ్ సిబ్బంది డాగ్‌తో పాటు మందు గుండు సామాగ్రి కనిపెట్టే పరికరాలను పట్టుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గ్యాలరీలో ఉన్న సందర్శకులు అంతా ముక్కున వేలు వేసుకున్నారు. దీంతో వీఐపీలకు, ప్రజలకు కల్పించే భద్రతలో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపించింది. జెండావిష్కరణ అనుకున్న సమయం కంటే కొంత ఆలస్యంగా జరగడం, ఎండ వేడిమి పెరగడంతో నృత్యాలు వేసే విద్యార్థులు ఇబ్బందికి గురైయ్యారు.

వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు



అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు


న్యూశాయంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఆ సంఘం భవనంలో జరిగాయి. కౌంటింగ్ సోమవారం ఉదయం ముగియగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, పేరాల మధుసూదన్‌రావుపై 323 ఓట్ల తో విజయం సాధించారు. సంఘంలో మొత్తం ఓట్లు 2,396 ఉండగా 1,434 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్షుడిగా పిన్నింటి బాలచందర్ రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తక్కళ్లపల్లి శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సిద్ధూరి స్వామిరావు, సంయుక్త కార్యదర్శిగా పల్లెపాటి విద్యాసాగర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా పుస్కూరి రఘుకుమార్, గండ్ర ప్రభాకర్‌రావు, తక్కళ్లపల్లి బలరామరావు, మార్తినేని రవీందర్‌రావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, తక్కళ్లపల్లి అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, లింగంపల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, జలగం రంజిత్‌కుమార్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతనఅధ్యక్షుడువెంకటేశ్వర్‌రావును బంధువులు,స్నేహితులు సన్మా నించారు. వెలమ సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తానని వెంకటేశ్వర్‌రావు అన్నారు.

వివేక్‌నగర్ అభివృద్ధి సంక్షేమ సంఘం ఎన్నిక

వడ్డెపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌లోని వివేక్‌నగర్ కాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా లింగంపల్లి వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బుర్ర విజయపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొప్ప శివశంకర్, కోశాధికారిగా డాక్టర్ రాచర్ల గణపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీవాసుల సహకారంతో కాలనీ అభివృద్ధి చేస్తామని వారు తెలిపారు.



అధ్యక్షుడు వేణుగోపాల్ రావు



ప్రధాన కార్యదర్శి విజయ పాల్

నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖ యంత్రాంగాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. వరంగల్‌లో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో 731 మంది పరీక్షలకు హాజరవుతుండగా, హనుమకొండ జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 483 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే వంద రోజుల ప్రణాళిక సాధ్యం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే వంద రోజుల ప్రణాళిక సాధ్యమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో నిర్వహించిన వంద రోజుల ప్రణాళిక తెలంగాణ రైజింగ్ - 2047 పోస్టర్‌ను నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వరంగల్ నగరం హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. నగరం పచ్చదనం, పరిశుభ్రత కోసం ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కుబడిగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే విజయం సాధించలేమని చేసే పనిలో నిబద్ధత ఉండాలన్నారు.

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ నగరం పచ్చదనం, పరిశుభ్రత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగిందని అన్నారు. వంద రోజుల్లో వరంగల్ నగరాన్ని క్లీన్ సిటీగా రూపుదిద్దడం జరుగుతుందని అన్నారు. అనంతరం బల్దియా కార్యాలయం నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, బల్దియా సిబ్బంది ఫ్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, జక్కుల రవీందర్ యాదవ్, సురేందర్, కావటి కవిత, అరుణ, పద్మ, సురేష్‌జోషి, రవి, అరుణ, ఉమ, చందన, స్వరూపరాణి, అనీల్‌కుమార్, విజయశ్రీ రజాలీ, వేముల శ్రీనివాస్, లోహిత, జక్కుల రజిత పాల్గొన్నారు.

క్రైస్తవులకు మాటిచ్చాం.. నిలబెట్టుకున్నాం

ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

హనుమకొండ సిటీ, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమలోని క్రైస్తవులకు సమాధి తోట కోసం భూమిని కేటాయిస్తామన్న మాటను నిలబెట్టుకున్నామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు ఎంపీ కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సంయుక్తంగా వెల్లడించారు. సోమవారం హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో వరంగల్ పశ్చిమ క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో 'కృతజ్ఞత అభినందన సభ ' జరిగింది. సమాధి తోట స్థలం కేటాయింపుపై ఏర్పాటైన సభలో క్రైస్తవ సమాజం ప్రతినిధులు, పాస్టర్లు, బిషప్‌లు ఎంపీ క్యావ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజును ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు మాట్లాడారు. ఎన్నికలకు ముందు క్రైస్తవులకు సమాధి తోట కోసం స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన 16 నెలల వ్యవధిలోనే మడికొండలో మూడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సమాధి తోట స్థలం కేటాయింపు మాత్రమే కాకుండా ప్రహరీ, విద్యుత్, నీటి కల్పన తదితర సౌకర్యాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మరో రెండు ఎకరాల కేటాయింపు జరుపుతామని ప్రకటించారు. సభలో పాస్టర్లు రెవ. ఐజక్, రెవ. జి.జె.నిరంజన్‌బాబు, జోసఫ్ ప్రభాకర్, రెవ. కురియన్, రెవ. జయప్రకాశ్, ఫాదర్ జోసఫ్, బిషప్ జాన్ మార్కెండేయతో పాటు హనుమకొండ సీబీసీ అధ్యక్షులు టీ విజయ స్వరూప్, ప్రధాన కార్యదర్శి టీ క్రిష్టఫర్ రూబెన్, జాయింట్ సెక్రెటరీ కే విద్యాకర్, కోశాధికారి విల్సన్, జాన్సన్ ప్రసాద్, పాల్ తదితర సీబీసీ సంఘ ప్రతినిధులు, మహిళా సమాజం ప్రతినిధులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఆనంద్ మోజెస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ శ్రవన్‌కుమార్, బోడ డిన్నా తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ క్యావ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఎల్ నాగరాజును సన్మానిస్తున్న వరంగల్ పశ్చిమ క్రైస్తవ సమాజం ప్రతినిధులు, పాస్టర్లు